RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 04.02.2026 | సంపుటి :12 సంచిక : 196 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

అపార అవకాశాలు వస్తాయి : ప్రధాని మోడీ

ఎన్ని విమర్శలు వచ్చినా సహనంతోనే గెలిచాం

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని హర్షం

- ఎన్‌డీఏ సమావేశంలో ప్రధానిని సన్మానించిన ఎంపీలు
- దేశ భవిష్యత్తును మార్చే ఒప్పందం ఇది కేంద్రమంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కు దుర్బుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి

మిగతా 2లో..

అమెరికా వాణిజ్య ఒప్పందం విజయవంతం సందర్భంగా ప్రధాని మోదీని సన్మానిస్తున్న ఎన్‌డీఏ ఎంపీలు

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

కాంగ్రెస్ శ్రేణులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

- జూబ్లీహిల్స్ క్యాంపు కార్యాలయంలో మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ
- మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల రాజకీయ పరిణామాలపై చర్చ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్? కొంతమంది మంత్రులతో తా?జాగా సమావేశమయ్యారు. ఈరోజుతో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు బీ-ఫాం అందజేత కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఇప్పటికే అభ్యర్థుల తరఫున జోరుగా కొనసాగుతున్న ప్రచారం మరింత విస్తృతం కానుంది. 116 మున్సిపాలిటీలకు, 7 కార్పొరేషన్‌లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. వారం రోజులపాటు ప్రచారం నిర్వహించుకునేందుకు అవకాశం ఉండడంతో వ్యూహాలకు అధికార పార్టీ పదును పెడుతోంది. అందులో భాగంగా ఇవాళ పార్లమెంట్ వారీగా ఇంఛార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులు, సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయా పార్లమెంటు నియోజక

వర్గాల పరిధిలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలాబలాలు, ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షీ నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంఛార్జి మంత్రులు, సీనియర్ నాయకులు

మిగతా 2లో..

రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గిస్తామని భారత్ హామీ ఇచ్చింది

- అందుకే ట్రేడ్ డీల్ కు అంగీకరించాం
- అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహమ్

2 లో..

భారత్ చమురు కొనుగోలు నిలిపివేస్తుందన్నది

అవాస్తవం

- ఈ విషయమై మాకు న్యూఢిల్లీ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదు
- డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన రష్యా

రైతుల కష్టాన్ని, దేశాన్ని మోదీ అమ్మేశారు

ఆకస్మాత్తు ఒప్పందం వెనుక మర్మమేమిటీ? • రాహుల్ ఫైర్

- 4 నెలలుగా నిలిచి ఇప్పుడు ఎలా ఖరారైందో..!
- అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ లొంగిపోయారు
- అదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది
- అమెరికా ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ నేత ఆగ్రహం
- రైతులకు తీవ్ర ద్రోహం చేసిన మోడీ
- ఒప్పందంపై బిజెపి ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి
- అమెరికాతో వాణిజ్య ఒప్పందపై అఖిలేశ్ విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):

అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్

మిగతా 2లో..

దద్దరిల్లిన లోక్‌సభ

8 మంది సభ్యుల సస్పెన్షన్

న్యూఢిల్లీ(జనంసాక్షి): లోక్‌సభలో మరోసారి తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యుల ఆందోళనలతో సభ కార్యకలాపాలు మంగళవారం పూర్తిగా స్థంభించాయి. స్పీకర్ చైర్‌పై నిరసన వ్యక్తం చేస్తూ కొందరు సభ్యులు కాగితాలు చించి విసరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆ ఘటనపై కఠినంగా

మిగతా 2లో..

భారత చట్టాలను గౌరవించకుంటే

ఇక్కడినుంచి వెళ్లిపోండి

- దేశ గోప్యతను అడ్డుకోలేరు
- వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ
- మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల

మిగతా 9లో..

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల్లో సుప్రీంస్పష్టత

ఎంపికకు మా ఉత్తర్వులేవీ అడ్డం కాదు • స్పష్టం చేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ(జనంసాక్షి):

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు

ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.

క్రికెట్ సంఘాల్లో మాజీ ఆటగాళ్లే ఉండాలి

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి): నిపుణులు కాని వారు క్రికెట్ సంఘాలను నిర్వహించడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రికెట్ బ్యాట్ ఎలా పట్టుకోవాలో తెలియని వారికి క్రికెట్ సంఘాల్లో చోటు లేదని, రిటైర్డ్ ఆటగాళ్లే వాటికి నాయకత్వం వహించాలని స్పష్టం చేసింది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలపై బాంబే హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను

మిగతా 2లో..

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

సమర్ధవంతంగా ఎన్నికల నిర్వహణకు డీజీపీ శివధర్‌రెడ్డి పోలీస్ అధికారులకు దిశానిర్దేశం

హైదరాబాద్(జనంసాక్షి): మున్సిపల్ ఎన్నికలను చట్టం ప్రకారం సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల పోలీస్ కమిషనర్లు , జిల్లాల ఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్హెచ్ఓ) లతో మాట్లాడారు. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్తగూడెం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నిజామాబాద్, నల్గొండ, రామగుండం కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డులతో పాటు, 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈనెల 11వ తేదీన పోలింగ్, 13 తేదీన కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర పోలీస్ శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిజిపి సూచించారు. ఏ రకమైన ఫిర్యాదులు గాని ,అవాంఛనీయ సంఘటనలు గాని జరగకుండా చర్యలు తీసుకోవాలని డిజిపి స్పష్టం చేశారు. నిబంధనల మేరకు కఠినంగా వ్యవహరించాలని డిజిపి పోలీస్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పోలీస్ లీగల్ అడ్వైజర్ శ్రీ రాములు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన చట్టాల గురించి సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....చట్టం ప్రకారం ఓటర్లను ప్రభావితం చేయడం, ఒకరికే ఓటు వేయాలని ఒత్తిడి తీసుకురావడం లేదా నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, బాధితులపై సామాజికంగా లేదా ఆర్థికంగా బహిష్కరణలు విధిస్తే చట్టరీత్యా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేలా మద్యం పంపిణీ చేసినా, ఎక్సైజ్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కనీసం ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందనీ ,ఆయుధాల చట్టం ప్రకారం లైసెన్స్‌డ్ ఆయుధాలను కలిగి ఉన్న వారు నిబంధనల మేరకు పోలీస్ స్టేషన్లలో జమ

మిగతా 2లో..

ఎంఐఎం మాజీ ఎమ్మెల్యే

పాషా ఖాద్రీ ఇకలేరు

హైదరాబాద్(జనంసాక్షి): ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ (72) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. పాషా ఖాద్రీ 1986 నుంచి 1991 వరకు కార్పొరేటర్‌గా పనిచేశారు. 2004 నుంచి 2018 వరకు చార్మినార్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, 2018 నుంచి 2023 వరకు యాకుత్‌పురా ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు.

తెల్లారిన బతుకులు

ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు కూలీల మృతి

పలువురికి గాయాలు • జగిత్యాలలో ఘోర రోడ్డు ప్రమాదం..

జగిత్యాల(జనంసాక్షి): ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. వ్యవసాయ కూలీలు పసుపుకోతకు వెళ్లి తిరిగి వస్తుండగా.. మల్లాపూర్ మండలం ముగిలిపేట వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి నీటి గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. క్షత గాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

మాట తప్పిన సీఎంను నిరుద్యోగులు

క్షమించరు

- రెండేళ్లయినా అందని 2 లక్షల ఉద్యోగాలు
- అన్ని పట్టణాలపై గులాబీ జెండా ఎగురవేయాలి: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): రెండు లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గారి మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు. కేసీఆర్ గారి హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో "రిక్రూట్‌మెంట్ జీరో"గా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎండగట్టారు. అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని, పట్టుమని పదివేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత

మిగతా 2లో..

ఇది ఉచితాల బడ్జెట్ కాదు

తప్పుడు ప్రచారం మానుకోండి:కిషన్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో..

'ఎస్ఎఫ్‌డీఆర్' పరీక్ష విజయవంతం

- డీఆర్‌డీవో మరో ఘనత..
- దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో ముందడుగు చేసింది. గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధికి కీలకమైన 'సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్' సాంకేతికతను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. పరీక్షల్లో భాగంగా నాజిల్ లెస్ బూస్టర్, సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ మోటార్, ఫ్యూయల్ ఫ్లో కంట్రోలర్ వంటి అన్ని వ్యవస్థలు ఆశించిన రీతిలో అత్యుత్తమ పనితీరును కనబరిచాయి. ఐటీఆర్ ఏర్పాటు చేసిన వివిధ ట్రాకింగ్ పరికరాల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఈ పరీక్ష విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. 'ఎస్ఎఫ్‌డీఆర్' ప్రొపల్షన్ వ్యవస్థ పరీక్ష విజయవంతంతో శత్రు దేశాల

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04.02.2026

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

చేయాలని, లేనిపక్షంలో ఒక ఏడాది నుంచి మూడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించాలని నిబంధనలు ఉన్నాయన్నారు.మరోవైపు ఎన్నికల ప్రచార పర్వంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అనుసరించాల్సిన నిబంధనల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. బహిరంగ ప్రదేశాల డిస్ఫిగర్మెంట్ చట్టం-1997ను అనుసరించి ఎవరైనా అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించినా, అశ్లీల ప్రకటనలు ప్రదర్శించినా వాటిని తొలగించడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని, ధ్వని కాలుష్యాన్ని నియంత్రించేందుకు టౌన్ న్యూసెన్స్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు వాడటం చట్టరీత్యా నేరం. ప్రచార వాహనాల విషయంలోనూ మోటార్ వాహనాల చట్టం-1988 కింద అనేక ఆంక్షలు అమల్లో ఉన్నాయనీ, ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని, ఆ అనుమతి పత్రం యొక్క ఒరిజినల్ కాపీని వాహనం ముందు భాగంలో ప్రదర్శించాలన్నారు.మతపరమైన సంస్థలు, ప్రార్థనా మందిరాలను రాజకీయ ప్రయోజనాల కోసం, పార్టీ ప్రచారాల కోసం వాడుకోవడం మతపరమైన సంస్థల దుర్వినియోగ నిరోధక చట్టం-1988 ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందనీ, ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ కులమతాల మధ్య చిచ్చు పెట్టేలా ప్రవర్తించే వారికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు.బహిరంగ సభలు, ఊరేగింపుల నిర్వహణలో జిల్లా పోలీస్ చట్టం ప్రకారం ముందస్తు లైసెన్సులు పొందాలని, పోలీసుల సూచనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.వీటితో పాటు తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019 ప్రకారం ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా, రిగ్గింగ్ వంటి అక్రమాలకు పాల్పడినా శిక్షార్హులన్నారు. మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు , స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, శాంతి భద్రతల ఎఐజి శ్రీ రమణ కుమార్, తదితరులు వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గిస్తామని భారత్ హామీ ఇచ్చింది

అందుకే ట్రేడ్ డీల్ కు అంగీకరించాం

అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహమ్ వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎట్టకేలకు భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీనిపై అటు అమెరికా, ఇటు ఆసియా రాజకీయ, వాణిజ్య వ్యవహారాల పరిశీలకులు, ప్రజా ప్రతినిధులు కీలకమైన విశ్లేషణలు చేశారు. ఈ డీల్‌కు దారితీసిన పరిస్థితులు, కారణాలను వారు లోతుగా విశ్లేషించారు. రష్యా నుంచి ఆయిల్ కొనే దేశాలపై 500 శాతం సుంకాలను బాదాలనే వివాదాస్పద బిల్లును ప్రతిపాదించిన అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహమ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గిస్తామనే స్పష్టమైన హామీని భారత్ ఇవ్వబట్టే, ట్రేడ్ డీల్‌కు ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ పచ్చజెండా ఊపారని ఆయన అన్నారు. ఉక్రెయిన్‌పై ఎడతెరిపి లేని దాడులు చేస్తున్న రష్యాకు అతిపెద్ద ఆదాయ వనరుగా మారిన భారత్ లాంటి కస్టమర్‌ను దూరం చేయడంలో ట్రంప్ సఫలం అయ్యారన్నారు. మొత్తం మీద భారత్‌తో ట్రేడ్ డీల్, రష్యా - ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే విషయాల్లో ట్రంప్ ప్లాన్ సక్సెస్ అయిందని గ్రాహమ్ కొనియాడారు. ఈమేరకు ఎక్స్ వేదికగా ఆయన ఒక ట్వీట్ చేశారు. అమెరికా ప్రెసిడెంట్ భారీ సుంకాలను ప్రకటించినా, భారత్ చాలా సంయమనంతో వ్యవహరించిందని కొనియాడారు. ఈ విషయంలో భారత్‌ను ఇతర దేశాలు అనుసరించొచ్చన్నారు. భారత్ తన ప్రవర్తనా విధానంతో సుంకాల తగ్గింపు కంటే ఎక్కువగా మంచిపేరును సంపాదించిందని లిండ్సే గ్రాహమ్ కితాబిచ్చారు. రష్యా నుంచి చమురును కొంటున్న మిగతా పెద్ద దేశాలు రాబోయే రోజుల్లో భారత్‌ను అనుసరిస్తాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వాణిజ్యపరమైన ఒత్తిడి పెరిగితేనే ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రాధాన్యం ఇస్తారన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గిస్తామని ఇప్పుడు భారత్ తీసుకున్న నిర్ణయం అనేది ఆ దిశగా పడిన కీలక ముందడుగు లాంటిదన్నారు. "భారత్‌తో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నందుకు ప్రెసిడెంట్ ట్రంప్?నకు అభినందనలు. అమెరికాకు అత్యంత ఆప్తదేశం భారత్. దానితో వాణిజ్య అవరోధాలు తొలగినందుకు సంతోషంగా ఉంది. ఇండో- పసిఫిక్ ప్రాంతంలో చైనాను ఎదుర్కొనేందుకు అమెరికాకు భారత్ సహాయం అవసరం. కొత్త డీల్‌లో భాగంగా అమెరికా చమురును భారత్ కొంటుంది. రష్యాతో చమురు అనుబంధాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని ఆపొచ్చు" అని పేర్కొంటూ అమెరికా సెనెట్ విదేశీ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ జిమ్ రిష్చ్ ట్వీట్ చేశారు."ఇకపై భారత్‌కు మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులను అమెరికా రైతులు ఎగుమతి చేయొచ్చు. అతిపెద్ద భారత మార్కెట్ వల్ల గ్రామీణ అమెరికాకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. జనాభా పెరుగుతుండటం అనే అంశం భారత మార్కెట్‌ను మరింత ఆకర్షణీయంగా మారుస్తోంది. కొత్తగా కుదిరిన ట్రేడ్ డీల్ అమెరికాకు ప్రయోజనకరం. ప్రత్యేకించి మా వ్యవసాయ రంగానికి కలిసొస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో భారత్‌తో ట్రేడ్ చేసి 1.3 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును అమెరికా ఎదుర్కొంది. ఇకపై ఈ లోటు తగ్గుతుంది" అని అమెరికా వ్యవసాయ శాఖ మంత్రి బ్రూక్ రోలిన్స్ పేర్కొన్నారు.

భారత్ ప్రయోజనాల కోసమే
అమెరికాతో ట్రేడ్ డీల్

తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

దేశ భవిష్యత్తును మార్చే ఒప్పందం ఇది: పీయూష్ గోయల్

అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత ఉజ్వల భవిష్యత్తుకు ఒక శుభసూచకమని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ఒప్పందాన్ని ప్రధాని మోదీ కొలిక్కి తీసుకొచ్చారని, ఈ విషయంలో దేశమంతా ఆయనకు అభినందనలు చెబుతోందన్నారు. ఈ ఒప్పందంతో పేదలు, రైతులు, యువత, మత్స్యకారులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా.. పోటీదారులతో పోలిస్తే భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించిందన్నారు."అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటులో ప్రకటన చేద్దామని భావించాను. కానీ.. రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ గందరగోళ పరిస్థితులను సృష్టించింది. ఈ ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఆయన యత్నిస్తుండటం విచారకరం. దేశ ప్రగతితో ఆయనకు ఎలాంటి సంబంధం లేదు. ఈ ఒప్పందంలో మన దేశ వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల ప్రయోజనాలను ప్రధాని మోదీ పరిరక్షించారు. ట్రంప్‌తో ఉన్న సత్సంబంధాల కారణంగా రెండు దేశాల మధ్య మంచి ఒప్పందం కుదిరింది. ప్రతీకార సుంకాలను విధించింది అమెరికానే కాబట్టే.. సుంకాల తగ్గింపునకు సంబంధించిన ప్రకటన కూడా ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ నుంచే వచ్చింది. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తుది వివరాలను ఖరారు చేస్తున్నాం. త్వరలో సంయుక్త ప్రకటన విడుదల చేస్తాం" అని వెల్లడించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

చర్చించారు.పార్లమెంటు నియోజక వర్గాల వారీగా తాజా పరిస్థితులపై చర్చ ముగిసిన తరువాత ఆయా మున్సిపాలిటీలల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీల వారీగా డీసీసీ అధ్యక్షుల నుంచి పీసీసీ నివేదికలు తెప్పించుకుంది. ఆ నివేదికల ఆధారంగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు పీసీసీ వర్గాలు వెల్లడించాయి

రైతుల ప్రయోజనాలపై రాజీలేదు

ట్రేడ్‌డీల్ ప్రకటనపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌తో ట్రేడ్‌డీల్‌పై అంగీకారానికి వచ్చామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత్ కట్టుబడి ఉందంటూ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీలేదని స్పష్టతనిచ్చాయి. మన దేశానికి అగ్రరాజ్యం ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు భారత్ తొలినుంచి అంగీకరించడం లేదు. ఇప్పుడు కూడా అదే విషయాన్ని పునరుద్ఘాటించాయి. అలాగే వెనెజువెలా చమురు కొనుగోలు అంశం పరిశీలనలో ఉందని పేర్కొన్నాయి. అమెరికా తన రైతులకు భారీగా రాయితీలు ఇస్తుంటుంది. దాంతో వారు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెటింగ్ ధరల కంటే తక్కువకు అమ్మగలుగుతారు. కొన్ని సందర్భాల్లో పండించడానికి అయిన వ్యయంకంటే కూడా తక్కువకే ఎగుమతి చేస్తారు. వాటిపై భారత్ సుంకాలు తగ్గిస్తే.. మన రైతులపై తీవ్రప్రభావం పడుతుంది. ఇంతకాలం ట్రేడ్‌డీల్ చర్చల్లో ప్రతిష్టంభనకు ఇది కూడా ఒక కారణంగా ఉంది. తాజాగా ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గించిందా..? అనే ప్రశ్నలు ఎదురుకాగా, ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. "ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు వెనెజువెలా నుంచి మనం చమురు కొనుగోలు చేయలేదు. ఇప్పుడు వాటిని ఎత్తివేశారు. ఆ చమురును కొంటాం" అని పేర్కొన్నాయి. ఇంధన కొనుగోళ్ల విషయంలో దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఉంటుందని చెప్పాయి.

దద్దరిల్లిన లోక్‌సభ

స్పందించిన స్పీకర్ మొత్తం బడ్జెట్ సమావేశాల కాలానికి ఎనిమిది విపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు.మంగళ వారం మధ్యాహ్నం పలు సార్లు వాయిదాల అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు సభ మళ్లీ సమావేశమైంది. ఆ సమయంలో చైర్‌లో ఉన్న ఎంపీ దిలీప్ సైకియా సభను ప్రారంభించగానే విపక్ష సభ్యులు నిరసనలు చేపట్టారు. నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లిన కొందరు సభ్యులు పత్రాలు చించి స్పీకర్ వైపు విసరడం కలకలం రేపింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ సభ్యులను గుర్తించారు.సస్పెండ్ అయిన వారిలో ఎంపీలు హిబీ ఈడెన్, అమరీందర్ సింగ్, రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గుర్జీత్ సింగ్, కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. వీరిపై మిగిలిన బడ్జెట్ సమావేశాల కాలానికి సస్పెన్షన్ విధించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. అనంతరం తీవ్ర గందరగోళం కొనసాగడంతో లోక్‌సభ బుధవారానికి వాయిదా పడింది.

పార్లమెంట్ వెలుపల నిరసన

మరోవైపు, ఎంపీల సస్పెన్షన్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో పార్టీ ఎంపీలు పార్లమెంట్ భవనం వెలుపల నిరసన వ్యక్తం చేశారు. అవన్నీ ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలని తెలిపారు. విపక్ష స్వరాన్ని అణిచివేస్తున్నారని వారు ఆరోపించారు. సభ్యులను సస్పెండ్ చేయడం అన్యాయమని, వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ నుంచి సస్పెండ్ అయిన తర్వాత హిబీ ఈడెన్ మాట్లాడుతూ, "ప్రతిపక్ష నాయకుడు పార్లమెంటు లోపల ఎందుకు మాట్లాడలేకపోతున్నారో స్పష్టంగా చెప్పారు. దానికి కారణం ప్రధానమంత్రి అమెరికా ముందు లొంగిపోయిన తీరు, వాణిజ్య ఒప్పందం కుదిరిన విధానం, ఆ ఒప్పందంలో జరిగిన అక్రమాలే. ఎప్?స్టీన్ విషయం పార్లమెంటులో చర్చించాల్సిన అంశం, కానీ ఈ విషయాలేవీ చర్చించడం లేదు. మేం సభ లోపల, వెలుపల మా నిరసనను కొనసాగిస్తాం. మా ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేశారు, కానీ మేం పార్లమెంటు లోపల, వెలుపల మా పోరాటాన్ని కొనసాగిస్తాం" అని తెలిపారు. అయితే లోక్‌సభలో గందరగోళానికి కారణంగా భారత్- చైనా సరిహద్దు ఘర్షణలకు సంబంధించిన అంశం నిలిచింది. 2020లో జరిగిన భారత్- చైనా ఘర్షణలపై మాజీ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన ప్రచురితం కాని పుస్తకంలోని కొన్ని విషయాలను సభలో ప్రస్తావించాలని రాహుల్ గాంధీ ప్రయత్నించారు. అయితే అవి అధికారికంగా వెలువడని సమాచారమని పేర్కొంటూ స్పీకర్ అనుమతి ఇవ్వలేదు. దీంతో కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనలు ప్రారంభించారు.రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ప్రభుత్వం కీలక జాతీయ భద్రతా అంశాలపై చర్చకు భయపడుతోందని ఆరోపించారు. సైన్యానికి సంబంధించిన విషయాలపై పారదర్శకత ఉండాలని, పార్లమెంట్‌లో చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని అన్నారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడమే కాకుండా సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. మరోవైపు అధికార పక్షం మాత్రం విపక్షంపై మండిపడింది. సభా నియమాలను పాటించకుండా, అల్లరి సృష్టించడం సమంజసం కాదని పేర్కొంది. సభా కార్యకలాపాలను అడ్డుకోవడం ప్రజల సమస్యల పరిష్కారానికి ఆటంకమని వ్యాఖ్యానించింది.

ఇది ఉచితాల బడ్జెట్ కాదు

ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్‌లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

రైతుల కష్టాన్ని, దేశాన్ని మోదీ అమ్మేశారు

వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు. నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు. మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడడానికి కారణాలను రాహుల్ వివరిస్తూ.. 'అదానీపై అమెరికాలో కేసు ఉంది. నిజానికి ఇది మోదీపై కేసు. ఎప్‌స్టీన్స్ ÷ల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.రైతులకు తీవ్ర ద్రోహం చేసిన మోదీ: అఖిలేశ్ భారత్ అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఈ ఒప్పందంతో కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం దేశ రైతులకు తీవ్ర ద్రోహం చేసిందని ఆయన ఫైర్ అయ్యారు. ఈ ఒప్పందం వల్ల అమెరికా వ్యవసాయోత్పత్తులకు భారత్ మార్కెట్‌ను తెరవడం.. దాదాపు 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ద్రోహం చేసినట్లేనని ఆయన ఆరోపించారు. ఈమేరకు ఆయన మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'రైతులపై బిజెపి మళ్లీ దాడి చేసింది. ఈ ఒప్పందంపై బిజెపి ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి. ఈ ఒప్పందం చేసుకోవాలని మీపై జరిగిన ఒత్తిడి ఏమిటి? అమెరికన్ వ్యవసాయోత్పత్తులు, ఆహార ధాన్యాలకు భారతదేశ మార్కెట్లను తెరవడం మన దేశ రైతులను మోసం చేయడమే. ఇప్పటికే దేశంలో 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. స్వాతంత్ర్యానికి ముందే బిజెపి సభ్యులు, వారి మిత్రపక్షాలు విదేశీయుల ఏజెంట్లుగా ఉన్నారు. నేటికీ వారు విదేశీ ఏజెంట్లుగానే ఉన్నారు. బిజెపి సభ్యులు, వారి మిత్రులు పదేపదే స్వావలంబన, స్వదేశీ గురించి మాట్లాడతారు. అలాంటిది.. దేశ ఆర్థిక వ్యవస్థను మోసం చేసినందుకు, అమెరికాతో ఒప్పందం చేసుకునేందుకు వారు ఎంత కమిషన్ సంపాదించారో ప్రజల్లోకి వెళ్లి చెప్పాలి' అని ఎక్స్ పోస్టులో అఖిలేష్ నిలదీశారు. అలాగే బిజెపి అనుసరిస్తున్న విధానాలు రైతులపై మాత్రమే కాకుండా దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి వర్గాలపై కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఎందుకంటే ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల నుండి లాభాలు ఆర్జించడానికి దారితీస్తుంది. దీనివల్ల కొత్తగా మధ్యవర్తులు ఆవిర్భవిస్తారు. ఫలితంగా అన్ని ఆహార పానీయాలు మరింత ఖరీదవుతాయి. అదే సమయంలో బిజెపీ ఈ కంపెనీల నుండి విరాళాలను కూడా సేకరిస్తుంది. దీనివలన ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మరింత పెరుగుతాయి. క్రమంగా ఇది మన రైతుల వ్యవసాయాన్ని, వారి ఆదాయాన్ని తగ్గిస్తుంది. వారి భూమిని ధనవంతులకు, కార్పొరేషన్లకు అమ్మవలసి వస్తుంది. భూమిని స్వాధీనం చేసుకోవమే బిజెపి, వారి మిత్ర పక్షాల అంతిమ లక్ష్యం అని అఖిలేష్ ఎక్స్‌లో తీవ్రంగా విమర్శించారు.

మాట తప్పిన సీఎంను నిరుద్యోగులు క్షమించరు

మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు.తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులకు, విద్యార్థులకు చేస్తున్న ఈ ద్రోహంపై వెంటాడుతామన్నారు. మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్ల నుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికే పోదని, నిరుద్యోగులకు, యువతకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు.కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారు. కేసీఆర్ గారి పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు 2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు.ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు న

పరీక్షల సమయంలో ఒత్తిడికిలోను కావద్దు

- విద్యార్థులకు వసతులు కల్పనలో నిర్లక్ష్యం వద్దు
- బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్

నల్గొండ (జనంసాక్షి) : పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఇష్టంగా చదవాలని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ శ్రీధర్ అన్నారు. బీసీ గురుకుల, హాస్టల్ విద్యార్థులకు 8వ తరగతి నుంచే ఇంగ్లీష్ లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. మంగళవారం నల్లగొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ హాస్టల్స్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ స్కూల్స్, గురుకుల విద్యాసంస్థల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో వెనుకబడటానికి ప్రధాన కారణం ఇంగ్లీష్ భాషపై సరైన అవగాహన లేకపోవడమేనని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చిన్న తరగతుల నుంచే రీడింగ్, రైటింగ్, స్పీకింగ్ స్కిల్స్‌ను పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. 8 వ తరగతి నుంచే ఇంగ్లీష్‌పై పట్టు సాధిస్తే టెన్త్, ఇంటర్ దశలో పరీక్షల భయం తగ్గి మెరుగైన ఫలితాలు సాధించగలుగుతారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే గురుకుల విద్యా విధానం మెరుగైనదని ప్రిన్సిపల్ సెక్రటరీ స్పష్టం చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన వాతావరణం, నాణ్యమైన బోధన, వ్యక్తిగత శ్రద్ధ లభిస్తోందని అన్నారు. గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థుల అకడమిక్ ప్రగతితో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసం జరుగుతోందని, ఈ విధానాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే సెక్రెటరీ బడుగు సైదులు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంగ్లీషు, మ్యాథ్స్ శిక్షణ, ప్రత్యేక తరగతులు నిర్వహించి భవిష్యత్తులో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ లో విజయం సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఆహార పదార్థాలు కల్తీ జరగకుండా సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. పేరెంట్స్ మీటింగ్ తప్పక పెట్టాలని, సొంత బిల్డింగ్ ఉన్న హాస్టల్లో మౌలిక సదుపాయాలు కావలసిన రిపేరు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఏ సంజీవ, ఉమ్మడి జిల్లాల ఆర్‌సివో స్వప్న, సంబంధిత శాఖాధికారులు, హాస్టల్ ఆఫీసర్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఘనపూర్ మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి : స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్ పూర్, ఫిబ్రవరి 03 (జనం సాక్షి) : ఘనపూర్ మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలి టీగా తీర్చిదిద్దుదామని, మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే ద్యేయంగా పని చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికలనేపథ్యం లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడి యం కావ్య మంగళవారం స్టేషన్ ఘనపూర్ పట్ట ణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అభ్యర్థుల చేతికి బీ-ఫామ్ లు అందజేశారు. బీ-ఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికా రులకు బి-ఫామ్ సమర్పించాలని ఎంపీ సూచిం చారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ అధికారికంగా పార్టీ తరపున బీ- ఫామ్‌లు అందాయని, ప్రభుత్వ ప్రజారంజక పాల న, అమలవుతున్న గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపు నిచ్చారు. వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వ యం చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ప్రత్యర్థుల వ్యూహాలను సమర్థంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు. స్టేషన్ ఘన పూర్ మున్సిపాలిటీలోని 18 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపు సాధిస్తారని ఎంపీ డాక్టర్ కడి యం కావ్య ధీమా వ్యక్తం చేశారు. స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ లో జరుగుతున్న అభివృద్ధినిచూసే ప్రజలుఓటువేయాలని పిలుపు నిచ్చారు. గతంలో వర్షం పడితే స్టేషన్ ఘనపూర్ వరదమయంగా మారేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకుండా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అభి వృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ లో ఇప్పటికే 50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారం భించారని చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత మరో 50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించారు. స్టేషన్ ఘనపూర్‌ను ఒక మోడల్ మున్సిపాలిటీ గా తీర్చిదిద్దుదామనిఅన్నారు. శివునిపల్లి, చాగల్, ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలి పించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లా డుతూ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని, నియోజకవర్గ అభివృ ద్ధే ఏకైక లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, చిల్పూర్ గుట్ట దేవస్థాన చైర్మన్ పొట్టపల్లి శ్రీధర్ రావు, నాయకులు బెలిదె వెంకన్న,బూర్ల శంకర్, పోగుల సారంగపాణి, నీల గట్టయ్య, బ్రహ్మారెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి,కొలిపాక సతీష్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చాడు... కత్తి గుచ్చాడు!

- నల్గొండలో రక్తపాతం

గోవిందరావుపేట (జనంసాక్షి) : నల్గొండ జిల్లాలో మానవత్వాన్ని దుర్వినియోగం చేసిన దారుణ ఘటన చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా కేంద్రం నుంచి వ్యక్తిగత పనుల నిమిత్తం తన కారులో హైదరాబాద్ బయలుదేరిన ఇమ్రాన్ అనే వ్యక్తి, మార్గమధ్యలో నార్కెట్‌పల్లి వద్ద లిఫ్ట్ అడిగిన ఓ గుర్తుతెలియని వ్యక్తిని మానవతా దృక్పథంతో కారులో ఎక్కించుకున్నాడు. అయితే చిట్యాల సమీపానికి చేరుకోగానే, ఆ వ్యక్తి అకస్మాత్తుగా ఇమ్రాన్‌పై కత్తితో దాడి చేశాడు. ఇమ్రాన్ మెడతో పాటు శరీరంపై విచక్షణ లేకుండా కత్తిపోట్లకు పాల్పడి, అతని సెల్‌ఫోన్ మరియు నగదు లాక్కునేందుకు దుండగుడు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాల మధ్య కూడా ఇమ్రాన్ ధైర్యంగా ప్రతిఘటించడంతో, భయాందోళనకు గురైన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఇమ్రాన్‌ను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అతడిని తక్షణమే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. హైవేలపై లిఫ్ట్ ఇచ్చే విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో జమాఖర్చులపై నిఘా

- ప్రతిపైసానూ లెక్కించనున్న అధికారులు

నిజామాబాద్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లపై అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం సోమవారం జరిగింది. మంగళవారం ఉపసంహరణలకు చివరి తేదీ కావడంతో ఎవరు బరిలో ఉన్నారన్నది ప్రకటించనున్నారు. పోలింగ్ ఈనెల 11న జరుగనుండగా మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారంపై అభ్యర్థులు చేసే ఖర్చు లెక్కింపు అధికారికంగా అమలులోకి వస్తుంది. ఎన్నికల ఖర్చును నిశితంగా తనఖీ చేస్తారన్న విషయాన్ని ప్రతీ అభ్యర్థి గుర్తుంచుకోవాలని అధికారులు సూచించారు. ఖర్చు రిజిస్టర్‌ను నిర్వహిస్తున్నారా? ప్రతీ ఖర్చుకు బిల్ లేదా రశీదు ఉందా? ఖర్చు పరిమితి దాటిందా? పార్టీ చేసిన ఖర్చు మీ ఖర్చులో చూపించారా?, సోష ల్ మీడియా ఖర్చు చేపించారా? ప్రచారానికి ఎన్ని వాహనాలు వాడుతున్నారు? అనుమతి తీసుకున్నారా? వాహనాలపై ప్లెక్సీలు అనుమతి మేరకే ఉన్నాయా? ర్యాలీలు, రోడ్ షోలు అనుమతి తీసుకున్నారా? తదితర వాటిని తనిఖీ చేస్తారు. కనుక మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎన్నికల సంఘం నిర్దేశిరచిన నియమ నిబంధనలను తూ.చ. తప్పక పాటించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారానికి గడువు వారం రోజులే ఉండడంతో బరిలో నిలిచన అభ్యర్థులు హైరానా పడుతున్నారు. మరోవైపు అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఖర్చు పరిమితిపై ఎన్నికల అధికారులు లెక్కింపు చేపట్టనున్నారు. పార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా ఇద్దరికీ ఖర్చు పరిమితి ఒకేలా ఉంటుంది. నగర పంచాయతీలకు రూ.2లక్షలు, గ్రేడ్3 మున్సిపాలిటీలకు రూ.3లక్షల వరకు, గ్రేడ్ 2 మున్సిపాలిటీలకు రూ.4లక్షల వరకు, గ్రేడ్1 మున్సిపాలిటీలకు రూ.5లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేయవచ్చు. ప్లెక్సీలు, బ్యానర్లు, వాహనాల అద్దె, మైక్ లేదా డీజే, సభలు, సమావేశాల నిర్వహణ, సో షల్ మీడియా ప్రచారం, కార్యకర్తలకు భోజనాలు, తాగునీరుపై పెట్టిన వ్యయాలన్నిటినీ ఎన్నికల ఖర్చు కిందే లెక్కిస్తారు. పార్టీ చేసిన ఖర్చు కూడా అభ్యర్థి ఖర్చుగానే పరిగణిస్తారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ నిర్వహించాలి. ఎన్నికల అధికారికి మధ్యలో, ఎన్నికల తర్వాత 30 రోజులలోపు రిజిస్టర్ తప్పక కూపించాలి. ఖర్చుల పరిమితి మించితే ఎన్నిక రద్దయ్యే ప్రమాదం ఉంది. అనర్హత వేసే, భవిష్యత్తు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించే అవకాశం ఉంది. ఎన్నికల ఖర్చు విషయంలో పార్టీ అభ్యర్థికి ప్రత్యేక సడలింపు అంటూ ఏమీ ఉండదు. స్వతంత్ర అభ్యర్థికీ అదే పరిమితి వర్తిస్తుంది. అభ్యర్థుల ఖర్చులపై అధికారులు గట్టి నిఘా వేసి ఉంచుతారు. ప్రతీ రూపాయి లెక్కిస్తారు. అయితే అభ్యర్థి అనుమతితో లేదా ఆదేశంతో జరిగిన ప్రతీ ఖర్చు కచ్చితంగా లెక్కలోకి వస్తుంది.

ఆగమాగంగా మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్

- తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు కోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్ (జనంసాక్షి) : గ్రామ పంచాయతీ ఎన్నికల మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిందని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు కోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో వారిద్దరు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామపంచాయితీలను మున్సిపాలిటీల్లో, మున్సిపాలిటీలను కార్పొరేషన్లలో కలపటం తప్ప ఏం అభివృద్ధి చేశారు? అని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీలో పరిధిలో ఒక్క వర్షం పడితే ఆగమయ్యే పరిస్థితి ఉందని, పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ హయాంలో ఏం అభివృద్ధి జరిగింది? అని ప్రశ్నించారు. జాగృతి మద్దతుతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి తమ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, అన్ని వర్గాల కోసం పనిచేసే కవిత కూడా త్వరలోనే పార్టీ పెట్టనున్నారని తెలిపారు. ఆమె పెట్టబోయే పార్టీ కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారని, కవిత మద్దతిస్తున్న అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతిపక్ష పార్టీలు, అధికార కాంగ్రెస్ మున్సిపాలిటీలకు ఏం చేశాం? ఏం చేస్తామన్నది చెప్పి ఓట్లు అడగకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం, బీఆర్ఎస్ వాళ్లు జనాన్ని పోగు చేసి హంగామా చేయటం తప్ప ప్రజలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించడం లేదని, మున్సిపాలిటీల్లో చేసిన అభివృద్ధి ఏంటీ? హైదరాబాద్ నగర సుందరీకరణ ఏమైందన్న దానిపై రెండు పార్టీల స్పందన లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు, కాంగ్రెస్ రెండేళ్లు అధికారంలో ఉండి కూడా ప్రజలకు ఏమీ చేశామన్నది చెప్పుకోలేని దౌర్భగ్య పరిస్థితుల్లో ఉన్నారని, కేవలం ప్రజల దృష్టి మరల్చేందుకు పథకం ప్రకారం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని తెలిపారు. చాలా మున్సిపాలిటీల్లో సమస్యలు తిష్ట వేశాయని, తాగు నీళ్లు మోరి నీళ్లతో కలిసి కలుషితమవుతున్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని అన్నారు. సిటీలో పార్క్ ల స్థలాలు, చెరువులు కబ్జాలు చేస్తున్నారని, వాటి గురించి యువత ప్రశ్నిస్తే వారిని దిక్కున్న చోట చెప్పుకోండి అని అంటున్నారని తెలిపారు. కవిత జనంబాట కోసం వెళ్లినప్పుడు ప్రజలు ఎన్నో సమస్యలు చెప్పారని, వాటిని కవిత ప్రభుత్వం దృష్టికి తెచ్చారని తెలిపారు. అందుకే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగేందుకు వచ్చే అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను నిలదీయాలని కోరారు. ప్రజల సమస్యలను వదిలి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న వాళ్లను కచ్చితంగా ప్రజలు శిక్షిస్తారని, ఈ ఎన్నికల్లో జాగృతి అభ్యర్థులు సింహం గుర్తు పైన పోటీ చేస్తున్నారని, జాగృతి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అధ్వాన్న రోడ్డు దుస్థితిపై ఆందోళన

- మూకుమ్మడిగా గ్రామస్థుల నిరసన ధర్నా
- దిగివచ్చిన అధికారులు..పరిష్కారానికి హామీ

జనగామ, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : రోడ్డు అధ్వాన్నంగా ఉన్నప్పటికీ పట్టించుకోక పోవడంపై గ్రామంలోని యువత ఏకమయ్యింది. సమస్యపై ధర్నాతో అధికారుల దృష్టికి తీసుకుని వచ్చింది. జనగామ జిల్లాలోని కొడవటూరు కమాన్ క్రాస్ నుంచి బచ్చన్నపేట ఎస్సార్ పెట్రోల్ బంక్ వరకు గుంతలమయంతో అధ్వానంగా మారిన జనగామ- సిద్దిపేట రహదారిని వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ ఫైట్ ఫర్ బచ్చన్నపేట ఆధ్వర్యంలో మంగళవారం భారీ రాస్తారోకో ధర్నా నిర్వహించారు. రెండు గంటల పాటు నిర్వహించిన ధర్నాలో జనగామ, ఆలేరు, సిద్దిపేట వైపు వెళ్లే వాహనాలు ఎక్కడెక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా ప్రతిరోజు ఎంతోమంది ఈ గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారని అన్నారు. బైకులపై వెళ్లిన పలువురు యువకులు మృతి చెందిన సంఘటనలు ఎన్నో జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు పత్రికల ద్వారా సమస్యను విన్నవించిన కూడా అధికార యంత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవ రిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న వారి షాపుల్లోకి విపరీతంగా దుమ్ము వెళ్లడంతో వారు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. మాస్క్ పెట్టితేనే షాపు తెరవాలే తప్ప, వేరే మార్గం లేదన్నారు. కలెక్టర్ రావాలి. రోడ్డు నిర్మాణం పై హామీ ఇవ్వాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నా విరమించాలని ఎస్ఐ హమీద్ కోరిన వారు వినలేదు. జిల్లా స్థాయి అధికారులు రావాలి, తమకు కచ్చితంగా హామీ ఇవ్వాలి అంటూ మొండికేశారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ హస్సేన్ రాస్తారోకో వద్దకు వచ్చి, రోడ్డు నిర్మాణంపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో మాట్లాడి, పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో ఫైట్ ఫర్ బచ్చన్నపేట యూత్ సభ్యులు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, సిపిఎం, పార్టీల నాయకులు, వ్యాపారస్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించేలా అవగాహన

- ప్రతిజ్ఞ వెబ్‌సైట్ ప్రారంభంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారు. ఇది తెలంగాణలో బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. పౌరులు, తల్లిదండ్రులను రోడ్డు భద్రతకు స్పృహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యత అని సురక్షితమైన అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమై ప్రతి రహదారిపై కొనసాగుతాయని గుర్తించడం రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు వినియోగదారులలో క్రమశిక్షణ, అవగాహన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రోత్సహించే దార్శనికతను పునరుద్ఘాటించారు. పౌరులు ట్రాఫిక్ నియమాలను పాటించడానికి మరియు రోడ్డుపై ఉన్న ప్రతి జీవితాన్ని గౌరవించడానికి పౌర ప్రతిజ్ఞను తీసుకోవచ్చు, తల్లిదండ్రులు తల్లిదండ్రుల ప్రతిజ్ఞను ఉదాహరణగా తీసుకొని, పిల్లలలో సురక్షితమైన అలవాట్లను రూపొందించవచ్చు. ఈ చొరవ రోడ్డు భద్రత అంటే కేవలం అమలు మాత్రమే కాదని, కుటుంబాలు, పిల్లలు మరియు తెలంగాణలోని ప్రతి తోటి పౌరుడికి సమిష్టి వాగ్దానం అని గుర్తు చేస్తుంది.ఇది రోడ్డు భద్రతకు ప్రభుత్వం యొక్క బలమైన సంస్థాగత నిబద్ధతను ప్రతిబిం బిస్తుంది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..విద్యార్థులకు తల్లిదండ్రులతో ఉన్న బంధాన్ని రవాణా శాఖ రోడ్డు భద్రతకు ఉపయోగించుకోవడానికి ఈరోజు రవాణా శాఖ రోడ్డు భద్రత ప్రతిజ్ఞా వెబ్‌సైట్ ప్రారంభించిందిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రతిజ్ఞ రాబోయే కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించి కారణాలు రక్షించడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు.రోడ్డు నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర అగ్రిమెంట్ ద్వారా విద్యార్థులతో ఉన్న వారి బాండింగ్ తో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆకాక్షించారు. ఇది ఆన్‌లైన్‌లోలో క్షేత్ర స్థాయిలో ప్రతి మోటార్ వెహికిల్ ఉన్న వారి దగ్గరకు తీసుకుపోయి రవాణా శాఖ అధికారులు పెద్ద ఉద్యమంలో తీసుకుపో వాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య,రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్ పెట్టెం తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

- నలుగురు కూలీల మృతి

జగిత్యాల, ఫిబ్రవరి3 (జనంసాక్షి) : జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంజరిగింది. ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందారు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. వ్యవసాయ కూలీలు పసుపుకోతకు వెళ్లి తిరిగి వస్తుండగా.. మల్లాపూర్ మండలం ముగిలిపేట వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి నీటి గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

భద్రకాళిని దర్శించుకున్న
పవన్ సతీమణి

వరంగల్, ఫిబ్రవరి3 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన అన్నా లెజినోవాకు.. ఆలయ ధర్మకర్త తౌనుపునూరి వీరన్న స్వాగతం పలికారు. తొలుత ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్నపన మండపంలో ముఖ్యఅర్చకులు వెంకటనాగరాజ శర్మ, వేదపండితులు ప్రదీప్ కుమార్ శర్మ మహదాశీర్వచనం పలికి.. అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు గుంటూరు పర్యటనకు జగన్

- అంబటి రాంబాబును పరామర్శించనున్నట్లు వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి3 (జనంసాక్షి) : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరులో పర్యటించనున్నారు. అంబటి రాంబాబు కుటుంబాన్ని వైఎస్ జగన్ పరామర్శించ నున్నారు. టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన ఇల్లు, ఆఫీసుని వైఎస్ జగన్ పరిశీలించనున్నారు. టీడీపీ గూండాలు అంబటి నివాసంపై దాడి చేసి.. ఆయన్ని, కుటుంబ సభ్యులను హత్య చేయాలని ప్రయత్నించిన సంగతి తెలిసిందే. అంబటి రాంబాబు కుటుంబాన్ని వైఎస్ జగన్ పరామర్శించి ఓదార్చనున్నారు. దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి.. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకోనున్నారు.

భారత ఆర్థిక భవిష్యత్తును మలిచే అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం

21వ శతాబ్దపు ప్రపంచ రాజకీయ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్య ఒప్పందాలు కేవలం వస్తు మార్పిడికే పరిమితం కావడం లేదు. అవి దేశాల మధ్య వ్యూహాత్మక విశ్వాసానికి, భవిష్యత్ ఆర్థిక దిశానిర్దేశానికి, ప్రపంచ మార్కెట్‌లో స్థాన బలపాటుకు కీలక సాధనాలుగా మారాయి. అటువంటి నేపథ్యంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశాలైన అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం చరిత్రలో ఒక కీలక మలుపుగా పరిగణించాల్సిన అవసరం ఉంది. 2025 ప్రాంతంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన ఉన్నతస్థాయి చర్చల ఫలితంగా ఈ ఒప్పందం రూపుదిద్దుకోవడం భారత ఆర్థిక వ్యూహంలో ఒక స్పష్టమైన మార్పును సూచిస్తుంది.

భారత ఆర్థిక వ్యవస్థ 1991 ఆర్థిక సంస్కరణల అనంతరం ప్రపంచ మార్కెట్ వైపు అడుగులు వేసింది. అప్పటి నుంచి 2000 నుంచి 2024 వరకు భారత జిడిపి సగటు వృద్ధిరేటు సుమారు 6.5% స్థాయిలో కొనసాగింది. 2023--24 ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధిరేటు సుమారు 7% నమోదు చేయడం గమనార్హం. ఈ నేపథ్యంతో అమెరికా వంటి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తితో వాణిజ్య ఒప్పందం కుదరడం భారత్‌ను ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా బలమైన అడుగుగా మారింది.

ఈ ఒప్పందంలో కీలకమైన అంశం భారతీయ వస్తువులపై అమెరికా విధిస్తున్న సుంకాల స్థాయి. సగటున భారతీయ ఉత్పత్తులపై 18% సుంకం విధించడమే కాకుండా అనేక రంగాల్లో సుంకాల సరళీకరణకు అమెరికా అంగీకరించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ గణాంకాల ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి దిగుమతులపై అభివృద్ధి చెందిన దేశాలు విధించే సగటు సుంకం 25% నుంచి 30% మధ్య ఉంటుంది. ఆ దృష్ట్యా భారత్‌పై 18% సుంకం తక్కువ స్థాయిగా భావించవచ్చు. ఇది భారత ఎగుమతిదారులకు గణనీయమైన ఊరటనిచ్చే అంశంగా మారింది.

భారత ఎగుమతుల నిర్మాణాన్ని పరిశీలిస్తే 2024 నాటికి మొత్తం ఎగుమతుల్లో తయారీ రంగ వాటా సుమారు 70%గా ఉంది. వస్త్ర పరిశ్రమ, ఔషధ ఉత్పత్తులు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఐటి సేవలు ఈ ఎగుమతుల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అమెరికా మార్కెట్‌లో భారత ఔషధ రంగానికి ఉన్న వాటా ఇప్పటికే 40%కు చేరింది. తాజా ఒప్పందంతో 2026 నాటికి ఈ వాటా 45% నుంచి 50% స్థాయికి పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది భారత ఆరోగ్య రంగానికి విదేశీ మారకద్రవ్య ఆదాయాన్ని గణనీయంగా పెంచుతుంది.

ఇదే విధంగా ఐటి సేవల రంగం ఈ ఒప్పందం ద్వారా మరింత బలోపేతం అవుతుంది. 2024లో భారత ఐటి ఎగుమతుల విలువ సుమారు 190 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో అమెరికా మార్కెట్ వాటా దాదాపు 60%. వాణిజ్య ఒప్పందం కారణంగా వీసా విధానాల సరళీకరణకు సంబంధించిన సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనివల్ల 2027 నాటికి ఐటి సేవల ఎగుమతులు 250 బిలియన్ డాలర్ల స్థాయిని దాటే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఈ ఒప్పందం పెట్టుబడుల ప్రవాహంపైనా ప్రభావం చూపనుంది. 2020 నుంచి 2024 మధ్య కాలంలో అమెరికా నుంచి భారత్‌కు వచ్చిన ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు సుమారు 80 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వాణిజ్య ఒప్పందం తరువాత 2025 నుంచి 2030 మధ్య కాలంలో ఈ పెట్టుబడులు 120 బిలియన్ డాలర్లను దాటే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సెమీకండక్టర్ తయారీ, రక్షణ ఉత్పత్తులు, పునరుత్పాదక ఇంధన రంగాల్లో అమెరికా పెట్టుబడులు పెరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భారత ఉపాధి రంగంపై ఈ ఒప్పందం చూపే

ప్రభావం కూడా కీలకమైనది. ఎగుమతుల పెరుగుదల కారణంగా 2026 నాటికి సుమారు 1.2 కోట్ల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అంచనా. తయారీ రంగంలో ఉపాధి వాటా ప్రస్తుతం 17%గా ఉండగా 2030 నాటికి అది 25%కు చేరే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ నివేదికలు సూచిస్తున్నాయి. ఈ మార్పు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సైతం ఊతమిచ్చే అంశంగా మారుతుంది.

వాణిజ్య లోటు అంశం కూడా ఈ ఒప్పందంలో కీలకంగా నిలుస్తుంది. 2024 నాటికి అమెరికాతో భారత్ వాణిజ్య మిగులు సుమారు 35 బిలియన్ డాలర్లుగా ఉంది. సుంకాల తగ్గింపు, మార్కెట్ ప్రాప్యత పెరుగుదల కారణంగా ఈ మిగులు 2028 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ఇది భారత విదేశీ మారకద్రవ్య నిల్వలను మరింత బలపరుస్తుంది. ఇప్పటికే 2025 ప్రారంభంలో భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు 620 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి. ఈ ఒప్పందం వల్ల అవి మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రపంచ రాజకీయ దృక్పథంలో చూస్తే ఈ ఒప్పందం చైనా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా భారత్‌ను నిలబెట్టే ప్రయత్నంగా కూడా భావించవచ్చు. 2018 తరువాత అమెరికా-చైనా వాణిజ్య వివాదాలు తీవ్రతరం కావడంతో అమెరికా సంస్థలు సరఫరా గొలుసుల పునర్వ్యవస్థీకరణపై దృష్టి పెట్టాయి. ఈ సందర్భంలో భారత్ విశ్వసనీయ భాగస్వామిగా ఎదగడం ఈ ఒప్పందం ద్వారా మరింత స్పష్టమైంది. 2030 నాటికి గ్లోబల్ సరఫరా గొలుసుల్లో భారత్ వాటా 3% నుంచి 6%కు పెరగే అవకాశం ఉందని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అంచనా వేస్తున్నాయి.

మొత్తంగా పరిశీలిస్తే అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం తాత్కాలిక లాభాలకే పరిమితం కాకుండా దీర్ఘకాలిక ఆర్థిక బలోపేతానికి పునాది వేస్తోంది. 2025 నుంచి 2035 మధ్య కాలంలో భారత జిడిపి పరిమాణం 4 ట్రిలియన్ డాలర్ల నుంచి 7 ట్రిలియన్ డాలర్లకు పెరిగే అవకాశాలు ఈ ఒప్పందంతో మరింత బలపడుతున్నాయి. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలనే లక్ష్యానికి ఇది ఒక కీలక దశగా నిలుస్తుంది. ఆర్థిక స్వావలంబన, ప్రపంచ వాణిజ్యంలో గౌరవప్రదమైన స్థానం సాధన అనే దిశగా ఈ చారిత్రాత్మక ఒప్పందం భారత ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని స్పష్టంగా చెప్పవచ్చు.

భారత ఆర్థిక భవిష్యత్తును మలిచే అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం

అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందాన్ని కేవలం రెండు దేశాల మధ్య కుదిరిన వ్యాపార ఒప్పందంగా మాత్రమే చూడటం భారత ఆర్థిక ప్రయాణాన్ని తక్కువ అంచనా వేసినట్టే అవుతుంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థ దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఒక నిర్మాణాత్మక మార్పుకు సంకేతంగా నిలుస్తోంది. 1991లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు భారతదేశాన్ని ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేశాయి. అయితే 2025 ప్రాంతంలో కుదిరిన ఈ వాణిజ్య ఒప్పందం భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కేంద్ర బిందువుగా నిలబెట్టే శక్తిని కలిగి ఉంది.

భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పటివరకు సేవారంగ ఆధారిత వృద్ధిపై ఎక్కువగా ఆధారపడింది. 2024 నాటికి సేవారంగం జిడిపిలో సుమారు 55% వాటాను కలిగి ఉంది. తయారీ రంగ వాటా మాత్రం 17% వద్దనే నిలిచిపోయింది. ఈ అసమతుల్యత దీర్ఘకాలిక అభివృద్ధికి సవాలుగా మారింది. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం తయారీ రంగాన్ని ప్రోత్సహించే దిశగా కీలక మలుపుగా మారుతోంది. అమెరికా మార్కెట్‌కు భారత తయారీ ఉత్పత్తులకు విస్తృత ప్రాప్యత లభించడం వల్ల 2030 నాటికి తయారీ రంగ వాటా 25%కు చేరే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి.

ఈ ఒప్పందం భారత ఎగుమతుల స్వరూపాన్ని కూడా మార్చే శక్తిని కలిగి ఉంది. ఇప్పటివరకు భారత ఎగుమతుల్లో ముడి పదార్థాలు, తక్కువ విలువ కలిగిన ఉత్పత్తుల వాటా గణనీయంగా ఉంది. తాజా వాణిజ్య ఒప్పందం కారణంగా అధిక విలువ కలిగిన ఉత్పత్తులు, సాంకేతిక ఆధారిత వస్తువులు, పరిజ్ఞాన ఆధారిత సేవలు ప్రధానంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. 2024లో భారత మొత్తం ఎగుమతుల విలువ సుమారు 780 బిలియన్ డాలర్లుగా ఉంది. 2030 నాటికి ఈ విలువ 1.5 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పెరుగుదల వెనుక అమెరికా మార్కెట్ కీలక పాత్ర పోషించనుంది.

విదేశీ పెట్టుబడుల పరంగా కూడా ఈ ఒప్పందం ఒక నూతన అధ్యాయాన్ని తెరుస్తోంది. ఇప్పటివరకు భారత్‌కు వచ్చిన ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల్లో ఎక్కువ భాగం సేవారంగానికి పరిమితమైంది. ఇప్పుడు సెమీకండక్టర్ తయారీ, ఆధునిక యంత్రసామగ్రి, రక్షణ పరిశ్రమ, పునరుత్పాదక ఇంధన రంగాలు అమెరికా పెట్టుబడులకు ప్రధాన ఆకర్షణగా మారుతున్నాయి. 2025 నుంచి 2035 మధ్య కాలంలో అమెరికా నుంచి భారత్‌కు వచ్చే పెట్టుబడులు 200 బిలియన్ డాలర్లను దాటే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ఇది భారత పారిశ్రామికీకరణకు గణనీయమైన ఊతమిచ్చే అంశంగా మారుతుంది.

ఈ ఒప్పందం ఉపాధి సృష్టిపై చూపే ప్రభావం భారత సామాజిక నిర్మాణాన్ని కూడా మార్చే శక్తిని కలిగి ఉంది. ప్రస్తుతం భారతదేశంలో వ్యవసాయ రంగంలో పనిచేసే జనాభా సుమారు 42%గా ఉంది. వ్యవసాయ ఆదాయం తక్కువగా ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అస్థిరత కొనసాగుతోంది. తయారీ రంగ విస్తరణ వల్ల గ్రామీణ ప్రాంతాలకు సమీపంలో పరిశ్రమలు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి. 2030 నాటికి సుమారు 3 కోట్ల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు ఈ ఒప్పందం ద్వారా ఏర్పడతాయని అంచనా. పరోక్ష ఉపాధి అవకాశాలు కలిపితే ఈ సంఖ్య 6 కోట్లను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

భారత విదేశీ వాణిజ్య సమతుల్యత పరంగా కూడా ఈ ఒప్పందం కీలకమైన మార్పును తీసుకురానుంది. గత దశాబ్దంలో చైనాతో వాణిజ్య లోటు భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచింది. 2023 నాటికి చైనాతో వాణిజ్య లోటు సుమారు 85 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెరికాతో వాణిజ్య మిగులు మాత్రం 35 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. తాజా ఒప్పందం కారణంగా అమెరికాతో వాణిజ్య మిగులు 2030 నాటికి 70 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. ఇది భారత విదేశీ మారకద్రవ్య నిల్వలను స్థిరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

విదేశీ మారకద్రవ్య నిల్వలు ఏ దేశానికైనా ఆర్థిక భద్రతకు కీలకమైన సూచికగా నిలుస్తాయి. 2025 ప్రారంభంలో భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు 620 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఈ ఒప్పందం వల్ల ఎగుమతులు పెరగడం, పెట్టుబడులు ప్రవహించడం కారణంగా 2030 నాటికి ఈ నిల్వలు 800 బిలియన్ డాలర్లను దాటే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది రూపాయి విలువ స్థిరత్వానికి కూడా బలమైన పునాదిగా మారుతుంది.

భౌగోళిక రాజకీయ కోణంలో చూస్తే అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం ప్రపంచ శక్తి సమీకరణాల్లో భారత పాత్రను మరింత పెంచుతోంది. 21వ శతాబ్దంలో ఆర్థిక శక్తి రాజకీయ శక్తికి మూలాధారంగా మారింది. చైనా ఆధిపత్యం పెరుగుతున్న నేపథ్యంతో అమెరికా తన వ్యూహాత్మక భాగస్వాములను బలోపేతం చేయాలనే దిశగా అడుగులు వేస్తోంది. ఈ సందర్భంలో భారత్ విశ్వసనీయ ప్రజాస్వామ్య భాగస్వామిగా ఎదగడం ఈ ఒప్పందం ద్వారా మరింత స్పష్టమైంది. ఇది భారత విదేశాంగ విధానానికి కూడా ఆర్థిక బలం అందిస్తుంది.

సాంకేతిక రంగంలో ఈ ఒప్పందం చూపే ప్రభావం దీర్ఘకాలికంగా భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంచే అంశంగా మారుతుంది. కృత్రిమ మేధ, ఆధునిక తయారీ సాంకేతికతలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, రక్షణ సాంకేతికతలు వంటి రంగాల్లో అమెరికా సంస్థలతో భారత సంస్థలు భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకునే అవకాశాలు విస్తరిస్తాయి. 2035 నాటికి భారత్ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో టాప్ 20 దేశాల జాబితాలో స్థానం సంపాదించే అవకాశాలు ఈ ఒప్పందంతో మరింత బలపడుతున్నాయి.

ఈ ఒప్పందం వల్ల వచ్చే లాభాలను పూర్తిగా పొందాలంటే విధాన పరమైన సన్నద్ధత అత్యంత అవసరం. భూ సేకరణ, కార్మిక చట్టాలు, పన్ను వ్యవస్థ సరళీకరణ, న్యాయ వ్యవస్థ వేగవంతం వంటి అంశాల్లో భారత ప్రభుత్వం నిరంతర సంస్కరణలు కొనసాగించాల్సిన అవసరం ఉంది. వాణిజ్య ఒప్పందం ఒక అవకాశం మాత్రమే. ఆ అవకాశాన్ని ఫలితంగా మార్చే బాధ్యత పాలక వ్యవస్థపై ఉంటుంది. 2025 నుంచి 2035 మధ్య కాలం భారత ఆర్థిక చరిత్రలో నిర్ణయాత్మక దశగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మొత్తంగా పరిశీలిస్తే అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక కొత్త దిశను చూపిస్తోంది. ఇది వృద్ధి రేట్లకే పరిమితం కాకుండా ఉపాధి, పెట్టుబడులు, సాంకేతిక పురోగతి, ప్రపంచ రాజకీయ ప్రభావం వంటి అనేక స్థాయిల్లో మార్పును తీసుకువచ్చే శక్తిని కలిగి ఉంది. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే ఇలాంటి వ్యూహాత్మక ఒప్పందాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం అనివార్యం. ఈ ఒప్పందం భారత భవిష్యత్తుకు ఒక బలమైన పునాది. ఆ పునాదిపై నిలబడి భారతదేశం ప్రపంచ ఆర్థిక వేదికపై గౌరవప్రదమైన స్థానం సాధించే దిశగా ముందుకు సాగుతుందనే నమ్మకం ఈ ఒప్పందం ద్వారా మరింత బలపడుతోంది.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

ఎంత బాగుంటుంది!

హిందూ ముస్లిం
అనుకొనే బదులు
నేను భారతీయుణ్ణి
అనుకుంటే -దేశం
ఎంతబాగుంటుంది!
వివక్షలుపెంచటంకాదు
భారతీయులంతాఒక్కటే
ఈ నినాదంతోకదులు!
చైనాను మించిపోతాం!
దేశం ఎంతబాగుంటుంది
గుళ్ళు మసీదులు
కూల్చటంకంటే -అవి
మనపూర్వ సంపద
అనుకునిముందుకెళితే
దేశంఎంతబాగుంటుంది!
వైజ్ఞానికరంగంలో
అభివృద్ధి సాధిస్తూ
150కోట్లజనంతో
శక్తివంతంగామారితే
దేశమెంతబాగుంటుంది!
అల్లాహోఅక్బర్లు
రాంభజనలు ఆపి
చెయ్యి చెయ్యి పట్టుకుని
ఎవ డొస్తాడో రండి అంటే
దేశం ఎంతబాగుంటుంది
మతాల గోల వదిలేసి
తరగతిగదుల్లో పిల్లలు
రాజ్యాంగ పీఠికపఠిస్తూ
లౌకికభావంపెంచుకుంటే
దేశంఎంతబాగుంటుంది
అప్పుడుఅమెరికాకేకాదు
దానిబాబుదేశానికైనా
సమాధానం చెప్పగలం!
అలాగేకాని జరిగితే
దేశంఎంతబాగుంటుంది
భిన్నత్వంలో ఏకత్వం
మనదేశనిజమైనబలం!
'హిందూ'ఒక్కటేచాలదు
కలసిఉంటేకలదు సుఖం
దేశం ఎంతబాగుంటుంది

తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

మెట్రో రోడ్లు, విల్లా కల్చర్
ఇది పురోగతా? లేక ప్రదర్శనా?

నగరం ఉదయం లేచే ముందు లోడ్లు తేస్తాయి. మెట్రో రైలు మొదటి సన్నదికి వినపడే సమయానికి, నగరపు శ్వాస వేగం పెరుగుతుంది. పది సంవత్సరాల క్రితం వరకూ మనం ఊహించని ఉక్కు సర్పం పైగా పరుగెత్తుతోంది. లోడ్లు విస్తరించాయి. హైటవర్లు పెరిగాయి. విల్లాలు ఆకాశాన్ని ముట్టేటా చుట్టుపక్కల విస్తరించాయి. పైకి చూస్తే ఇది పురోగతి కానీ లోపలికి చూస్తే మనస్సెడ్డి అడిగే మొదటి ప్రశ్న "ఇది పురోగతేనా? లేక ప్రదర్శన మాత్రమేనా?"

మెట్రోలో ప్రయాణించే వేలాది ముఖాలు ఒకేలా కనిపిస్తాయి. ప్రతి ఒక్కరూ ఎక్కడికో పరిగెడుతున్నారు, కానీ ఎందుకు పరిగెడుతున్నారో ఎవరికీ తెలియదు. మొబైల్ స్టేషన్ లో మునిగిపోయిన వారు జీవితం బయట ఏం జరుగుతుందో చూడలేకపోతున్నారు. గోడల మీదికి పెరిగిన లోడ్లు, అడుగుల కింద తగ్గిన సంబంధాలు. పురోగతి మన ముందు దూసుకుపో తుంటే, మనిషి వెనక్కి తగ్గుతున్నట్లు అనిపిస్తుంది. ఒకప్పుడు బస్సులో పలుకరించి మాట్లాడుకునే వారు, ఇప్పుడు ఒకరి పక్కన ఒకరు కూర్చున్నా కనీసం చూపులోనూ పలకరించరు. నాగరికత పెరిగింది, కానీ మనిషితనం తగ్గిపోయింది. విల్లాలు చూస్తే రాజమందిరాల్లా ఉంటాయి. కానీ ఆ గేట్లు మూసుకున్నప్పుడే అసలు భయం మొదలవుతుంది. పెద్ద గేట్లు, ప్రైవేట్ సెక్యూరిటీ, అంతస్తుల మీద అంతస్తులు ఇన్ని కలసి బయట ప్రపంచం నుంచి మనిషిని రక్షిస్తున్నాయా? లేక లోపలికి అతన్ని బందీ చేస్తున్నాయా? పక్కింటి మనిషి పేరు కూడా తెలియని జీవితం ఏ పురోగతికి సూచిక? ఓ కాలంలో 'సంబంధాలు' మన సంపద. ఇప్పుడు 'సెక్యూరిటీ' మన ఆస్తి. మనుషుల మధ్య పంతెనలు కట్టడం మానేసి, గేట్లు, కెమెరాలు, రక్షణ వ్యవస్థ లు కట్టే నాగరికత ఇది పురోగతి కాదు, భయంతో కూడిన ఒంటరితనం.

విల్లాల్లో నివసించే వారు ప్రతీ ఉదయం అందమైన తోటల్లో నడుస్తారు, కానీ తమ మనసుల్లో మొలకెత్తిన ఒంటరితనం మీద నడవలేరు. తల్లిదండ్రులు పెద్ద ఇల్లు కట్టించుకుంటారు, కానీ పిల్లలతో కూర్చుని పది నిమిషాలు మాట్లాడే సమయం ఉండదు. రెండు చెడ్రూమ్లు చాలనుకుంటే నాలుగు కట్టించుకుంటారు, కానీ అందులోని ఒక్కగదిలో కూడా నవ్వుల ప్రతిధ్వని వినిపించదు. ఇంటి పరిమాణం పెరిగితే మనసు కూడా పెరిగిందా? లేదంటే మనం కట్టుకున్న ఈ విల్లాలు మనలోని ఖాళీని దాచడానికి వేసుకున్న పెద్ద ముసుగేనా? రోడ్లు పెదల్చియ్యాయి, ట్రాఫిక్ తగ్గలేదు. కారణం రోడ్లు కాదు, మన మనసు. అవసరానికి మించిన వాహనాలు కొనడం, ప్రతి కుటుంబంలో ఒక్కో కార్ కాకుండా ఇద్దరికీ ఇద్దరు కార్లు. అందుకే రోడ్లు పరుగెడుతున్నా యి, కానీ మనం నిలిచిపోయాం. ప్రతి కొత్త ఫ్లైఓవర్ కింద పాత సమస్యలే. పేదరికం అక్కడే, బతుకుదెరువు కోసం పోరాటం అక్కడే, కాలుష్యం అక్కడే. మనం పైకి ఎత్తిన రోడ్లు కింద ఉన్న నిజాన్ని మరింతగా దాచేస్తున్నాయి.

మెట్రో స్టేషన్లు అందంగా ఉన్నాయి, కానీ ప్రజల ముఖాలు అలసిపోయాయి. పరుగులు పెరిగాయి, ప్రశాంతత తగ్గిపోయింది. రాత్రి పడకొండు గంటలకు కూడా అదే రద్దీ. ఒకప్పుడు మన ఇళ్లలో "రాత్రి భోజనం" అంటే కలిసి కూర్చోవడం. ఇప్పుడు అది కేవలం "టైం లేకపోవడం". అహారం వేడి, కానీ కుటుంబం చల్లగా. మెట్రో సిటీలో బతకడం అంటే అవకాశాలు ఎక్కువ,

కానీ ఆనందాలు తక్కువ.

మన సమాజం ఒకప్పుడు ఎలా ఉండేది? ఉదయం ఇంటి ముందు వచ్చే పాలవాడు పేరుమేరునా తెలిసిన మనిషి. పక్కింటి పిల్లలన్నీ మన పిల్లల్లాగే అనిపించేవారు. ఇప్పుడు? డీజిటల్ డోర్‌లాక్ వేసి, అపరిచిత మొబైల్ సంబర్లు బ్లాక్ చేస్తూ, మనుషుల్ని దూరం వేసుకుంటూ బతుకుతున్నాం. అభివృద్ధి ఇలాగేనా? పెద్ద ఇల్లు, ఖరీదైన ఫర్నిచర్, మెరిసే కార్లు ఇవన్నీ ఉన్నా మన గుండె ఖాళీగా ఉంటే దానికి అర్థం ఏమిటి?

ఇబ్బందులు, భయాలు, ఒంటరితనం కూడా విస్తరించాయి. పిల్లలు స్కూల్ బస్ కోసం పది అడుగులు కూడా నడవరు. పెద్ద వయస్సు వారు పది నిమిషాలు కూడా నడవరు. అంతా సౌలభ్యం... కానీ ఆరోగ్యం ఎక్కడ? అంతా ప్రదర్శన కానీ విలువ ఎక్కడ? మన కాలంలో ఒక వాక్యం విన్నాం: "గ్రామం ఇచ్చిన నీరు మన బలం."

ఇప్పుడు నగరం ఇచ్చిన నీరు కూడా డబ్బు పెట్టి కొనాల్సిందే.

అభివృద్ధి అంటే వెలుగులు, పెద్ద భవనాలు, విలాసమైన జీవనం కాదు. అభివృద్ధి అంటే మనసుకు ప్రశాంతత, కుటుంబానికి ప్రేమ, సమాజానికి నిబద్ధత. ఇవేవీ లేకపోతే మెట్రో పది నివేదికలు రాసినా, విల్లా ఇరవై అంతస్తులైనా అది ప్రదర్శన మాత్రమే.

చివరగా మనకు ఒకే ప్రశ్న ముందుకొస్తుంది:

"మనం సాధించినది ఎంత? మనం కోల్పోయింది ఎంత?" అభివృద్ధి కోసం పరిగెడుతూ మనిషితనాన్ని పదిలేశామా? లేదా ప్రదర్శన కోసం పరిగెడుతూ జీవితాన్ని మర్చిపోయామా? మెట్రో రైళ్లు ఎగిరే వేగంతో వెళ్లిపోతుంటే, మన మనిషితనం మాత్రం నెమ్మదిగా కిందపడిపోతోందా? ఈ ప్రశ్నకు సమాధానం మనమే కనుక్కోవాలి.

డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

తెలంగాణపై మరోసారి
మోదీ సర్కార్ వివక్ష

కేంద్ర బడ్జెట్ సమయం, తెలంగాణ రాష్ట్రానికి ఒక విషాదంగా మారింది. భారతదేశంలోని మరెన్నో రాష్ట్రాల కోసం విస్తృతమైన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు ప్రకటించిన మోదీ ప్రభుత్వం, తెలంగాణ వైపు మాత్రం శూన్యహస్తాన్ని చాపింది. ఈ పరిణామం రాష్ట్ర విభజన సమయంలో చేసిన హామీలను పూర్తిగా తుడిచిపెట్టిన తీరు, ప్రస్తుత రాజకీయ వాస్తవాలకు ఒక నీడలాగా నిలిచింది. ఇది కేవలం ఆర్థిక వైఖరి కాదు, రాష్ట్రం పట్ల కేంద్రం కలిగి ఉన్న రాజకీయ కక్ష దృక్పథానికి నిదర్శనం.బీజేపీ నుండి 8 మంది ఎంపీలను తెలంగాణలో గెలిపిస్తే వారు తెలంగాణలో అనేక పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయించలేనని అసమర్థులుగా నిలిచారు.ఇక పై బీజేపీని తెలంగాణలో గెలిపిస్తే ఏం జరుగుతుందో ఆ నాయకులే సమాధానం చెప్పాలి. చైతన్యం గల తెలంగాణ ఓటర్లు మరోసారి ఆలోచించాలి.

తాజా బడ్జెట్లో తెలంగాణ అభివృద్ధికి ముఖ్యమైన ఏ ప్రాజెక్టుకూ స్థానం లభించకపోవడం ఒక వ్యవస్థాపిత వివక్షకు సంకేతం. రాష్ట్ర ప్రభుత్వం అనేక సార్లు విజ్ఞప్తి చేసిన ప్రాథమిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులన్నీ నిరాదరణకు గురయ్యాయి. ట్రిపుల్ ఆర్, రేడియల్ రోడ్లు, రీజినల్ రింగ్ రోడ్ల వంటి రహదారి పరివర్తన ప్రాజెక్టుల కోసం అనుమతులు, నిధులు నిరాకరించబడ్డాయి. ఇటీవలి దశాబ్దంలో భారీగా పట్టణీకరణ, ఆర్థిక విస్తరణ చెందిన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలు భీభత్సంగా మారాయి. ఈ పరిస్థితిని పరిష్కరించడానికి చేపట్టిన మెట్రో రైలు ఫేజ్-2 మరియు ఇతర విస్తరణ ప్రాజెక్టుల కోసం రాష్ట్రం చేసిన ప్రతిపాదనలు కూడా కేంద్రం దృష్టిలో పడలేదు. రాష్ట్రం సగభాగం ఖర్చు భరించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ సహాయం లభించలేదు.

అంతర్జాతీయంగా పేరొందిన ఐటీ, ఎలక్ట్రానిక్స్ హబ్బుగా పరిణామం చెందిన హైదరాబాద్ ను భారతదేశపు సెమీకండక్టర్ ఉత్పత్తి కేంద్రంగా మార్చేందుకు అవసరమైన కేంద్ర మద్దతు కూడా లభించలేదు. దేశీయ విమాన సౌకర్యాలను మెరుగుపరిచే 'ఉడాన్' పథకం కింద వరంగల్, ఆదిలాబాద్, రామగుండం, కొత్తగూడెంలలో విమానాశ్రయాల నిర్మాణం, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను కలిపే 8 కొత్త రైలు మార్గాల నిర్మాణం వంటి ప్రతిపాదనలు కేంద్ర బడ్జెట్లో ఎడమచెయ్యి కూడా ఎత్తలేదు. సింగరేణి ఆధ్వర్యంలో 7 కొత్త బొగ్గు గనులు ప్రారంభించడం, పవర్ సిస్టమ్ డెవలప్మెంట్ ఫండ్ ద్వారా 6 విద్యుత్ ప్రసారణ ప్రాజెక్టులకు సహాయం, ఆదిలాబాద్ లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను పునరుద్ధరించడం వంటి ఉపాధి-సృజనాత్మక ప్రతిపాదనలు కూడా బడ్జెట్ పత్రంలో చోటు చేసుకోలేకపోయాయి. నీటి నిర్వహణ కోసం ముసీ నది పునరుజ్జీవనం, బాపూఘాట్ అభివృద్ధి, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, హైదరాబాద్ సీవేజీ మాస్టర్ ప్లాన్ వంటి పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మద్దతు కూడా ఇవ్వబడలేదు.

ఈ పరిస్థితిని మరింత వికటంగా మార్చే సంగతి ఏమిటంటే, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్రం చూపిన విభిన్న వైఖరి. ఏపీ రీఆర్గనైజేషన్ చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ కు రూ.15,000 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం, క్రిటికల్ మినరల్స్ కారిడార్ వంటి ప్రత్యేక ప్రాజెక్టులను మంజూరు చేయడం జరిగింది. హైస్పీడ్ రైలు కారిడార్ల విషయంలో కూడా, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మార్గాలు ఆంధ్రప్రదేశ్ గుండా వెళ్ళేలా ప్రణాళిక చేయడం వలన, ఆ రాష్ట్రానికి మాత్రమే ఎక్కువ ఆర్థిక, అభివృద్ధి లాభాలు లభించే పరిస్థితి ఏర్పడుతోంది. తెలంగాణలో

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

● రాష్ట్ర హౌసింగ్ సెక్రెటరీ, ఎం.డీ వీ.పీ.గౌతమ్

సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : ఇందిరమ్మ గృహ లబ్ధిదారులందరూ నిర్దేశిత గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యదర్శి, మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ కార్యదర్శి, మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ మంగళవారం జిల్లాలోని సదాశివపేట, కోహిర్ , జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోనీ గ్రామాలలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను కలిసి ఇసుక సరఫరా, బిల్లుల చెల్లింపులు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలను బట్టి వెంటదివెంట బిల్లులు చెల్లిస్తున్నామని, ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల క్షేత్రస్థాయి పరిస్థితిని మండలాల వారీగా హౌసింగ్ ఎం.డీకి వివరించారు. జిల్లాకు 12,479 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 8081 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని, అందులో 6549 ఇండ్లు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులకు నిర్మాణ దశల వారీగా బిల్లులు వెంటవెంటనే మంజూరు చేస్తున్నామని, ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణం అందిస్తూ నిర్మాణ పనులు చేపట్టేలా ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 1930 మంది లబ్ధిదారులకు రూ.21 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డీ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఇల్లు కట్టుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకుని అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరగాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులకు ఎలాంటి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లాలో అనేక మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి సంతృప్తికరంగా ఉందని, అయితే కొన్ని మండలాల్లో నిర్మాణాలు మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రౌండ్ కాని ఇళ్లను వెంటనే గ్రౌండ్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 4,000 ఇండ్లు రూఫ్ లెవెల్లో ఉన్నాయని, వాటిని మార్చి 31లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు ఏఈలు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలన్నారు.మోడల్ హౌస్‌లు పూర్తికాని ప్రాంతాల్లో ఎంపీడీవో కార్యాలయాల్లో హౌసింగ్ ఏఈలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇళ్లను సూపర్ చెక్ చేయాలని, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాల్లో సరైన సలహాలు, సూచనలు ఇస్తూ మోటివేట్ చేయాలని సూచించారు. న్యూ టెక్నాలజీ ద్వారా తక్కువ ఖర్చుతో నిర్మించిన ఇళ్లను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సర్పంచులు, లబ్ధిదారులకు చూపించి అపోహలను తొలగించాలని తెలిపారు. అదేవిధంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలకు సంబంధించిన అన్ని ఎంబిలు రికార్డు చేసి, లబ్ధిదారులకు స్వాధీనం చేయని ఇండ్లన్నింటిని హౌసింగ్ శాఖకు స్వాధీనం చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ ఏజెన్సీలకు ఆదేశించారు. రెండు నెలల్లోగా ఫైనల్ స్టేజీలో ఉన్న అన్ని ఇండ్లు పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ జిల్లా పీడీ చలపతిరావు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ డీఈలు, ఈఈలు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

● విధులకు గైర్హాజరు అయితే చర్యలు తీసుకుంటాం
● రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు గైర్హాజరు అయితే ఎన్నికల నిబంధనలను పాటించాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను హెచ్చరించారు.మంగళవారం జిల్లా క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలపై ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు.జిల్లాలో నిర్వహించే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన వార్డుల వారిగా విధులు నిర్వర్తించే ప్రీసైడింగ్, అసిస్టెంట్ ప్రీసైడింగ్ అధికారులతో కూడిన బృందాలను ,కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామన్నారు.ఇప్పటికే మొదటి విడత శిక్షణను ఎంపిక చేశామన్నారు.వివిధ కేంద్రాలలో పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు.రెండో విడత పోలింగ్ సిబ్బందికి ఈ నెల 6 తేదీన వారికి కేటాయించిన కేంద్రాలలో రెండవ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్,డీపీవో సురేష్ మోహన్, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరాలి

● బిజెపి జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ మల్లేష్ గౌడ్

మెదక్, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : మెదక్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల కో కన్వీనర్ మరియు రాజస్థాన్ రాష్ట్ర బీజేపీ మాజీ అభ్యక్షులు అశోక్ పరమాణి మరియు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వాది రంజిత్ మోహన్ మున్సిపల్ ఎన్నికల పర్యటనలో భాగంగా మెదక్ కార్యాలయానికి విచ్చేసి భారతీయ జనతా పార్టీ ప్రకటించిన బిజెపి అభ్యర్థులందరికీ మాట్లాడి ఈ ఎన్నికలు సందర్భంగా మెదక్ మున్సిపల్ పీఠం పైన భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేయాలని స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి మెదక్ మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ ఎంఎల్ఎన్ రెడ్డి, నందా రెడ్డి పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ సుభాష్ గౌడ్, ముక్కా సుధాకర్, మల్లారెడ్డి, బెండవీన లింగా గౌడ్, భారతీయ జనతా పార్టీ ప్రకటించిన అభ్యర్థులు వార్డు ప్రబారీలు బిజెపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణలో మైక్రో పరిశీలకుల పాత్ర కీలకం

● విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మున్సిపాలిటీలు, మున్సిపల్ సంస్థల సాధారణ ఎన్నికలు 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో పోలింగ్ నిర్వహణలో మైక్రో పరిశీలకుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి తెలిపారు. విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మైక్రో పరిశీలకులకు సూచించారు. చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ కేంద్రాలలో పరిశీలన చేయాలని, కేంద్రం లోపల బయట నిరంతరం సూక్ష్మ పరిశీలన కొనసాగించాలని తెలిపారు. పూర్తిస్థాయిలో శిక్షణ తీసుకుని విధులు నిర్వహించాలని, సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో పరిశీలకుడిని నియమిస్తారని, విధుల సమయంలో తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలని తెలిపారు. పోలింగ్ ముందు రోజు కేంద్రాలకు చేరుకుని మాక్ పోలింగ్ విధానం, ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ ప్రతినిధుల నియామకాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతాన్ని తెలుసుకోవాలని, అనుమానాస్పద పరిస్థితులు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ పోలింగ్ ప్రారంభం, ముగింపు సమయాలను నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల గుర్తింపు కార్డులు పరిశీలించాలని, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా లేదా గమనించాలని తెలిపారు. పోలింగ్ సమయం ముగిసే సమయంలో క్యూలో ఉన్న ఓటర్లకు స్లిప్పులు ఇచ్చారా లేదా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ ముగిసిన తరువాత ఫారంలు సక్రమంగా నింపారా లేదా అనే విషయాన్ని నివేదికలో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు శక్తి ప్రసార ప్రదర్శన ద్వారా మైక్రో పరిశీలకుల విధి విధానాలపై శిక్షణ అందించారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్ట్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని పట్టపగలు గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని చందానగర్ పోలీసులు, సైబరాబాద్ ఎస్ఓటి విభాగం మరియు సిసిఎస్ బృందాల సహకారంతో అత్యంత చాకచక్యంగా నాటకీయ పద్ధతిలో అరెస్టు చేయడం జరిగింది. ఈ మేరకు మంగళవారం చందానగర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో శేరిలింగంపల్లి ఏసిపి సిహెచ్ వై శ్రీనివాస్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం... ఈ మధ్యనే చందానగర్ పోలీసులకు రెండు వేర్వేరు చైన్ స్నాచింగ్ లకు సంబంధించిన వివరాలతో కూడిన ఫిర్యాదులు అందడం జరిగింది. ఈనెల 31వ తేది మధ్యాహ్నం బిహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజి కాలనీ పరిధిలోని రామాలయం టెంపుల్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న 72 ఏళ్ల వృద్ధ మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకుని నిందితుడు పరారయ్యాడన్నారు. అదే సమయంలో సమీపంలోనే మరో 73 ఏళ్ల వృద్ధ మహిళను అడ్డగించి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పారిపోయాడు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడు రంగారెడ్డి జిల్లా లింగంపల్లి గోపినగర్‌కు చెందిన డి. రాజేష్ (32)గా గుర్తించామని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, చోరికి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లి జోన్ డిసిపి సిహెచ్. శ్రీనివాస్, ఎస్ఓటి విభాగం డిసిపి శోభన్ కుమార్, క్రైమ్స్ విభాగం డిసిపి ముత్యంరెడ్డి పర్యవేక్షణలో శేరిలింగంపల్లి జోన్ అడిషనల్ డిసిపి ఉదయ్ రెడ్డి నేతృత్వంలో ఈ కేసును శోధించి చేదించడం జరిగిందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేసిన సిబ్బందిని ఉన్నతాధికారులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

మున్సిపాలిటీ ఎన్నికల భద్రతపై డీజీపీ సమీక్ష

● సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా..
● ఎన్నికల చట్టాల అమలుపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం, స్పష్టమైన ఆదేశాలు
● రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి



గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : మున్సిపాలిటీ ఎన్నికలను పూర్తిగా శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ఆదేశించారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్ష సమావేశంలో జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎన్నికల నామినేషన్ దశ నుంచి పోలింగ్, కౌంటింగ్, ఫలితాల అనంతరం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని డీజీపీ సూచించారు. గత ఎన్నికల్లో నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, రిస్క్ ఎలిమెంట్స్‌పై ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టాలని, మున్సిపాలిటీ వారీగా సమస్యాత్మక,పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల రోజు,కౌంటింగ్ రోజు మాత్రమే కాకుండా, విజేత ర్యాలీలపై కూడా ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవాలని డీజీపీ స్పష్టం చేశారు.ఎన్నికల చట్టాలపై పోలీసు అధికారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ ఏపూరి రాములు ఎక్సైజ్ చట్టాలు,మున్సిపల్ ఎన్నికల నిబంధనలపై సమగ్ర వివరణ ఇచ్చారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం తయారీ, నిల్వ,రవాణా, అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు తావు లేకుండా చట్టపరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు జోగులాంబ గద్వాల జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు ప్రణాళికలు, సున్నిత ప్రాంతాల గుర్తింపు, పోలీసు బలగాల వినియోగం వంటి అంశాలను డీజీపీకి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ కె.శంకర్, గద్వాల డీఎస్పీ మొగిలయ్య,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి,ఎలక్షన్ సెల్ ఎస్సై కె.టి.మల్లేష్, డీసీఆర్బీ ఎస్సై సుకూర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పీఠం బీఆర్ఎస్‌దే..

ఫరూఖ్ నగర్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : షాద్ నగర్ మున్సిపాలిటీని బిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని అందుకు పార్టీ శ్రేణులు తీవ్రంగా శ్రమించి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ స్థానిక నేతలకు సూచించారు మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ అభ్యర్థులకు బీఫాంలు అందజేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఓట్లు అభ్యర్థించాలని కోరారు. పార్టీల సర్వేలన్నీ టిఆర్ఎస్ కే అనుకూలంగా ఉన్నాయని, కచ్చితంగా బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. పార్టీ నాయకత్వం బలంగా ఉందని అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. కేసీఆర్ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు మన అభ్యర్థులను గెలిపిస్తాయని, అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో పనిచేసే అభ్యర్థుల గెలుపులో ప్రముఖ పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం వందల కోట్ల నిధులను వెచ్చించామని, ప్రతి ఇంటికి మంచినీళ్లను అందించడంతోపాటు పారిశుద్ధ్య నిర్వహణను ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విషయాన్ని ప్రజలకు వివరించాలని, ప్రతి ఓటరును కలిసి బీఆర్ఎస్ పాలనను గుర్తుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

భూభారతి సర్వే సమగ్రంగా నిర్వహించాలి

● కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : భూభారతి సర్వే సమగ్రంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న భూభారతి సర్వే ప్రోగ్రాంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో కోస్గి కొత్తపల్లి నారాయణపేట షేర్ని పల్లి నర్వ జంగం రెడ్డిపల్లి లలో సర్వే చేయు నిమిత్తం ఫెంటాక్ అడ్వాన్స్ సహాయంతో సర్వే చేయుటకు గ్రామ సభలు నిర్వహించుటకు జిల్లా సర్వే అధికారి ఎ.డి.వేణు గోపాల్ రెడ్డి,వారి సిబ్బంది సర్వే పరికరం విధివిధానాల గురించి జిల్లా కలెక్టర్కు వివరించడం జరిగింది.

మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. దమ్మైగూడ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఈ మేరకు తీర్మానం చేశారు. అనంతరం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శులు బంగారు నర్సింగరావు, గడ్డం వెంకటేష్ మాట్లాడుతూ కీసర మండల పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని గతంలో అనేక ఆందోళనలు నిర్వహించినట్లు తెలిపారు. దమ్మైగూడ మున్సిపాలిటీగా ఉన్న సమయంలో అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించి అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 302 మందికి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే రెండు మూడు నెలలు మాత్రమే ఈఎస్ఐ, పిఎఫ్ నిధులు జమ అయ్యాయని, గత ఏడు నెలలుగా జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులను అడిగినా స్పష్టత ఇవ్వడం లేదని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కార్మికులకు అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీ జిహెచ్ఎంసిలో విలీనం అయిన తర్వాత కార్మికులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. కీసర సర్కిల్ మున్సిపల్ కమిషనర్ వసంత దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాల మార్పులతో కార్మికులకు ఉన్న సౌకర్యాలు తగ్గిపోయాయని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. కీసర మండల పరిధిలోని రాంపల్లి దాయరా, బండ్లగూడ, ఆర్జీకే కాలనీ, వెంకటేశ్వర నగర్ కాలనీ, దమ్మైగూడ, కుందనపల్లి, జేఎన్నూఆర్ఎం కాలనీ, గోధుమకుంట, కరీంగూడ ప్రాంతాలతో పాటు రాంపల్లి, బోగారం పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులను చైతన్యపరుస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కీసర మండల నాయకులు చింతకింది అశోక్, యూనియన్ కోశాధికారి మోత్కుపల్లి రాములమ్మ, దప్పు కృష్ణ, ముక్కెర కృష్ణ, చెన్నూరు కృష్ణ, వెంకటేష్, మహేష్, దేవేందర్, కట్ట జంగయ్య, పబ్బాల లలిత, జాన్ మోషా, పెంటమ్మ, జయమ్మ, మాతమ్మ, యాదమ్మ, బాలమ్మ, అశ్విని, కుమార్, మైసయ్య, అరుణ, భాగ్యమ్మ, మంకాలమ్మ, పోచయ్య, పుష్పలత, మణెమ్మ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04 ఫిబ్రవరి 2026

శాంతియుత ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు

● డీజీపీ శివధర్ రెడ్డి

వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : శాంతియుత ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్ రెడ్డి జిల్లా పోలీసులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో దృశ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయం నుండి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, జిల్లాలోని పోలీస్ అధికారులతో కలిసి దృశ్య సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.ఎన్నికలను పూర్తిగా శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు, ప్రతి స్థాయి పోలీసు అధికారి పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని డీజీపీ ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ... నామినేషన్ దశ నుంచి పోలింగ్, కౌంటింగ్, ఫలితాల అనంతరం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.గత ఎన్నికల్లో నేరచరిత్ర కలిగిన వారు, రౌడీషీటర్లు, రిస్క్ ఎలిమెంట్స్‌పై ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టాలని

ఆదేశించారు. మండల, పోలీస్ స్టేషన్ వారీగా సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల రోజు ,కౌంటింగ్ రోజున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. విజేత ర్యాలీలపై కూడా ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్సైజ్, మున్సిపల్ ఎన్నికల చట్టాలపై లీగల్ రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ ఏపూరి రాములు చే పోలీసు అధికారులకు ఎక్సైజ్ చట్టాలు, మున్సిపల్ ఎన్నికల నిబంధనలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం తయారీ, నిల్వ, రవాణా, అమ్మకాలకు సంబంధించిన నేరాలపై కఠినంగా వ్యవహరించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు తావు లేకుండా చట్టపరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. చట్ట పరిధిలోనే సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఎన్నికల స్వచ్ఛతను కాపాడాల్సిన బాధ్యత పోలీసులదేనని ఆయన తెలిపారు. ఈ దృశ్య సమీక్ష సమావేశంలో వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న భద్రతా చర్యలు, బందోబస్తు ప్రణాళికలు, సున్నిత ప్రాంతాల గుర్తింపు, పోలీసు బలగాల వినియోగం వంటి అంశాలను డీజీపీ గారికి వివరించారు.ఈ సమావేశంలో వనపర్తి ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్ రావు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, వనపర్తి సీఐ రత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, సీసీఎస్ సీఐ అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

నారాయణపేట, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : నారాయణపేట మండలం, లింగంపల్లిలో రెండవ మంగళవారం ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు భక్తులు పొటేత్తారు. మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.నెల రోజుల్లో ప్రతి మంగళవారం జరిగే జాతర ఉత్సవాలకు పరిసర గ్రామాల్లో ఉన్న భక్తులు బస్సులో, ప్రైవేట్ వాహనాల్లో భారీగా తరలి రావడంతో జనసంద్రంగా మారింది.

మున్సిపాలిటీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ

మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని అవుసులపల్లి, ఔరంగాబాద్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయనున్న భద్రతా ఏర్పాట్లపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అవసరమైన భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రజలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదనపు ఎస్పీ వెంట మెదక్ రూరల్ ఎసై లింగం, హవెలిఘనపూర్ ఎసై సత్యనారాయణ, ఏఎసై విట్టల్, సిబ్బంది ఉన్నారు.

7 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం

నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : మున్సిపల్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణపేట పట్టణంలోని ఎర్ర గుట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో ఎఫ్ఎస్‌టీ టీమ్, పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సికింద్రాబాద్‌కు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి యద్గిరి నుంచి సికింద్రాబాద్‌కు తరలిస్తున్న సుమారు 7 కేజీల వెండి ఆభరణాలను అధికారులు గుర్తించారు. వెండి ఆభరణాలకు సంబంధించిన తగు ఆధారాలు చూపించాలని కోరగా, సంబంధిత వ్యక్తి సరైన పత్రాలు సమర్పించలేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు అప్పగించడం జరిగింది,ఈ తనిఖీల్లో నారాయణపేట పట్టణానికి చెందిన యాదయ్య ,రూరల్ కానిస్టేబుల్ ఆనంద్ గౌడ్‌లు, ఎస్ఐ వెంకటేశ్వర్లు ,సిఐ శివ శంకర్ ల ఆధ్వర్యంలో పాల్గొని వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసిన వెండి ఆభరణాలను రాత్రి 12:00 గంటల సమయంలో గ్రీవియన్స్ కమిటీకి అప్పగించడం జరిగింది అని అధికారులు తెలిపారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా నేపథ్యంలో మున్సిపాలిటీ ఎన్నికల భద్రతపై రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, అధికారులతో దృశ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీసు కార్యాలయం నుండి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జిల్లాలోని పోలీసు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఎన్నికలను పూర్తి శాంతియుతంగా, స్వచ్ఛందంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి స్థాయి పోలీసు అధికారి పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని డీజీపీ ఆదేశించారు. నామినేషన్ దశ నుంచి పోలింగ్, కౌంటింగ్, ఫలితాల అనంతరం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. గత ఎన్నికల్లో నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, రిస్క్ ఎలిమెంట్స్‌పై ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల, పోలీస్ స్టేషన్ వారీగా సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాన కలిగి ఉండాలని, ఎన్నికల రోజు మరియు కౌంటింగ్ రోజున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. విజేత ర్యాలీలపై ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవాలని

కూడా సూచించారు. మున్సిపల్ ఎన్నికల చట్టాలపై రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ ఏపూరి రాములు పోలీసు అధికారులకు సమగ్ర లీగల్ అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం తయారీ, నిల్వ, రవాణా, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీజీపీ అడిగిన ప్రశ్నలకు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న భద్రతా చర్యలు, బందోబస్తు ప్రణాళికలు, పోలీసు బలగాల వినియోగంపై వివరించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, రంగా నాయక్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డు

సిద్దిపేట బ్యూరో, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : రాష్ట్రంలోని ఒక్కొక్కరికి 60 వేల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందని సిద్దిపేట బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు ఎల్లు రవీందర్ రెడ్డి లు అన్నారు. సిద్దిపేట మున్సిపల్ పరిధి 14 వార్డులో బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల బాకి కార్డులను ఇంటింటికి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో దివ్యాంగుల, వృద్ధులు, వితంతు పెన్షన్లను పెంచుతామని హామీ ఇచ్చి 25 నెలలు గడిచినా.. ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. మాజి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు సూచనలతో కాంగ్రెస్ మోసపూరిత విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కంటెం రాజు, నర్సింలు, ప్రభాకర్ రెడ్డి, పత్రి శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యూహాత్మకంగా బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో మార్పు

వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల బరిలో నిలుస్తున్న బి.ఆర్.ఎస్ అభ్యర్థులకు బీ.ఫామ్ లను అందజేసి, బీ,అలర్టుగా ప్రచారం నిర్వహించి,బిగ్ విజయం సాధించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి అభ్యర్థులకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి, మున్సిపల్ చివరి అంఖంవరకు,అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలను నిర్ణయించారని జిల్లా బిఆరెస్ మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తెలిపారు. పార్టీపట్ల విధేయత, నాయకుణ్ణి పట్ల విశ్వాసం కలిగిన నాయకులను, వివిధరూపాలలో సమాచారం సేకరించి, అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థులను నిర్ణయించారు. విశాల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని, మిత్రపక్షమైన సి.పి.ఎం పార్టీకి రెండు సీట్లు కేటాయించి, ప్రజా సమస్యల పట్ల స్పందించే సి.పి.ఎం.పార్టీ పట్ల తన ఉదారతను చాటుకున్నారు తెలిపారు.మొదటి విడతలో వనపర్తి అభ్యర్థుల జాబితాలో స్వల్ప మార్పులను చేస్తూ కార్యకర్తల ఏకాభిప్రాయంతో 17 వార్డు అభ్యర్థిగా మాదరావపల్లి.బాలరాజు, 24వార్డు అభ్యర్థిగా శిరీష రమేష్ గౌడ్‌లను ప్రకటించారు.

ఎంబీబీఎస్ అభ్యర్థికి టికెట్ కేటాయింపు

పెబ్బేరు మున్సిపల్ 4వార్డ్ అభ్యర్థిగా పి.పవిత్ర అనే ఎంబిబిఎస్ విద్యార్థిని,ప్రకటించి నూతన ఒరవడికి నీరంజన్ రెడ్డి శ్రీకారం చుట్టారు.నాయకుల చుట్టూ తిరిగి, నాయకులకు ప్రాధాన్యతతో పాటు, నిజంగా ప్రజలలో ఉండే క్రియాశీలకు నాయకులకు, ఏరికోరి నిరంజన్ రెడ్డి అభ్యర్థులుగా నిర్ణయించడంతో పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు.వనపర్తి, పెబ్బేర్ మున్సిపల్ అభ్యర్థులకు బీ ఫారంలు అందించి పార్టీకి, నాయకుణ్ణి నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, పలుస రమేష్ గౌడ్, దిలీప్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కర్రిస్వామి తదితరులు ఉన్నారు.

రైతులు చిరుధాన్యాల పంటలపై అవగాహన పెంచుకోవాలి

బిజినేపల్లి, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : రైతులు అన్ని వేళలో సంఘటితంగా ఉంటూ తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలని భారతీయ కిసాన్ సంగంజిల్లా ప్రధాన కార్యదర్శి గండ్ల చంద్రయ్య పిలుపునిచ్చారు భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం కిసాన్ సంగు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం గోమాతకు పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల పంటలను పండించాలని తద్వారా పంట మార్పిడితోపాటు అధిక దిగుబడి సాధించవచ్చునని అన్నారు గోమాత యొక్క విశిష్టతను ప్రజలకు వివరించాలని గో ఆధారిత వ్యవసాయం పైన రైతులు మక్కువ పెంచుకొని వ్యవసాయం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంగు జిల్లా సహాయ కార్యదర్శి గుద్దేటి ఆంజనేయులు గ్రామ సర్పంచ్ ఇందిర మండలాధ్యక్షులు మంతటి బాలస్వామి తదితరులు ఉన్నారు.

ప్రణాళికతో ఫలితాలు సాధించాలి

● మెదక్ జిల్లా విద్యాధికారి విజయలక్ష్మీ

పాపన్నపేట, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని మెదక్ జిల్లా విద్యాధికారి విజయలక్ష్మీ వ్యాఖ్యానించారు. మంగళవారం కొత్తపల్లి జడ్పీ,ప్రాథమిక పాఠశాల,భవిత కేంద్రాన్ని,యూసుఫ్ పేట జడ్పీ పాఠశాలను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ఉత్తమ ఫలితాలకు విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలను పాటించాలన్నారు. ఎంఈఓ ప్రతాప్ రెడ్డి, జడ్పీ ఇంచార్జి హెచ్ఎం.దత్తురెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు అమరావతి, మాలతీదేవి, ఉపాధ్యాయులు

శివకుమార్, వేణుగోపాల్, సోమశేఖర్, ప్రసాద్ రెడ్డి, స్వర్ణ, శారద, రాజశేఖర్, ఎఎస్ఓ నవీన్,సిఎమ్ఓ రాజు ఉన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరగాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఇంటర్ విద్యాధికారులకు సూచించారు. మంగళవారం కొల్చారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్ను పరిశీలించారు. ల్యాబ్ రూముల్ని, ల్యాబ్ మెటీరియల్ పరిశీలించి, ప్రాక్టికల్స్ ఏ విధంగా జరుగుతున్నాయి అని విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల రికార్డులను,సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థులు ప్రాక్టికల్స్ ని ప్రశాంతంగా చేసుకొని, ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు స్పెషల్ క్లాసులు అటెండ్ కావాలన్నారు. ఈ నెల 10 వ తేదీ వరకు జరగనున్న ప్రాక్టికల్స్ ని ప్రశాంతంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్యాధికారి మాధవి, చీఫ్ సూపర్డెంట్ నవీన్, కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

ఊర్కొండ, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : బిఆర్ఎస్ పార్టీ మహబూబ్నగర్ అధ్యక్షులు మాజీ మంత్రి డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ద్యాప వీరారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఊరుకొండ పేట లోని శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కేక్ కట్ చేసి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సంస్థల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులు వార్డు మెంబర్లను, కాంటెస్ట్ సర్పంచ్ లను ఘనంగా సత్కరించారు. అనంతరం జడ్చర్ల లో నిర్వహించు రక్తదాన శిబిరానికి వందలాదిమంది జిల్లా మండల నాయకులు, కార్యకర్తలు వెళ్లి రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గిరి నాయక్, జంగయ్య, కృష్ణ గౌడ్,కలిమిచర్ల గోపాల్ గుప్తా , సర్పంచులు మంజుల శ్రీనివాసులు, కదిరే శేఖర్ యాదవ్, మల్లేష్, ఉపసర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీ లు, మాజీ సర్పంచ్ లు,తాజా ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం

గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోనీ జన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ దేశ బడ్జెట్లో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందనీ, మన దేశము వ్యవసాయక దేశం రైతు బాగుపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు పోతుంది కానీ బిజెపి కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తి నిర్లక్ష్యం చేస్తున్నదనీ, గత సంవత్సరం లక్ష 72 వేల కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం లక్ష 63 వేల కోట్లు మాత్రమే కేటాయించి వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదనీ, గత సంవత్సరం బడ్జెట్లో కేటాయించిన దాదాపు 20 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగానికి ఖర్చు చేయలేదనీ, వ్యవసాయ నికి 3 శాతం కూడా బడ్జెట్ కేటాయించ లేదనీ, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసి విబి జి రామ్ జి పథకాన్ని తీసుకువచ్చిందనీ ,ఈ పథకానికి 94 వేల కోట్లు కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కానీ రాష్ట్ర ప్రభుత్వాలు 40% కేటాయిస్తేనే కేటాయించిన నిధులు ఖర్చు అవుతాయనీ రాష్ట్ర ప్రభుత్వాలు తీర్మానం చేయాలనీ ,రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పుకోక పోతే ఆ నిధులు ఖర్చు పెట్టరనీ, ఈ రకంగా 25 కోట్ల మంది వ్యవసాయ కూలీలకు తీవ్ర అన్యాయానికి గురి అవుతారనీ, విబి జీ రాంజీ పథకాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలనీ ,కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిర్లక్ష్యం చేయకుండా అధిక నిధులు కేటాయించే విధంగా ఆలోచించాలని తెలంగాణ రైతాంగ సమితి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందనీ గోపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్ తో పాటు, జోగులాంబ గద్వాల జిల్లా కమిటీ నాయకులు నాగరాజు, రామరాజు, మార్కు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశీలకులు విధులపై పూర్తి అవగాహనతో పనిచేయాలి

- లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఈవో భోజన్న

నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నందున తమ విధులపై స్పష్టమైన అవగాహనతో, నిష్పక్షపాతంగా పనిచేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారు మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన నియమాలు, పోలింగ్ కేంద్రాలలో పర్యవేక్షణ విధానం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, పోలింగ్ ప్రక్రియలో జాగ్రత్తలు వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సూక్ష్మ పరిశీలకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో జరిగే ప్రతి ప్రక్రియను నిశితంగా గమనిస్తూ, ఏవైనా అసాధారణ పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లు క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల స్వచ్ఛతను కాపాడటంలో తమ వంతు బాధ్యతను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గా ఉండాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ

హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : పదో తరగతి విద్యార్థులు విద్యా ప్రగతిలో మరింత మెరుగ్గా ఉండేవిధంగా ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యా బోధన సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్ పల్లి, నారాయణగిరి లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహించిన స్లిప్ టెస్ట్ ల గురించి ఆరా తీశారు.పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరిని కలెక్టర్ అడిగారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని అక్కడే ఉన్న డీఈవో ఎల్ వి గిరిరాజ్ గౌడ్ ను కలెక్టర్ ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులను చదువులో మరింత మెరుగుపరచాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల పునశ్చరణ (రివిజన్) చేయించాలన్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈవో గిరిరాజ్ గౌడ్, ఎంఈవో డాక్టర్ బి.రాంధన్ , తహసిల్దార్ గుత్తికొండ సదానందం, ఎంపీడీవో కమటం అనిల్ కుమార్, మల్లకపల్లి, నారాయణగిరి గ్రామాల సర్పంచులు గిన్నారపు లత, పుట్ట రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరుబయట కాలం చెల్లిన సిరప్‌లు!

- వైద్యాధికారి, వైద్య సిబ్బంది పనితీరుపై పలువురి ఆగ్రహం

చెన్నారావుపేట, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : కాలం చెల్లిన సిరప్ లను ఆరు బయట పడవేసిన సంఘటన చెన్నారావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం వెలుగు చూసింది. ప్రభుత్వం ఓ వైపు ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు లక్షల రూపాయలను వెచ్చించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మందులను పంపిణీ చేస్తుంది. ఆ మందులను వైద్యాధికారి, ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సబ్ సెంటర్లకు పంపిణీ చేసి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సి ఉంది. అందులో భాగంగానే ఐరన్ పోలిక్ యాసిడ్ సిరప్ లు 14 సంవత్సరాల లోపు వారికి అందించాల్సి ఉంది. కాని వాటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి, వైద్య సిబ్బంది ఆసుపత్రికి వచ్చిన వారికి అంతేకాక గ్రామాలలోని సబ్ సెంటర్లకు పంపిణీ చేయకపోవడంతో వాటి గడువు పూర్తయింది. గడువు పూర్తయిన వాటిని డిస్పోజల్ చేయాల్సి ఉంటుంది. అలా చేయకుండా సుమారు రెండు పెట్టెల ఐరన్ పోలిక్ యాసిడ్ సిరప్ లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరుబయట ఇలా నిర్లక్ష్యంగా పడవేశారు. అంటే వైద్యాధికారి, ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు ఏ విధంగా ఉందో దీనిని బట్టి స్పష్టంగా అర్థమవుతుంది.ఐరన్ పోలిక్ యాసిడ్ సిరప్ లు పిల్లలకు బలం కోసం ఇవ్వాల్సి ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామాలలోని సబ్ సెంటర్లకు ఎప్పుడు వెళ్లి అడిగినా ఐరన్ సిరప్ లు ఇవ్వలేదని లేవని చెప్పేవారని ఇప్పుడు కాలం చెల్లాయని ఆరుబయట ఇలా పడవ వేయడం పట్ల ఆసుపత్రికి వచ్చిన రోగులు, ప్రజలు వైద్యాధికారి, వైద్య సిబ్బంది పనితీరు పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్న జిల్లా వైద్యశాఖ అధికారులు పేరుకు అలా వచ్చి తనిఖీలు నిర్వహించి వెళు ్తన్నారే తప్ప ఆసుపత్రిలో ఏం జరుగుతోందని ప్రజలకు సరైన వైద్యం అందుతుందా లేదా మందులు పంపిణీ చేస్తున్నారా లేదా విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా లేదా సమయపాలన పాటిస్తున్నారా లేదా అనే విషయాలను కనీసం పట్టించుకోవడంలేదని ఆసుపత్రికి వచ్చే రోగులు, గ్రామాలలోని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా వైద్యశాఖ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారి పై చర్యలు తీసుకోవాలని ఆసుపత్రికి వచ్చే రోగులు, గ్రామాలలోని ప్రజలు, పలువురు కోరుతున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి బండ ప్రకాష్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించి, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించారు. అభ్యర్థులందరికీ పార్టీ బీ--ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బండా ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి లు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నుండి కౌన్సిలర్ టికెట్ ఆశించి నప్పటికీ పరిస్థితుల దృష్ట్యా టికెట్ రాని ఆశావాహులు అధైర్య పడవద్దని, భవిష్యత్తులో అందరికీ అండగా ఉంటానని చెప్పారు. ఆశించిన ప్రతి ఒక్కరికి టికెట్ రావడం సాధ్యం కాదని, సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ విధానంలో అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. టికెట్ రాని వారికి భవిష్యత్తులో పార్టీ నిర్మాణంలో, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్ధన్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ నూనె రాజు, బీఆర్ఎస్ అభ్యర్థులు పాల్గొన్నారు.

నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా తయారీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని, నిర్దేశిత సమయంలోగా ప్రక్రియ పూర్తి చేసి నిబంధనల ప్రకారం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తిగా వీడియోగ్రఫీ చేయడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేశామని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులను సందర్శించి వంటశాల, ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు మంజూరైన భోజనశాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని రేగులగూడ గ్రామంలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలకు మంజూరైన అదనపు గదుల నిర్మాణ ప్రక్రియను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

బెల్లంపల్లి, ఫిబ్రవరి 3, (జనంసాక్షి) : బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్లకు ప్రధాన పార్టీలు బీ ఫారాలు అందజేసింది. కాంగ్రెస్ పార్టీ నుంచి మదారి లక్ష్మి, గోమాస ప్రవీణ్ కుమార్, పోరండ్ల సత్యవతి, పంగ శాంత, పేరపల్లి పరమేష్, దుబాసి వెంకటస్వామి, దావా స్వాతి, ఎండీ నిజమోద్దీన్, రొడ్డ శారద, దీకొండ పద్మ, గాలి సుమలత, జర్పుల లక్ష్మి, బండి ఉమ, ముక్కెర సోమశేఖర్, చింతల వసంత, రేగుంట రమాదేవి, రాగంశెట్టి సత్యనారాయణ, తస్లిమ సుల్తానా, కాంపల్లి దయామణి, మత్తమారి సరస్వతి, ఎలుక ఆకాష్, ఆకుల లలిత, జంగం కల్పన, దామెర విజయలత, కంకటి ప్రణిత, ఇప్ప కుమారస్వామి, బేటి శ్రావణ్ కుమార్, చిప్ప అర్చన, మేడి పున్నంచంద్, గెల్లి విజయలక్ష్మి, గెల్లి సంధ్య, నీలి హారిక, బండి రజిత, గదం కవితలకు కాంగ్రెస్ పార్టీ తరపున అభ్యర్థులుగా ఎంపిక చేసి బీ ఫారాలు అందజేశారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి కొయ్యాడ ప్రసన్న, సబ్బని అరుణ్, లక్కాకుల సౌజన్య, ఏట కమల, గోగర్ల స్వప్న, సల్ల కృష్ణవేణి, ఆరె వరలక్ష్మి, అబ్దుల్ నయీం, కాంపెల్లి రాజం, తోడే మల్లమ్మ, పాండ్య రజని, తిరుమల వాసు, దొంగల రాజ్‌కుమార్, అసాది మధుకర్, రామగిరి మాధవి, కత్తి శ్రీనివాస్, రాపెల్లి విజయ కుమార్, బత్తుల అనిత, డి స్వరూప, షేక్ షమేమ్, తాండ్ర స్రవంతి, రాజనాల రమేష్, ఆదూరి ప్రవళిక, మధుసుల శ్రుతి, రేణికుంట్ల సరిత, బైరం రాజేందర్, కొత్తూరి వరలక్ష్మి, గద్దల ధర్మేందర్, రాజులాల్ యాదవ్, ఎండీ జరీనా, బండారి స్రవంతి, దేవ రజిత, మోతే స్రవంతి, గోలి సదానంద్ లకు బిఆర్ఎస్ పార్టీ బీ ఫారాలు అందించింది. బీజేపీ పార్టీ నుంచి 2 వార్డు పట్టి వెంకటకృష్ణ, 4 వార్డు ఎనగందుల మౌనిక, 5 వార్డు సముద్రాల సుధాకర్, 6 వార్డు ఉప్పు లక్ష్మి, 8 వార్డు గోలి శ్రీనివాస్, 9 వార్డు బాగ్ మోహన్, 10 వార్డు సుక్క సరిత, 11 వార్డు గుర్రం శ్రావణి, 12 వార్డు భూఖ్య రాజు, 14 వార్డు కళ్ళపెల్లి నవీన్, 16 వార్డు కోయల్కర్ గోవర్ధన్, 18 వార్డు రచ్చ స్వప్న, 20 వార్డు దార రాజేష్, 23 వార్డు నిట్ట అరుణాసుందరి, 26 వార్డు ఇప్ప స్వామి, 27వార్డు గంగారపు రమేష్, 28 వార్డు గాండ్ల మహేష్, 29 వార్డు కోడి రమేష్, 30 వార్డు ఎర్రోజు స్రవంతి, 34 వార్డు కొక్కుల రామ్మూర్తిలకు బీజేపీ పార్టీ బీఫారాలు ఇచ్చి అభ్యర్థులను బరిలో దింపింది. ప్రధాన పార్టీల నుంచి బీ ఫారాలు రాని అభ్యర్థులు తిరుగు బాటు అభ్యర్థులుగా బరిలో నిలవనున్నారు.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ క్రీడా మైదానంలోని మినీ ఫంక్షన్ హాల్‌ను, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్ల కోసం గదులను పరిశీలించారు. అంబేద్కర్ స్టేడియంలో టెంట్లు ఏర్పాటు చేసి, వార్డు వారిగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎన్నికల సామగ్రి సమగ్రంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచేందుకు స్టేడియంలోని గదులలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్‌లో గాలి, వెలుతురు లేకుండా కిటికీలు, వెంటిలేటర్లను పూర్తిగా మూసివేయాలని సూచించారు. అలాగే స్ట్రాంగ్ రూమ్ లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం మినీ ఫంక్షన్ హాల్‌లో వార్డు వారిగా కౌంటర్లు ఏర్పాటు చేసి, బారికేడింగ్ చేయాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ సిబ్బందికి త్రాగునీరు, విద్యుత్ సరఫరా, టెంట్ల ఏర్పాటు చేయడంతో పాటు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోన, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విబిజి రామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలి

- కాంగ్రెస్ శ్రేణుల భారీ ధర్నా

మల్హార్,ఫిబ్రవరి 03(జనం సాక్షి) : కేంద్ర ప్రభుత్వం ఎంజిఎన్ఆర్ఈజిఎస్ పథకాన్ని రద్దు పరిచి ఉపాది హామీ పేరు మార్చి విబి జి రామ్ జి చట్టాన్ని తీసుకు వచ్చిందని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ దండు రమేష్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రమైన తాడిచెర్ల ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ పథకం పేరు మార్పుపై కాంగ్రెస్ శ్రేణులు బారీ ధర్నా నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైయస్ హయాంలో నిరుపేదలకు హక్కులు కల్పిస్తూ దానిని పథకంగా అమలుపరచడం జరిగిందని తెలిపారు. ఉపాధిహామీ పని కోరే ప్రతి కుటుంబానికి వంద రోజులు గ్యారంటీ పని కల్పిస్తూ చట్టబద్ధత చేశారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు చేసిన గొప్ప పథకాన్ని పేరు మార్చి కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టేందుకు కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ యత్నించడం హేయమైన చర్య అని ఖండించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బడితల రాజయ్య, మాజీ ఎంపిపి చింతలపల్లి మలహాల్ రావు, కాటారం మాజీ ఎంపిపి పంతకాని సమ్మయ్య, మాజీ ఫాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య, నాయకులు కుంభం రమేష్ రెడ్డి, జంపయ్య, కుంట సదానందం ముదిరాజ్, జిల్లా యూత్ నాయకులు మండల రాహుల్, సర్పంచులు జంగిడి శ్రీనివాస్, బండి స్వామి, గడ్డం క్రాంతి, బండారి నర్సింగం,బొమ్మ రజిత, తాడిచెర్ల ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు గౌడ్, వార్డు సభ్యులు ఇందారపు చంద్రయ్య, తిర్రి అశోక్ గౌడ్, తాటికొండ కేశవచారి, కేసారపు చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్‌దే..

- అభ్యర్థులను గెలిపించే బాధ్యత మీదే..
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ దే.. అభ్యర్థులను గెలిపించే బాధ్యత మీదేనని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16, 17, 29, 11, 14, 15, 28 వార్డుల్లో సీపీఐ, సీపీఐ(యం) పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కొరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్, సీపీఐ(యం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు, ముఖ్య నాయకులు ఆయా వార్డుల ఎన్నికల ఇంచార్జీలతో కలిసి ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులల్లో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల ఫలితాలే.. మున్సిపల్ ఎన్నికల్లోనూ రిపీట్ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం నిరంతరం కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కాలువ పూడికతీత పనులు చేసుకుంటున్న రైతులు

గోవిందరావుపేట (జనంసాక్షి) : మండలంలోని కోట కాలువ రైతులు త్వరగా నీరు పారే విధంగా స్వయంగా తమ కాలువను తామే శుభ్రం చేసుకుంటున్నారు. మంగళవారం ఆయకట్టు కోట కాల్వ రైతులు కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలను గడ్డిని వ్యర్థాలను తొలగించి నేరుగా వేగంగా నీరు పారే విధంగా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కోట కాలువ ఆయకట్టు రైతులు మాట్లాడుతూ ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని కాకుండా తమ పని తానే చేసుకునే విధంగా ముందుకు కదలడం జరిగిందని అన్నారు. ప్రభుత్వానికి చెప్పిన కాంట్రాక్టర్ అని టెండర్ అని ఆలస్యం అవుతుంది నాట్లు జోరుగా వేస్తున్నందున నీరు త్వరగా అందే విధంగా తమ కాలువను తామే శుభ్రం చేసుకోవాలని రైతులంతా ఐక్యంగా కలిసి రావడం జరిగిందని అన్నారు. రైతులు తమ కాలువను తామే శ్రమదానంతో శుభ్రం చేసుకోవడం ఇతర కాలువ రైతాంగానికి స్ఫూర్తిగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కాలువ పూడికతీత పనులకు ఐక్యంగా కదిలిన రైతులను మండల ప్రజలు అభినందిస్తున్నారు.

సఖి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 3 (జనంసాక్షి): వరంగల్ ఆటోనగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వన్ స్టాప్ సఖి భవన నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ నిర్మాణంలో ఉన్న సఖి భవనాన్ని పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భవన నిర్మాణానికి అవసరమైన అదనపు నిధుల కోసం వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సఖి భవనానికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వెంటనే డిమార్కేషన్ చేయాలని స్థానిక తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. సఖి కేంద్రం ద్వారా మహిళలకు సమగ్ర సేవలు అందే విధంగా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, తహశీల్దార్ శ్రీకాంత్, సఖి కేంద్ర నిర్వాహకులు శ్రీలత పాల్గొన్నారు.

బిజెపిలో చేరిన నేరెళ్ల సాయి

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి3 (జనం సాక్షి) : నిర్మల్ పట్టణానికి చెందిన నేరెళ్ల సాయి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సమక్షంలో మంగళవారం భారతీయ జనతా పార్టీ లో చేరారు.సాయి తో పాటు పట్టణానికి చెందిన యువకులు బీజేపీ లో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి వారికి కండువా వేసి ప

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04 ఫిబ్రవరి 2026

ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకురావాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా రైతులు అధిక దిగుబడితో పాటు దీర్ఘకాలంపాటు అధిక ఆదాయాన్ని సాధించవచ్చని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.జిల్లావ్యాప్తంగా మంగళవారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులతో కలిసి ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్, ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వ సహకారం, సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు, భవిష్యత్‌లో వచ్చే ఆదాయం, తదితర అంశాలపై వివరించారు. మెగా ప్లాంటేషన్ లో భాగంగా ఈరోజు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో కలిపి మొత్తం 32 మంది రైతుల ద్వారా 110 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుని, ప్రణాళిక ప్రకారం విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. ఆయిల్ పామ్ పంట సాగు ఆవశ్యకతను, అధిక దిగుబడి, లాభాలను తెలుసుకుని ఆసక్తితో ముందుకు వచ్చిన రైతులను ఇంచార్జి కలెక్టర్ అభినందించారు. ఆయిల్ పామ్ సాగుకు ఇక్కడి రైతులు తీసుకున్న నిర్ణయం ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని, మీ అనుభవాలను పక్క గ్రామాల

రైతులతో పంచుకుని ఆయిల్ పామ్ పంట సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు.ఆయిల్ పామ్ పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తితో ముందుకు రావాలని, ఈ పంట అన్ని కాలాలకు అనుకూలంగా ఉంటుదని, నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి, ఆదాయం వస్తుందని వెల్లడించారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు పీఏసీఎస్ లకు, ఉద్యానవన, వ్యవసాయ శాఖ ఏఓలకు, ఏఈవోలకు లక్ష్యం కేటాయించామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. జిల్లా యంత్రాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం, వివిధ ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగుతో లాభాలు ప్రభుత్వ సహకారం, సబ్సిడీలు వివరిస్తూ.. కరపత్రాలు సిద్ధం చేసి పంపిణీ చేయించామని, బోయినపల్లి మండలంలో ఇప్పటికే సాగు చేసిన రైతులతో సమావేశాల్లో మాట్లాడించి.. అవగాహన కల్పించామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటకు మన జిల్లా నుంచి గత నెల 19వ తేదీన ఆయిల్ పామ్ సాగు, ఫ్యాక్టరీ సందర్శనకు సుమారు 50 మంది రైతులను పంపించామని, సందర్శన అనంతరం ఆ రైతులు సాగుపై సంతృప్తి వ్యక్తం చేయడం తోపాటు ఆసక్తి చూపిస్తున్నారని వెల్లడించారు. జిల్లాలో గత సంవత్సరం జూలై నుంచి ఇప్పటి దాకా 67 మంది రైతుల నుంచి 257 ఎకరాల్లో 110 టన్నులు ఆయిల్ పామ్ పంటను సేకరించడం జరిగిందని పేర్కొన్నారు. ఒక్కో టన్నుకు రూ.20,456 మద్దతు ధర ప్రస్తుతం ఉందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ఎక్కువ మంది కూలీలు అవసరం లేదని, నిర్వహణ ఖర్చు తక్కువ ఉంటుందని తెలిపారు. పంట విక్రయించేందుకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉందని వెల్లడించారు. మిగితా అన్ని పంటలతో పోలిస్తే దీని సాగుతో ఎన్నో లాభాలు ఉన్నాయని, అటవీ జంతువుల బాధ ఉండదని, పర్యావరణ సమస్యలతో ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. అంతర పంటలుగా కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం వల్లంపట్ల గ్రామంలో 2022 సంవత్సరంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటి పంటను సాగు చేస్తున్న తీరును ఇంచార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతును అడిగి సాగు వివరాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అప్జల్ బేగం, తహసీల్దార్ ఫారూక్, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార ఖర్చులు పకడ్బందీగా నమోదు చేయాలి

- జిల్లా మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల వ్యయాలపై పకడ్బందీగా పర్యవేక్షణ చేపట్టాలని వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలను పరిశీలించి ఎన్నికల అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అభ్యర్థుల ఎన్నికల వ్యయాల నమోదు, లెక్కల నిర్వహణ,రోజువారీ వ్యయ నివేదికల సమర్పణ విధానం వంటి అంశాలపై సవివరంగా చర్చించారు.ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, వ్యయ రిజిస్టర్లు రోజువారీగా అప్డేట్ చేయాలన్నారు.ప్రచార కార్యక్రమాలు,వాహనాల వినియోగం,ప్రచార సామగ్రి, సభలు,సమావేశాలు తదితర ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ సమన్వయంతో పనిచేసి అక్రమ ఖర్చులు,అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలన్నారు. అభ్యర్థులకు ఎన్నికల వ్యయాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు,వారు సమయానికి ఖర్చుల వివరాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.శిక్షణలో నోడల్ అధికారులు నవీన్ కుమార్, భారతి పాల్గొన్నారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి

మేళ్లచెరువు, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : మేళ్లచెరువు మండల కేంద్రంలోని స్థానిక శ్రీ ఇష్టకామేశ్వరి స్వయంభు శంభు లింగేశ్వర స్వామి మహాశివరాత్రి జాతర నెల 14 తారీఖు నుండి 19 వరకు జరుగు మహాశివరాత్రి జాతర కొరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో కోరారు. శివాలయం ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బారీ కేడ్లు ఏర్పాట్లుచేయాలని దేవాలయ సిబ్బందికి సూచించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలనీ పోలీస్ శాఖ అధికారులకు సూచించారు.ఎన్నెస్పీ కాలువ ద్వారా నీటి సరఫరా అయ్యే విధంగా చూడాలన్నారు.విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.జాతరకు వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు వస్తే మందులు అందించేందుకు ఆరోగ్య శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు..శానిటేషన్ విషయంలో సిబ్బంది పక్కాగా కార్యాచరణ తయారు

చేసుకోవాలన్నారు.భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడపాలన్నారు.దేవాలయ పరిసరాల్లో మత్తుపదార్థాలు విక్రయించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిమాపక యంత్రాలు,సిబ్బంది జాతర ముగిసే వరకు అందుబాటులో ఉండాలన్నారు. భక్తుల సౌకర్యార్థం మంచి నీటి పాకెట్ లను అందుబాటులో ఉంచాలని కోరారు.జాతరలో పాల్గొనే భక్తులకి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్క సిబ్బంది పక్కా ప్రణాళికతో పని చేయాలన్నారు.ట్రాఫిక్ సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

కౌజు పిట్టల పెంపకం, చేపల యూనిట్ల పరిశీలన

- గ్రామీణ ఉపాధి యూనిట్ల అభివృద్ధికి కలెక్టర్ సూచనలు..

దమ్మపేట, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌజుపిట్టల పెంపకం కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, పశుసంవర్ధక శాఖ అధికారి అమయ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. గుడ్ల ఉత్పత్తి, పిల్లల పొదుగుదల, పెంపకం వంటి విధానాలను కేంద్ర నిర్వాహకులు ప్రసాద్, కృష్ణవేణి దంపతులు వివరించారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటికే జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఆసక్తి గల మహిళా సంఘ సభ్యులకు పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉత్పత్తి పెంచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, యంత్రాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి నాబార్డు ద్వారా సహాయం పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం లింగాలపల్లి గ్రామంలో గిరిజన యువరైతు చాపా బాలకృష్ణ ఏర్పాటు చేసిన కొరమీను చేపల పెంపకం కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయిల్ ఫామ్ తోటలో ఎలాంటి రసాయనాలు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా ఘన, ద్రవ జీవామృతాలతో మంచి దిగుబడి సాధిస్తున్న తీరును అభినందించారు. సమీకృత ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవీంద్ర రెడ్డి, గ్రామ సమాఖ్య సభ్యులు, స్థానిక సర్పంచులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గిరిజన రోగుల పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మారుమూల గిరిజన గ్రామాల నుంచి వచ్చే నిరుపేద గిరిజనులకు ఆసుపత్రిలో వైద్యులు అన్నిరకాల వైద్య సదుపాయాలు కల్పించాలని, రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో లేబొరేటరీ, ఆపరేషన్ థియేటర్, గర్భిణుల కాన్పులగది, అవుట్ పేషెంట్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, మందులు నిల్వచేసే గదులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అవుట్, ఇన్పేషెంట్లను అందుతున్న వైద్యసౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టోరూమ్ కు వెళ్లి మందుల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో పీవో మాట్లాడుతూ మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి రోగులు ఆసుపత్రికి వస్తుంటారని వారికి సకాలంలో

వైద్యం అందించడంతో పాటు వారితో మర్యాదగా వ్యవహరించాలని, ప్రధానంగా గర్భిణుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారు ఇబ్బందులు పడకుండా అంబులెన్స్ లో ఆసుపత్రికి తీసుకురావాలని, ప్రసవం జరిగేంతవరకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గర్భిణుల పట్ల స్థానిక వైద్య సిబ్బంది నెలవారీ తీసుకునే జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సీహెచ్సీలో పనిచేసే వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండి రోగులకు సేవలందించాలన్నారు. రోగులను టెస్టుల పేరుతో ప్రయివేటు ల్యాబ్ లకు పంపకూడదని, అలా ఎవరైనా చేసినట్లు తన దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రూ.2.70కోట్లతో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆసుపత్రి భవన పనులను పరిశీలించి వర్షాకాలం నాటికి కొత్త భవనంలో రోగులకు వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. అదేవిధంగా జీపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్దీపకం వర్క్ బుక్‌లో పదాలను ఇతర అంశాలను విద్యార్థులతో బోర్డుపై రాయించి తాత్పర్యాలు రాబట్టే ప్రయత్నం చేశారు. విద్యార్థులు సరిగా చెప్పకపోవడంతో సంబంధిత ఉపాధ్యాయులపై పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్వో సైదులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, వైద్యులు అనిత, నిషార్, సీహెచ్సీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ సందర్భంగా భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర.మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ చేపట్టిన పటిష్ట భద్రతా ఏర్పాట్లను ఆయన సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు మరియు అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి టౌన్ ఎస్.హెచ్.ఓ నరహరి, రూరల్ ఇన్‌స్పెక్టర్ రామన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఎస్.ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కట్టించి తీరుతాం..

- గత పాలకుల నిర్లక్ష్యంపై మంత్రి పొంగులేటి నిప్పులు
- ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హామీల వర్షం

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా అరాచకంగా వ్యవహరించిన వారు... నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారు" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో ఆయన పాల్గొని విపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. గత పాలకులు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేశారని, ఆనాడు అర్హులైన వారికి స్థలాలు ఇవ్వకుండా వంచించారని ఆయన మండిపడ్డారు.

సొంతింటి కలను నెరవేరుస్తాం..

ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి ప్రజలకు కీలక భరోసా ఇచ్చారు. ఇళ్ల స్థలాలు ఇచ్చే మంత్రిని కూడా నేనేనని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు.

సంక్షేమ పథకాలతో పేదల చెంతకు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి వివరించారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను వేసవి లోపే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. తనను అసెంబ్లీ ఎన్నికల్లో దీవించినట్టే, ఏదులాపురం మున్సిపాలిటీ బరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు.

కోదాడ మున్సిపాల్టీ ఎన్నికలలో 3 వార్డులు ఏకగ్రీవం

కోదాడ, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : కోదాడ మున్సిపాలిటీకి జరిగే ఎన్నికలలో మంగళవారం ఉపసంహరణ సమయానికి మూడు వార్డులుఏకగ్రీవమైనవి! వాటిలో 11వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి దేవరపల్లి మల్లేశ్వరి (కాంగ్రెస్),21 వ వార్డు నుండి కట్టబోయిన జ్యోతి శ్రీనివాస్(కాంగ్రెస్),31 వ వార్డు నుండి ఎర్నేని కుసుమ కుమారి(కాంగ్రెస్) గెలుపొందినట్లుగా అధికారులు ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ స్థానాలు గెలుపు ఖాయం

- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు దిశ నిర్ధేశం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు30వరకు మెజార్టీ స్థానలు గెలుపు ఖాయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు ఎమ్మెల్యే దిశ నిర్ధేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ అభ్యర్థుల ఎంపీకలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటిస్తూ బీసీలకు 15,మైనారిటీలకు 9,ముదిరాజ్ సామాజిక వర్గంకు 5,కుర్వ సామాజిక వర్గంకు 01, గౌడ్స్ సామాజిక వర్గంకు 01,బ్రహ్మణ సామాజంకు 01,వైశ్యులకు 01,వీరశైవులకు 04,ఎస్టీ సామాజిక వర్గంకు 01,ఎస్సీ సామాజిక వర్గంకు 3, ఉప్పరి సామాజిక వర్గం01, మున్నూర్ కాపు 3, రెడ్డి సామాజిక వర్గంకు 01 ఇలా అన్ని వర్గలతో సామాజిక న్యాయం పాటించడం జరిగింది. కష్టపడ్డ కార్యకర్తలకు కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ తరుపున భీ ఫాం అందించడం జరిగింది. ప్రజా ఆశీర్వాదం కాంగ్రెస్ పై ఉండబోతుంది, అభ్యర్థులుగా మీరు ప్రతి ఓటర్ ను ఆశీర్వాదించాలని వారిని కలవండి.చివరి ఓటు బ్యాలేట్ బాక్స్ లో పడే వరకు అభ్యర్థులు జాగ్రత్తలు పాటించాలన్నారు.ప్రతిపక్ష నాయకులు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు,వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు.రెండేళ్ళ ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రతి కుటుంబంకు సంక్షేమ ఫథకాలు అందించింది.రెండేళ్ళ కాలంలో తాండూర్ మున్సిపల్ లో గతంలో చేయని పనులు చేయడం జరిగిందన్నారు.మన ప్రభుత్వం చేసింది ప్రజలకు అర్థం అయ్యో విధంగా ఓటర్లకు వివరించే భాధ్యత అభ్యర్థులు, పార్టీ నాయకులదే అన్నారు.30 స్థానల పైనే కాంగ్రెస్ పార్టీ గెలవబోతున్నాం, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠం కైవసం చేసుకుంటుంది.అభ్యర్థులు, పార్టీ ఇంచార్జీలతో సమన్వయంతో

పని చేయాలి. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధార సింగ్ ,మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు నరేందర్ రాంశెట్టి,కోర్దినేటర్స్ ఇఫ్తాకర్,అశోక్ కుమార్ టౌన్ అధ్యక్షులు హాబీబ్ లాల మరియు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు,వార్డ్ ఇంచార్జీలు నాయకులు పాల్గొన్నారు.

బుల్ బుల్లెట్ పరుగు

హెలికాప్టర్ల తయారీ రంగంలోకి అదానీ గ్రూప్..

ఇటలీ సంస్థతో ఒప్పందం

న్యూఢిల్లీ: దేశీయ పారిశ్రామిక దిగ్గజ సంస్థ అదానీ గ్రూప్ హెలికాప్టర్ల తయారీ రంగంలోకి అడుగుపెట్టింది. ఇటీవలే బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్‌తో కలిసి దేశీయంగా విమానాలను తయారుచేసే వ్యవస్థ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఆ సంస్థ.. తాజాగా హెలికాప్టర్ల తయారీ ఎకోసిస్టమ్ ఏర్పాటుకు ఇటలీకి చెందిన లియోనార్డో కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం 'మేకిన్ ఇండియా'కు ఊతం ఇవ్వడంతో స్వావలంబనకు తోడ్పడుతుంది. ఈ మేరకు అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, లియోనార్డో సంస్థల ప్రతినిధులు మంగళవారం భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశారు.ఈ భాగస్వామ్యం ద్వారా దేశంలో ఇంటిగ్రేటెడ్ హెలికాప్టర్ తయారీ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా భారత సైన్యం, వైమానిక దళ అవసరాలను తీర్చే లక్ష్యంతో ఈ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. లియోనార్డో సంస్థకు చెందిన హెలికాప్టర్లను దేశీయంగా తయారుచేయడం ఈ భాగస్వామ్యం ముఖ్య ఉద్దేశం. దశలవారీగా స్థానిక తయారీ పెంచడంతో పాటు మెయింటెనెన్స్, నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాలింగ్ సామర్థ్యాలు, పైలట్ల శిక్షణ వంటివి ఇందులో భాగంగా ఉంటాయని అదానీ గ్రూప్ ఓ ప్రకటనలో పేర్కొంది.భారత్‌లో హెలికాప్టర్ వినియోగం చాలా తక్కువగా ఉంది. దేశంలో 250 కంటే తక్కువ హెలికాప్టర్లు మాత్రమే ఉన్నాయి. వచ్చే 10 సంవత్సరాల్లో సంవత్సరానికి సుమారు 100 హెలికాప్టర్ల చొప్పున అవసరం పడతాయనేది అంచనా. సాయుధ దళాల కోసం రాబోయే దశాబ్దంలో వెయ్యికి పైగా హెలికాప్టర్ల అవసరం ఉండొచ్చని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సీఈఓ అశీష్ రాజ్‌వంశీ తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా దేశంలో సివిల్, డిఫెన్స్ అవసరాలు తీర్చేందుకు పునాది వేశామని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ అన్నారు. భారత్ అతిపెద్ద మార్కెట్ అని, సాయుధ దళాలకు హెలికాప్టర్ల అవసరం పెరుగుతోందని లియోనార్డో హెలికాప్టర్స్ ఎండీ గియాన్ పియరో కుటిల్లో ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మదుపర్ల సంపద 12 లక్షల కోట్లు పైకి

ముంబయి: చాలా రోజుల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఎన్నాళ్లగానో వేచి చూస్తున్న అమెరికాతో ట్రేడ్ డీల్‌పై స్పష్టత రావడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్ రంకెలేసింది. ఉదయం మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి చివరి వరకు బుల్లెట్‌లా బుల్ రన్ కొనసాగింది. ఫలితంగా సెన్సెక్స్ 2 వేల పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,700 ఎగువకు చేరింది. అన్ని రంగాల స్టాక్స్ లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.12 లక్షల కోట్లు పెరిగి రూ.467.35 లక్షల కోట్లకు చేరింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం రాత్రి ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికా దిగుమతులపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతంసుంకాలు 18 శాతానికి దిగి రానున్నాయి. ఈ ప్రకటన స్టాక్ మార్కెట్ సూచీలకు కొత్త బూస్ట్ ఇచ్చింది.బుల్ పరుగు ఇలా: ట్రంప్ ప్రకటన



నేపథ్యంలో సెన్సెక్స్ ఆరంభంలోనే దాదాపు 3600 పాయింట్ల లాభంతో 85,323.20 వద్ద (క్రితం ముగింపు 81,666.46) ప్రారంభమైంది. ఓ దశలో 4 వేలకు పాయింట్ల లాభంతో 85,871.73 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2072.67 పాయింట్ల లాభంతో 83,739.13 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 26,341.20 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 639.15 పాయింట్ల లాభంతో 25,727.55 వద్ద స్థిరపడింది.కోలుకున్న రూపాయి: దేశీయ కరెన్సీ రూపాయి కూడా కోలుకుంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం 91.51గా ఉండగా.. ట్రేడ్ డీల్ నేపథ్యంలో ఒక్కరోజులోనే 1.36 శాతం బలపడి 90.26కి చేరింది. రూపాయి విలువ ఈ స్థాయిలో బలపడడం ఇదే తొలిసారి.ఆ రెండూ మినహా: సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్ (9.12 శాతం), బజాజ్ ఫైనాన్స్ (6.68 శాతం), ఇండిగో (5.51 శాతం), పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (283.25), సన్‌ఫార్మా (4.54) చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4921 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

ఒరాకిల్‌లో ఉద్యోగ కోతలు!

న్యూఢిల్లీ:ఒరాకిల్ తన ఏఐ డేటా కేంద్రాలకు నిధులను అందించేందుకు, వ్యయాలు తగ్గించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉందని ఆంగ్ల పత్రికలు పేర్కొన్నాయి. ఏఐ డేటా కేంద్రాల విస్తరణ కోసం పెట్టుబడులు సమకూర్చేందుకు అమెరికా బ్యాంకులు వెనకడుగు వేస్తున్నందున, కొన్ని కార్యకలాపాలను విక్రయించాలనీ ఒరాకిల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ఒరాకిల్ అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. క్లౌడ్ ఇన్‌ఫ్రా పెట్టుబడుల ప్రణాళికలో భాగంగా అదనపు సామర్థ్యాన్ని సమకూర్చుకునేందుకు ఈ ఏడాదిలో 45-50 బి. డాలర్ల (దాదాపు రూ.4-4.55 లక్షల కోట్లు) సమీకరించాలని ఒరాకిల్ భావిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. డెట్, ఈక్విటీ విక్రయాల ద్వారా ఈ నిధుల సమీకరణ జరగొచ్చని తెలిపింది. ఏఎమ్‌డీ, మెటా, ఎన్‌విడియా, ఓపెన్‌ఏఐ, టిక్‌టాక్, ఎక్స్‌ఏఐ వంటి దిగ్గజం క్లయింట్ల నుంచి పెరుగుతున్న గిరాకీ కారణంగా ,అదనపు సామర్థ్య పెట్టుబడి ప్రణాళికల్లోకి ఉన్నట్లు కంపెనీ సైతం నిర్ధరించింది. ఈ నేపథ్యంలో, కంపెనీ షేరు 3% వరకు నష్టంతో ట్రేడ్ అవుతోంది.

నెలకు రూ.49 వేలతో ఇంటికి టెస్లా వై

దిల్లీ: అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ టెస్లా దేశీయంగా తన విక్రయాలు పెంచుకునేందుకు కొత్త వ్యూహంతో ముందుకొచ్చింది. ఎక్స్ఛేంజీ ఆఫర్‌తో పాటు, ఈఎంఐ సదుపాయాన్ని ప్రకటించింది. గతేడాది భారత్‌లో లాంచ్ చేసిన మోడల్ వైకి ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడంతో ఈ ఆఫర్లకు తెరతీసింది.పెట్రోల్, డీజిల్ కార్ల వినియోగదారులు ఎలక్ట్రిక్ కారుకు మారాలనుకుంటే ఎక్స్ఛేంజ్‌పై రూ.3 లక్షల వరకు ప్రోత్సాహకాలను టెస్లా ఆఫర్ చేస్తోంది. లేదంటే రూ.6 లక్షల డౌన్‌పేమెంట్‌తో నెలకు రూ.49 వేలు ఈఎంఐ చెల్లించడం ద్వారా ప్రీమియం ఎలక్ట్రిక్ కారును సొంతం చేసుకోవచ్చని టెస్లా పేర్కొంది. సాధారణ కార్లతో

ఈవీని సొంతం చేసుకోవడం ద్వారా ఫ్యూయల్, నిర్వహణ ఖర్చుల రూపేణా నెలకు రూ.20వేల వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపింది. అప్పుడు వాస్తవంగా చెల్లించేది రూ.29 వేలేనని తెలిపింది.టెస్లా మోడల్ వై కారు దేశీయంగా రూ.60 లక్షల ధరకు విడుదలైన సంగతి తెలిసిందే. తొలినాళ్లలో ఈ కారు కొనుగోలుకు పెద్ద సంఖ్యలో ఆసక్తి కనబరిచారు. బుకింగ్‌ల వద్దకు వచ్చేసరికి ఆ సంఖ్య వందలకు చేరింది. అందులో రిజిస్ట్రేషన్ చేసుకునేవరకు వెళ్లింది మాత్రం కొందరే. ఫాడా డేటా ప్రకారం.. గతేడాది టెస్లా 225 కార్లను విక్రయించింది. దేశంలో మొత్తం ఈవీ కార్ల విక్రయాలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా తక్కువ. 2024లో దేశంలో 99,875 ఈవీ కార్లు అమ్ముడుకాగా.. 2025లో 77 శాతం వృద్ధితో 1,76,817 యూనిట్లను వివిధ కంపెనీలు విక్రయించాయి. అధిక ధర వల్ల మోడల్ వై లగ్జరీ సెగ్మెంట్‌లోకి వెళ్లిపోయింది. ఆ ధరలో బీఎండబ్ల్యూ, బీవైడీ వంటి కార్లు మెరుగైన ఫీచర్లతో లభిస్తుండటం.. మోడల్ వై కస్టమర్లను ఆకట్టుకోవడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో ఆఫర్లను ప్రకటించడం గమనార్హం.



రోగి గొంతులో నుంచి సజీవంగా జలగ తొలగింపు

శిమ్లా:హిమాచల్‌ప్రదేశ్ రాజధాని శిమ్లాలోని ఇందిరా గాంధీ వైద్య కళాశాల ఆసుపత్రిలో అరుదైన ఘటన చోటుచేసు కుంది. 55 ఏళ్ల వ్యక్తి గొంతులో ఇరుక్కున్న బతికున్న జలగను వైద్యులు విజయవంతంగా తొలగించారు. సిర్మౌర్ జిల్లాలోని కంగేర్ ధర్యార్ గ్రామానికి చెందిన సురేశ్ దత్ గొంతులో 15 రోజుల క్రితం జలగ ఇరుక్కుపోయింది. దీంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. బ్రాంకోస్కోపీ చేయగా సురేశ్ శ్వాసనాళం దగ్గర గొంతులో జలగ ఇరుక్కుపోయినట్లు తేలింది. దీంతో వాక్యూమ్ పరికరాన్ని ఉపయోగించి రోగి గొంతు నుంచి బతికున్న జలగను విజయవంతంగా తొలగించారు.

ట్రంప్ ట్రేడ్ డీల్.. పాక్, చైనాల కంటే భారత్‌దే పైచేయి

న్యూఢిల్లీ:అమెరికా-భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందానికి అంగీకారం కుదిరింది దాంతో ఇకపై భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ విషయంలో దక్షిణాసియాలోని పొరుగు దేశాలు, కీలక ఎగుమతి పోటీదారుల కంటే మన దేశమే పైచేయి సాధించినట్లయింది.బంగ్లాదేశ్, శ్రీలంకపై టారిఫ్‌లు 20 శాతం కాగా.. పాకిస్థాన్‌పై 19 శాతం, చైనాపై అధికంగా 34-37 శాతం వరకు సుంకాలు ఉన్నాయి. ఇండోనేసియా, వియత్నాం, థాయ్‌లాండ్, కంబోడియా, మలేసియా వంటి ఇతర ఆసియా దేశాల కంటే ఈ టారిఫ్‌లు (18 శాతం) తక్కువే అయినప్పటికీ.. ఐరోపా యూనియన్, జపాన్, దక్షిణ

కొరియాతో పోలిస్తే మాత్రం కొంచెం ఎక్కువే. ఈ మూడింటిపై ప్రస్తుతం 15 శాతం సుంకాలు అమలవుతున్నాయి. ఇక బ్రెజిల్ (50 శాతం), మయన్మార్, లావోస్ (40శాతం), దక్షిణాఫ్రికా (30శాతం)పై సుంకాలు ఎక్కువగానే ఉన్నాయి. ట్రేడ్ డీల్‌పై ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరిందని చెప్పిన ట్రంప్.. తగ్గించిన సుంకాలు ఎప్పటినుంచి అమల్లోకి వస్తాయో మాత్రం వెల్లడించలేదు. రష్యా చమురు కొనుగోలు విషయంలో భారత్‌కు ఉన్న గడువు, భారతదేశం ఏ యూఎస్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ ఒప్పందం నిబంధనలు, అది ఎప్పుడు అమల్లోకి వస్తుందో కూడా తెలియాల్సి ఉంది. మరోవైపు, ట్రంప్ ప్రకటనపై స్పందించిన మోదీ (ఖఓ ఓనీటతి).. సుంకాల గురించి ఎక్స్‌లో రాసుకొచ్చినప్పటికీ, వాణిజ్య ఒప్పందం గురించి మాత్రం ప్రస్తావించకపోవడం గమనార్హం.

ప్రభుత్వ రంగ సంస్థల్లో మరిన్ని వాటా విక్రయాలు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ:రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వరంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో మరిన్ని పెట్టుబడుల ఉపసంహరణలుంటాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బడ్జెట్ అనంతర విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయాలను స్థిరంగా ఉంచేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రుణ-జీడీపీ నిష్పత్తి ప్రస్తుతం 56% కాగా, 2030-31 కల్లా 50 శాతానికి చేర్చాలన్నది లక్ష్యమన్నారు. 'పన్ను పరిధిని మరింత విస్తృతం

చేయడం ద్వారా ప్రత్యక్ష పన్ను ఆదాయాలు పెంచాలని అనుకుంటున్నాం. మా ప్రాధాన్యత పెట్టుబడుల ఉపసంహరణకే ఉంటుంద'ని మంత్రి స్పష్టం చేశారు. ఐడీబీఐ బ్యాంకులో వాటాల విక్రయం త్వరలోనే పూర్తవుతుందని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం, ఎల్ఐసీ కలిసి ఇందులో 60.72% వాటా విక్రయించాలనుకుంటున్నాయి.'గోల్డ్ రష్' అందుకే: వినియోగానికి మద్దతు ఇచ్చేందుకు, పెట్టుబడులను ఆయుధంగా మలచడంపై కేంద్ర బడ్జెట్ దృష్టి సారించినట్లు ఆర్థిక మంత్రి వివరించారు. తమ ప్రభుత్వం వృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను ద్రవ్య లోటు లక్ష్యమే చెబుతోందన్నారు. ఏటా ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నట్లు తెలిపారు. మదుపర్లకు ఏ కరెన్సీపైనా నమ్మకం లేకపోవడం వల్లే, ఇటీవలి కాలంలో బంగారం - వెండి వైపు పరుగులు తీశారని అభిప్రాయపడ్డారు. స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌కు సామాన్యులను దూరంగా ఉంచడం కోసమే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్ అండ్ ఓ) ట్రేడ్స్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) పెంచినట్లు స్పష్టం చేశారు. దివాలా స్మృతి(సవరణ)- బిల్లు 2025ను మార్చి 9న ప్రారంభమయ్యే బడ్జెట్ సెషన్లలో ప్రవేశపెడతామని తెలిపారు. ఇప్పటికే పార్లమెంటరీ కమిటీ తన నివేదికను సమర్పించిందన్నారు. ఈ సవరణల వల్ల దివాలా ప్రక్రియ సామర్థ్యం పెరుగుతుందని భావిస్తున్నారు.

భారత చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి

కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు. మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి.

అమల్లోకి వచ్చిన బ్యాగేజీ నిబంధనలు

మహిళలకు 40 గ్రా. .. పురుషులకు 20 గ్రా.

విదేశాల నుంచి పసిడి ఆభరణాలు తెచ్చుకునేందుకు గరిష్ఠ పరిమితి ఇది

హైదరాబాద్:విదేశాల నుంచి విమానం లేదా సముద్ర మార్గాల్లో మనదేశానికి వచ్చే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మహిళా ప్రయాణికులు 40 గ్రాముల వరకు, పురుషులు 20 గ్రాముల వరకు బంగారు ఆభరణాలను సుంకం లేకుండా తీసుకురావచ్చని తెలిపింది. అయితే వీరు ఏడాదికి పైగా విదేశాల్లో నివసిస్తూ, తిరిగి వస్తున్న వారు లేదా భారత సంతతి పర్యాటకులైనా కావచ్చు. గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఈ ఆభరణాలు కచ్చితంగా వ్యక్తిగత వినియోగం కోసమే తీసుకురావాలి. బిస్కెట్లు, కడ్డీల రూపంలో ఉండే పసిడికి ఈ మినహాయింపు లభించదు. ఇప్పటివరకు మహిళలు రూ.లక్ష, పురుషులు రూ.50 వేల విలువైన ఆభరణాలే ఇలా తెచ్చుకోవచ్చు. 2016 నాటి పాత నిబంధనల స్థానంలో, రూపొందించిన 'బ్యాగేజీ నిబంధనలు 2026' ఈనెల 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) సోమవారం తెలిపింది. ఈ ప్రకారం విదేశాల నుంచి తిరిగి వచ్చే భారతీయ నివాసితులు, విదేశాల్లో స్థిరపడిన భారత సంతతి పర్యాటకులు లేదా పర్యాటక వీసా కాకుండా ఇతర వీసాలపై వచ్చే విదేశీయులు, తమ వెంట తీసుకొచ్చే రూ.75,000 విలువైన వస్తువులపై కస్టమ్స్ సుంకం (డ్యూటీ)

మినహాయింపు ఉంటుంది. గతంలో ఈ పరిమితి రూ.50,000 మాత్రమే. ఇకపై వీరు వ్యక్తిగత వినియోగం కోసం రూ.75,000 విలువైన వస్తువులను కస్టమ్స్ సుంకం చెల్లించకుండానే ఇక్కడకు తీసుకురావొచ్చు. రెండేళ్ల లోపు వయసున్న పిల్లలకు ఈ మినహాయింపు వర్తించదు. విదేశీయులకు ప్రత్యేక పరిమితి: విమానం లేదా నౌకలపై వచ్చే విదేశీ పర్యాటకులు రూ.25,000 విలువైన కొత్త వస్తువులనే సుంకం లేకుండా తీసుకురాగలరు. భూమార్గం (రోడ్డు లేదా రైలు) ద్వారా వచ్చే ప్రయాణికులకు వారి వ్యక్తిగత అవసరాలకు వాడే పాత వస్తువులపైనే మినహాయింపు ఉంటుంది. ఎలక్ట్రానిక్ వస్తువులు: 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న ప్రయాణికులు (విమాన సిబ్బంది కాకుండా) అదనంగా ఒక కొత్త ల్యాప్‌టాప్ లేదా నోట్‌ప్యాడ్‌ను సుంకం లేకుండా తమ లగేజీలో తీసుకురావచ్చు. ప్రయాణంలో వ్యక్తిగత అవసరాల కోసం తెచ్చుకునే పాత వస్తువులపై ఎలాంటి సుంకం ఉండదు. శాశ్వతంగా తిరిగి వస్తుంటే.. ఉద్యోగ రీత్యా లేదా ఇతర కారణాల వల్ల విదేశాల్లో ఉండి, ఇప్పుడు శాశ్వతంగా భారత్‌కు తిరిగి వచ్చే వారికి, నివాస కాలం ఆధారంగా గృహోపకరణాలపై ప్రత్యేక మినహాయింపులు లభిస్తాయి. విదేశాల్లో 3-12 నెలలు నివాసం ఉన్న వారికి రూ.1,50,000 విలువైన గృహోపకరణాలు గత రెండేళ్లలో ఏడాదిపాటు విదేశాల్లో ఉన్న వారు రూ.3 లక్షల విలువైన వస్తువులను తీసుకురావొచ్చు. కనీసం రెండేళ్లు విదేశాల్లో ఉండి, తిరిగి వచ్చేవారు గరిష్ఠంగా రూ.7.50 లక్షల విలువైన వస్తువులను సుంకం లేకుండా తెచ్చుకోవచ్చు. దిగివస్తున్న బంగారం, వెండి ధరలు బంగారం, వెండి ధరల్లో దిద్దుబాటు కొనసాగుతోంది. ఔన్సు (31.10 గ్రా) బంగారం ధర సోమవారం రాత్రి 11.55 గంటల సమయానికి 263 డాలర్లు తగ్గి 4629 డాలర్ల వద్ద ఉంది. ఒకదశలో బంగారం ధర 4413 డాలర్లకు దిగి వచ్చినా, మళ్లీ కాస్త కోలుకుంది. ఔన్సు వెండి ధర 8 డాలర్లు నష్టపోయి 76 డాలర్ల వద్ద ఉంది. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,50,000, కిలో వెండి ధర రూ.2,48,490 (పన్నులతో కలిపి) వద్ద స్థిరపడింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ఫిబ్రవరి కాంట్రాక్టు ధర రూ.1,41,900, కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.2,32,500 వద్ద స్థిరపడింది.బదిలీ కుదరదు:సుంకం మినహాయింపు పరిమితి పూర్తిగా వ్యక్తిగతం. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ఉంటే, వారికి విడివిడిగానే ఈ పరిమితులు వర్తిస్తాయి. ఒక ప్రయాణికుడికి ఉన్న పరిమితిని మరొకరితో పంచుకునేందుకు, కలపడానికి కుదరదు. 2 లీటర్ల మద్యం, 100 సిగరెట్లు, 125 గ్రాముల పొగాకు ఉత్పత్తుల వరకు సుంకం వర్తించదు. తుపాకులు, ఆభరణాలు కాని బంగారం లేదా వెండి, టీవీ వంటి వస్తువులకు సాధారణ సుంకం మినహాయింపు వర్తించదు. విమాన లేదా నౌకా సిబ్బంది తమ విధుల్లో భాగంగా వస్తుంటే.. వారు రూ.2,500 విలువైన చాక్లెట్లు, సౌందర్య సాధనాలను సుంకం లేకుండా తేగలరు. విదేశీ కరెన్సీని దేశంలోకి తేవడం, బయటకు తీసుకెళ్లడం 'ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్- 2015' నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని సీబీఐసీ పేర్కొంది.

మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి మృతి సంతాపం వ్యక్తం చేసిన పలువురు నాయకులు

ముత్తారం ఫిబ్రవరి 03(జనంసాక్షి) : పెద్దపెల్లి జిల్లా మంథని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి (80) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. హైదరాబాద్ ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన అక్కడ తుది శ్వాస విడిచారు. రాంరెడ్డి 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంథని నియోజకవర్గం నుంచి తెలుగు దేశం పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి మృతి పట్ల స్వగ్రామం అయిన ముత్తారం మండలం ఖమ్మం పల్లి గ్రామప్రజలతోపాటు మండల, నియోజక వర్గ ప్రజలు పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం మంథని నియోజకవర్గంలోని అంత్యక్రియలు నిర్వహించ నున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని కలిసిన ఓసీ నాయకులు

- న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే మా పోరాటం
- ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు

హుజూరాబాద్, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : ఓసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే పోరాటం చేస్తున్నామని, ఇందులో భాగంగా ఈ నెల 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జాతీయ స్థాయిలో ఓసీల మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు తెలిపారు. మంగళవారం కేసి క్యాంప్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిర్రెడ్డి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్లను పోలాడి । రామారావు ఓసీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి ఢిల్లీలో జరిగే మహాధర్నా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పోలాడి రామారావు మాట్లాడుతూ... ఓసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 23 న డిల్లీలో జాతీయ స్థాయి ఓసీల మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేద ఓసీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత రాజకీయాల్లో జనరల్ స్థానాల్లో సైతం ఓసీలు తట్టుకోలేని పరిస్థితి నెలకొన్న విషయాన్ని గుర్తు చేశారు. జనరల్ స్థానాల్లో కూడా ఓసీలకు రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వక పోవడం వల్ల రాజకీయం గానూ వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి కేంద్రం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పిస్తే ఓటు బ్యాంక్ రాజకీయాలతో వాటి పైన దుష్ప్రచారం చేయడం తగదన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని అన్ని వర్గాల పేదలకు ఆర్థిక స్థితి గతుల ఆధారంగా సమన్యాయం జరగాలన్నదే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామారావు వెంట వణ్యాల భూపతిరెడ్డి, ఎడవెల్లి కొండాల్రెడ్డి, పోల్సాని రామారావు, గందె శ్రీనివాస్, కసిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, చందుపట్ల నరసింహ రెడ్డి, కంకణాల జనార్ధన్రెడ్డి, గౌతం శర్మ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో ప్రతి నిమిషం విలువైనదే : జియంలు

రామగిరి, జనంసాక్షి :
ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడడానికి అత్యవసర సమయంలో కమ్యూనికేషన్, ట్రాన్స్పోర్ట్ వ్యవస్థ చాలా కీలకమని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు అన్నారు. రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా లోని స్థానిక సింగరేణి డిస్పెన్సరీ నందు ఏర్పాటు చేసిన ఇంటర్కమ్ టెలిఫోన్ సౌకర్యాన్ని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడడానికి అత్యవసర సమయంలో కమ్యూనికేషన్, ట్రాన్స్పోర్ట్ వ్యవస్థ ప్రతి నిమిషం చాలా కీలకమని, అనారోగ్యంతో చికిత్స కోసం వచ్చిన వారికి వైద్య సిబ్బంది అన్ని రకాల సహాయ, సహకారాలు అందించి మెరుగైన వైద్యం అందించాలని, ఇంకా మెరుగైన వైద్య పరీక్షలు చేయడానికి కావలసిన నూతన వైద్య పరికరాలను ఏర్పాటు చేసుకుందామని, అట్టి పరికరాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు.
అత్యవసర సమయాల్లో ఇంటర్కం టెలిఫోన్ నెంబర్ 593, 594, లకు ఫోన్

చేయవచ్చునని, అదేవిధంగా ఎస్.టి.డి, సెల్ నుండి ఫోన్ చేసేవారికి 08728-260593, 08728-260594 నంబర్లకు ఫోన్ చేయవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు కోలా శ్రీనివాస్, ఎస్వోటుజిఎం బండి సత్యనారాయణ, ఐఇ డీజీయం బి.టి.మురళీకృష్ణ, పర్సనల్ విభాగధిపతి బి.సుదర్శనం, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఏరియా వర్క్ షాప్ డీజీయం రామ్ రెడ్డి తోపాటు ఇతర అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తేజాస్ అకాడమీ నుండి డిఫెన్స్ రంగంలో 30 మంది ఉద్యోగాలకు ఎంపిక

- 30 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరిట్
- తేజాస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీశ్ రావు

కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 03 (జనంసాక్షి):
మా తేజాస్ అకాడమీ నుండి 30 మంది విద్యార్థులకు డిఫెన్స్ రంగంలో ఉద్యోగాలు సాధించడం జరిగిందని తేజాస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీశ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ సతీశ్ రావు మాట్లాడుతూ... మా విద్యార్థులు 15 మంది విద్యార్థులు ఇండియన్ నావిలో ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగిందని వీరందరూ ఫిబ్రవరి నెలలో ట్రైనింగ్ సెంటర్లలో రిపోర్ట్ చేయాల్సి ఉందని తెలిపారు. అదే విధంగ మరో 15 మంది విద్యార్థులు ఎస్ఎస్సి జిడి ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగిందని వీరందరూ 2026 ఫిబ్రవరి నెలలో ట్రైనింగ్ సెంటర్లో రిపోర్ట్ చేయాల్సి ఉందన్నారు. వరుసగ మా తేజాస్ నుండి విద్యార్థులు కాంపిటీటివ్ పరీక్ష లలో ప్రతిభకనబర్చి ఉద్యోగాలు సాధిస్తునందుకు మాకు సంతోషంగా ఉందని, మా తేజాస్‌లో 2026 -2027 విద్యాసంవత్సరం నుండి బాలికలకు కూడా డిఫెన్స్ కోచింగ్ ప్రారంభిస్తున్నామని అదే విధంగ ఐఐటి - జేఈఈ, నీట్‌లో కూడా మా

విద్యార్థులు ర్యాంకులు సాదించాలని ఎలివేట్ అనే ప్రోగ్రాం ని ప్రారంబించడం జరిగిందని తెలిపారు. ఇది హైదరాబాద్ లోని శ్రీ చైతన్య ఇన్స్టిటీ లెర్న్ తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామన్నారు. ఇది హైదరాబాద్ శ్రీ చైతన్య వారి ప్రోగ్రాం, శ్రీ చైతన్య హైదరాబాద్ వారి ఫ్యాకల్టీ తో రెండు షెడ్యూల్ తరగతులు, స్టడీ అవర్, పరీక్షలు ఏర్పాటు చేయడం జరుగుతు ందని 30 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడానికి వారి తల్లిదండ్రుల, పిల్లల, ప్రిన్సిపాల్స్ పట్టుదలనే కారణం అని తేజాస్ ఆకాడమీ చైర్మన్ సి హెచ్. సతీశ్ రావు తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి

- మహిళా స్వశక్తి సంఘాలకు రుణాల పంపిణీ మరింత పెంచండి
- విజయవంత యూనిట్లకు ప్రచారం కల్పించాలి
- వ్యవసాయం, ఎంఎస్ఎంఈ రుణాలపై దృష్టి సారించండి
- డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ ఆదేశాలు

పెద్దపల్లి, ఫిబ్రవరి 03 (జనంసాక్షి) :
ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బ్యాంకర్ల తో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళా సంఘాలకు రుణాల పంపిణీ మరింత పెంచాలని కలెక్టర్ సూచించారు. విజయవంతంగా నడుస్తున్న వ్యాపార యూనిట్లకు ప్రచారం కల్పించాలని తెలిపారు. వీ-హబ్ త్వరలో అందుబాటులోకి వస్తుందని, మహిళలు వ్యాపార రంగంలో ఎదిగేందుకు బ్యాంకులు ముందుకు రావాలని అన్నారు. 2025-26లో రైతులకు పంట రుణాల కింద రూ.1916 కోట్ల లక్ష్యానికి గాను రూ.1471 కోట్లు, వ్యవసాయ టర్మ్ రుణాల కింద రూ.651 కోట్లు పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ టర్మ్ రుణాలపై దృష్టి సారించాలని ఆదేశించారు.
ఎంఎస్ఎంఈలకు రూ.1215 కోట్ల లక్ష్యానికి గాను రూ.926 కోట్లు పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. 5111 స్వశక్తి సంఘాలకు రూ.361.60 కోట్ల బ్యాంకు రుణాలు అందించామని, మెప్మా లక్ష్యం కంటే అదనంగా 494 సంఘాలకు రూ.63.02 కోట్లు పంపిణీ చేశామని అధికారులు వివరించారు. మహిళా సంఘాల రుణాల రికవరీపై శ్రద్ధ పెట్టాలని, ఎన్పీఏ రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం స్వనిధి కింద వీధి వ్యాపారులకు రుణాలు నిర్దేశిత లక్ష్యం ప్రకారం పంపిణీ చేయాలని, చెల్లించినవారికి మరో విడత రుణాలు అందించాలని సూచించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద రూ.8.57 కోట్ల సబ్సిడీతో 119 యూనిట్లు, స్టాండప్ ఇండియా కింద రూ.5.17 కోట్ల సబ్సిడీతో 57 యూనిట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ముద్ర రుణాల కింద 14,718 మందికి రూ.173 కోట్లు అందించామని పేర్కొన్నారు. చిన్న ఆహార శుద్ధి కేంద్రాలకు 74 దరఖాస్తులు ఆమోదించి రుణాలు పంపిణీ చేశామని, మరో 37 పెండింగ్‌లో ఉన్నాయని.. వీటిని పరిశీలించి అర్హులకు రుణాలు అందించాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ స్కీం కింద 1270 మందికి రూ.11.43 కోట్ల రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే భారీ జరిమానాలు

నిబంధనల ప్రకారమే గ్రామాల్లో ప్రభుత్వ పాలన జరగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. గ్రామాలకు ఆర్థిక సంఘం నిధులు విడుదలైనందున పారిశుధ్య పనులు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ ఉండడానికి వీలులేదని, గ్రామ ఎంట్రన్స్‌లో చెత్త కనిపించకుండా మార్పు రావాలని అన్నారు.
మల్టీ పర్పస్ వర్కర్లను పూర్తిస్థాయిలో వినియోగించి చెత్త సేకరణ జరిగేలా చూడాలని, ప్రజలను భాగస్వామ్యం చేసి అవగాహన కల్పించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్‌లను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిలవకుండా, పిచ్చిమొక్కలు తొలగించాలని.. చెత్త వేసే వారిపై జరిమానాలు విధించి వసూలు చేయాలని స్పష్టం చేశారు. జీరో డెంగ్యూ కేసులు లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాల వద్ద మూడవ వైర్ పనులు పూర్తి చేయాలని, పగలు లైట్లు వెలగకుండా చూడాలని సూచించారు. భవన నిర్మాణాలు, లేఔట్ అనుమతులు నిబంధనల ప్రకారమే జారీ చేయాలని, విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో తాగునీరు ఇబ్బందులు రాకుండా ఫిబ్రవరి 1 నుంచి 20 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు అలసత్వం చేస్తే రద్దు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీఓలు, డీఎల్‌పీఓ దేవకీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రోడ్డెక్కి వివాహిత ఆందోళన

పోలీస్ స్టేషన్ ముందు ఆత్మహత్య యత్నం !

హుజూరాబాద్, ఫిబ్రవరి 3 (జనం సాక్షి) : భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని ఓ వివాహిత తల్లిదండ్రులతో రోడ్డెక్కి ఆందోళన చేపట్టిన ఘటన కలకలం రేపింది. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై వివాహిత ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మండలం తిగారం గ్రామానికి చెందిన గండ్రకోట జంపయ్య, మహాలక్ష్మి దంపతుల కుమార్తె పావనికి, హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కుంచపు అరవింద్ రెండేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లైన కొన్ని రోజుల నుంచే భర్త అరవింద్ అదనపు కట్నం కోసం పావనిని వేధింపులకు గురిచేయడం మొదలుపెట్టాడు. దీనిపై బాధితురాలు గతంలోనే హుజురాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పెద్దమనుషుల సమక్షంలో జరిగిన పంచాయితీలో ఇద్దరు విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒప్పందం కింద పావనికి రూ.9 లక్షలు ఇచ్చేందుకు భర్త అంగీకరించాడు. ఒప్పందంలో అంగీకరించిన ప్రకారం డబ్బులు ఇవ్వకుండా భర్త ఇబ్బంది పెడుతున్నాడని, దీనిపై పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదని బాధితురాలు ఆరోపించింది. గత కొద్ది నెలలుగా స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లె దని ఆందోళన వ్యక్తం చేస్తూ మంగళవారం తన తల్లిదండ్రులతో కలిసి ముందుగా పోలీస్ స్టేషన్ ముందు, తర్వాత స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బైఠాయించింది. అరగంటకు పైగా నిరసన కొనసాగడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన పావని. వెంట తెచ్చుకున్న డీజిల్ ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. అప్రమత్తమైన పోలీసులు ఆమెను అడ్డుకొని స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు ప్రధాన రహదారిపై ఏర్పడిన ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

సీఎం కప్ జిల్లా స్థాయి ఒకటి సమావేశం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : సియం కప్ 2025 కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అనుమతితో మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ విక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది.
ఈ సమావేశంలో సీఎం కప్ 2025 క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించిన తేదీలు, స్థాయిలు, క్రీడల ప్రదేశాలు తదితర అంశాలపై చర్చించారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీలు ఈనెల 03 నుండి 07 వరకు జిల్లా స్థాయి విజేతల పోటీలు 09నుండి 14 వరకు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం కప్ 2025 ను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు, క్రీడా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్వహించు క్రీడాంశాలు అథ్లెటిక్స్, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, విలువిద్య, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖో-ఖో, చెస్, కరాటే, కుస్తీ, బేస్‌బాల్, యోగా, నెట్‌బాల్, హాకీ, ఫుట్‌బాల్. ఈ సమావేశంలో జిల్లా యువజన , క్రీడల శాఖ అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్, జిల్లా అడిషనల్ ఎస్.కె. స్టాఫ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధి హీరాలాల్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జైపాల్ రెడ్డి, వివిధ క్రీడా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాలల్లో మహిళలపై లైంగిక వేదింపుల నిరోధక చట్టం కమిటీలు ఏర్పాటు చేయాలి

జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్ రావు

పెద్దపల్లి,ఫిబ్రవరి 03(జనంసాక్షి) :
పని ప్రదేశాలల్లో మహిళలపై లైంగిక వేదింపుల నిరోధక చట్టం అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలల్లో పని చేస్తున్నటు వంటి మహిళలపై పని ప్రదేశాలల్లో లైంగిక వేదింపుల నివారణ కొరకు 10 మంది మహిళలలు అంతకు మించి పని చేస్తున్న ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలల్లో చట్ట ప్రకారం కమిటీలు ఏర్పాటు చేయాలని ,పని ప్రదేశంలో మహిళల పై లైంగిక వేదింపుల నిరోధక చట్టం- 2013 ప్రకారం అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసి అట్టి కమిటీ సభ్యుల పేర్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్ హెచ్‌టిటిపి:// సిబాక్స్.టీజీ డబ్ల్యూడిసి డబ్ల్యూ.ఇన్ నందు నమోదు చేసి ఫిబ్రవరి 20లోగా కమిటీలు ఏర్పాటు చేయాలని లేనియెడల సంబంధిత అధికారికి, సంస్థ యాజమాన్యానికి చట్ట ప్రకా రం జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బిఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో కనబడ్డ జాగాలన్నీ కబ్జా

- మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మీ ఇండ్లను కూడా కబ్జా చేస్తారు జాగ్రత్త
- 6 గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ను నిలదీయండి
- కరీంనగర్ మేయర్ పీఠాన్ని అప్పగిస్తే మోదీని ఒప్పించి పెద్ద ఎత్తున నిధులు తెస్తా
- కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 03 (జనంసాక్షి) :
బీఆర్ఎస్ అంటే భూ రాక్షసుల పార్టీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభివర్ణించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో కనబడ్డ జాగాలన్నీ కబ్జా చేసి దోచుకుతిన్నారని మండిపడ్డారు. కరీంనగర్ లో భూకబ్జాలు చేసి ప్రజలను అరిగోస పెట్టిన 46 మంది బీఆర్ఎస్ నాయకులను జైలుకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. పొరపాటున బీఆర్ఎస్ ను గెలిపిస్తే మీ ఇండ్లను కూడా కబ్జా చేసి పుస్తెల తాడును కూడా దోచుకుంటారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద నయాపైసా లేదని, నన్ను కోసినా డబ్బులు రావని సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డే చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ను గెలిపిస్తే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి నిధులు ఎక్కడి నుండి తెస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీలను అమలు చేయకుండా నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ నేతలు ఓట్ల కోసం వస్తే నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం రోజు కరీంనగర్ లోని కోతిరాంపూర్ చౌరస్తాలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. మాజీ మేయర్ సునీల్ రావుతోపాటు 9, 39, 40

డివిజన్ల అభ్యర్థులు బండారు గాయత్రి, పసుపులేటి శివానందం, కాసర్ల లక్ష్మీ నర్సవ్వ హాజరయ్యారు. ఈ మూడు డివిజన్ల అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ...కరీంనగర్ అభివృద్ధి కోసం రూ.1500 కోట్లు తీసుకొచ్చిన, నేను ఏం అభివృద్ధి చేశాను? ఏయే పనులు చేశానో ఆ వివరాలతో బుక్ లెట్ కొట్టించి ఇంటింటికీ పంపుతున్నానాని, ఈ బుక్ లో ఉన్న వివరాలు తప్పయితే నాపై కేసు పెట్టుకోవచ్చని సవాల్ చేస్తున్నానని, బీఆర్ఎస్, కాంగ్రెస్ నిజంగా నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేస్తే ఎందుకు ఆ వివరాలను ఎందుకు బయటపెట్టడం లేదన్నారు. అంతెందుకు మనం నిలబడ్డ ఈ రోడ్డు పైన కల్పించే లైట్ల పైసలన్నీ స్మార్ట్ సిటీ నిధులతో వేసినవే, అంబేద్కర్ స్టేడియం నుంచి గణేష్ నగర్ రోడ్డు దాకా అప్పుడెట్ల ఉండేదో, ఇప్పుడెట్లా ఉందో ఒక్కసారి యాది జేసుకోండి అని అసలు ఈ రోడ్డు ఇంత బాగా అయితుందని ఊహించలేదని ఇక్కడి ప్రజలే చాలా సార్లు నాతో చెప్పారు. ఇదంతా ఎట్లా సాధ్యమైంది? మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే సాధ్యమైందన్నారు. భూ రాక్షసుల సమితికి రెండే లక్ష్యాలు, ఎవరి పొట్ట కొట్టాలి, ఎట్లా పైసలు సంపాదించాలి, ఈ రెండే వాళ్ళ నినాదాలు అని అందుకోసమే ఓట్లప్పుడు మీకు దండాలు పెడతారు. తర్వాత మీ జీవితాలతో ఆటలాడుకుంటారని, ఈ భూ రాక్షసుల మీద పోలీస్ స్టేషన్లలో 2 వేల 600 కుపైగా ఫిర్యాదులు అందాయంటే వీళ్ళ అరాచకాలు ఏ విధంగా సాగాయో గుర్తించండి. పొరపాటున ఇట్లాంటోళ్లను పాపం పోనీలే జాలి చూపి ఓట్లేస్తే మనకు పాపం తగులుతదని అందుకే ఈ ఒక్క సారి ఆలోచించి నిర్ణయం తీసుకోండి అని తెలిపారు. ఇగ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పనక్కర్లేదు. ప్రభుత్వం వద్ద పైసల్లేవు. 6 గ్యారంటీలను అమలు చేయడం లేదు. నన్ను కోసినా నయాపైసా లేదని సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డే చెప్పిండు. మరి కాంగ్రెస్ ను గెలిపిస్తే కరీంనగర్ అభివృద్ధికి ఎక్కడి నుండి తీసుకొస్తారు? దొంగ నోట్లు ఏమైనా ముద్రిస్తారా? పెండింగ్ లో ఉన్న పనులన్నీ పూర్తి కావాలంటే ఏం చేస్తారు? బీజేపీని గెలిపించి మేయర్ పీఠం అప్పగిస్తే కరీంనగర్ కు ఎన్ని వందల కోట్లు అయినా నేనిస్తానని ప్రధాని మోదీ చెప్పారు.
కరీంనగర్ లో 56 మంది కార్యకర్తలకే టిక్కెట్లు ఇచ్చాం. వాళ్లు దేశం కోసం, ధర్మం కోసం కొట్లాడే కార్యకర్తలు. కొన్ని రాజకీయ సమీకరణలు, గెలుపు అవకాశాల ద్రుష్ట్యా టిక్కెట్లు రాకపోవచ్చు. అంతమాత్రాన నిరాశ పడాల్సిన పనిలేదు. ఎవరికైనా టిక్కెట్ రాకపోతే వారికి పార్టీ పరంగా న్యాయం చేస్తాం అని కేంద్ర మంత్రి సంజాయ్ కుమార్ తెలిపారు.

సీఎంఆర్ డెలివరీ గడువులోగా పూర్తి చేయాలి

ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ముస్తాబాద్ ఫిబ్రవరి 3 (జనం సాక్షి) :
సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) డెలివరీ గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీపై రైస్ మిల్లుల యజమానులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 2024-25 ఖరీఫ్ సీజన్, 2024-25 రబీ సీజన్ కు మిల్లుల వారీగా వారికి కేటాయించిన ధాన్యం, డెలివరీ చేయకుండా పెండింగ్ లో ఉన్న ధాన్యం వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు.
రైస్ మిల్లుల వారీగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా గడువులోగా పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. మిల్లర్లు నిబంధనల ప్రకారం సీఎంఆర్‌ను సమయానికి డెలివరీ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఖరీఫ్ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి



కాలుష్యంతో విలవిల

- పరిశ్రమల కాలుష్యంతో పంచభూతాలు కలుషితం
- పొగతో సతమతమవుతున్న ప్రజానీకం
- కెమికల్ వాటర్ ను చెరువులోకి భూమిలోకి వదులుతున్న యాజమాన్యాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- రంగారెడ్డి జిల్లా ఎలికట్ట గ్రామంలో ప్రజల నరకయాతన

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) : ఆ ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనలు ఏవి వర్తించవు కాదు కాదు ఆ నిబంధనలను కాలుష్యకారక పరిశ్రమ యాజమాన్యాలు భూమిలోకి తొక్కిపడతారు అటువైపు కనీసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడరు ఆ ప్రాంత ప్రజలు కాలుష్యంతో పొగతో దుమ్ముతో ధూళితో నీటి కాలుష్యంతో పీల్చే గాలి సైతం కాలుష్యమైన గాలినే రోజు రోజువారీగా పీల్చుతూ శ్వాసకోశ రోగాల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్న పట్టించుకునే నాధుడే లేడు ఇది ఎక్కడో మారుమూల గ్రామంలో కాదు రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు రాత్రి అయితే చాలు ఎలికట్ట గ్రామ చుట్టుపక్కల ఉన్న కాలుష్యకారక పరిశ్రమల నుండి వెదజల్లే పొగతో ఎలికట్ట గ్రామంలో ఇంటిపైన వేసిన తెల్ల బట్టలు తెల్లారేసరికి పరిశ్రమలు వదిలే కాలుష్యంతో నల్లగా మారిపోతున్నాయి ఈ పొగ మరి మనుషుల శరీరంలోకి పోతే పరిస్థితి ఏమిటి కాలుష్యాన్ని నివారించే అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు ఇది ఇలా ఉంటే కంపెనీ పరిశ్రమల నుండి బోర్ మోటార్ల ద్వారా పరిశ్రమల నుండి విడుదలయ్యే కెమికల్ రసాయన పదార్థాల వ్యర్థ పదార్థాల నీళ్లను ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న చెరువులోకి వదలడం వల్ల ఆ నీటిని త్రాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయి మోటార్ల ద్వారా భూమిలోకి కెమికల్ వాటర్ ను వదలడంతో భూమిలో ఉన్న నీరు కూడా కాలుష్యకరంగా మారి నీళ్లు మొత్తం నల్లగా వస్తున్నాయని ఎలికట్ట గ్రామ ప్రజలు వాపోతున్నారు తమ ప్రాంతంలో భూములు తీసుకొని పరిశ్రమలు పెట్టుకొని ఇక్కడి ప్రాంత రైతుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని కాలుష్యాన్ని వదులుతూ తమ ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజలు కాలుష్యాన్ని నియంత్రించాల్సిన సంబంధిత శాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పరిశ్రమ యాజమాన్యాలు మరింత రెచ్చిపోయి విచ్చలవిడిగా కాలుష్యాన్ని వదులుతున్నారని దాంతో పంటలు పండక కాలుష్యంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు కాబట్టి ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పరిశ్రమల నుండి వదులుతున్న కాలుష్యాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు....

ఆర్యవైశ్యులే దేశ ఆర్థిక వెన్నెముక

- దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన అసలైన ఆర్కిటెక్ట్స్
- 'మేడ్ ఇన్ తెలంగాణ' ట్యాగ్ అంతర్జాతీయ మార్కెట్‌లో బెంచ్‌మార్క్‌గా మార్చాలన్నదే లక్ష్యం
- ఆలిండియా ఆర్యవైశ్య ఇండస్ట్రియలిస్ట్ ఫోరం సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 3 (జనంసాక్షి): ఆర్యవైశ్యులు అంటే ఒక కమ్యూనిటీ మాత్రమే కాదని ఈ దేశానికి ఆర్థిక వెన్నెముక, అసలైన 'వెల్త్ క్రియేటర్స్' మీరే అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం హైదరాబాద్ లో సిల్వర్ జూబ్లీ సందర్భంగా నిర్వహించిన ఆలిండియా ఆర్యవైశ్య ఇండస్ట్రియలిస్ట్ ఫోరం సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 'ఎకనామిక్స్' అనే పదం పుట్టకముందే, మార్కెట్ అనే కాన్సెప్ట్ ప్రపంచానికి తెలియకముందే, దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన అసలైన ఆర్కిటెక్ట్స్ ఆర్యవైశ్యులేనని చెప్పారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు స్టార్టప్‌ల గురించి మాట్లాడుతున్నా వందల ఏళ్ల క్రితమే ఎలాంటి సపోర్ట్ లేకుండా వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించిన అసలైన ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆర్యవైశ్యులేనని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.ఒకప్పుడు కస్టమర్ షాపుకు వచ్చేవాడని, ఇప్పుడు బిజినెస్ కస్టమర్ దగ్గరకే వెళ్తోందని చెప్పారు.టెక్నాలజీ ఇప్పుడు ఆప్షన్ కాదు, అవసరమని అన్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, ఆటోమేషన్ వంటి ఆధునిక టెక్నాలజీలు కేవలం ఐటీ కంపెనీలకే కాకుండా సంప్రదాయ వ్యాపారాలను 'స్మార్ట్ బిజినెస్‌లు'గా మార్చడానికి ఉపయోగపడతాయని మంత్రి వివరించారు. గత రెండేళ్లలో తెలంగాణ పారిశ్రామికవేత్తలకు స్వర్గధామంలా మారిందని, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందని మంత్రి అన్నారు.'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పాటు 'పీస్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'అందిస్తున్న ప్రో-బిజినెస్ ప్రభుత్వం తమదని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 'లోకల్ ప్రొడక్షన్ టు గ్లోబల్ డామినేషన్' లక్ష్యంగా తెలంగాణను ప్రపంచ పారిశ్రామిక పటంలో అగ్రస్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' ట్యాగ్‌ను అంతర్జాతీయ మార్కెట్‌లో క్వాలిటీ బెంచ్‌మార్క్‌గా మార్చాలన్నదే లక్ష్యమని చెప్పారు. ఆర్యవైశ్యులు ఇక మైక్రో లెవల్ ఆలోచనలకే పరిమితం కాకుండా మ్యాక్రో లెవల్‌లో ఇంపాక్ట్ క్రియేట్ చేయాలని సూచించారు. ఇన్నోవేటివ్, డిస్రిప్టివ్ ప్రాజెక్ట్‌లతో ముందుకు రావాలని, ప్రభుత్వమే పూర్తి మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు. అన్నదానం, విద్యాదానం, ధార్మిక కార్యక్రమాల ద్వారా సమాజానికి తిరిగి ఇస్తున్న సేవ ఆర్యవైశ్యుల ప్రత్యేకత అని ప్రశంసించారు. సిల్వర్ జూబ్లీ దాటి గోల్డెన్ జూబ్లీ దిశగా ఆర్యవైశ్యుల ప్రయాణం కొనసాగాలని, తెలంగాణ అభివృద్ధిలో వారి భాగస్వామ్యం ఎప్పటికీ కీలకంగా ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు.

మండలంలోని శ్రీ బాలాజీ ఇండస్ట్రీని తనిఖీ చేసిన అధికారులు

యాలాల ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మండలంలోని శ్రీ బాలాజీ ఇండస్ట్రీలో సంబంధిత అధికారులు తనిఖీ నిర్వహించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని లక్ష్మీనారాయణ పూర్ చౌరస్తా సమీపంలో ఉన్న శ్రీ బాలాజీ ఇండస్ట్రీని జిల్లా అదనపు కలెక్టర్ తో కలసి జిల్లా డిసిఎస్ ఓ డైరెక్టర్ మేనేజర్ పౌరసరఫరాల సంస్థ మరియు డిటిఎస్ లు సంయుక్తంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో బాగంగా జిల్లా రైస్ మిల్లర్లకు రబీ 2024-25 సీజన్ కు సంబంధించినవి సిఎంఆర్ బియ్యం పెట్టడం కొరకు చివరి.తేదీ 28.02.2026గా ప్రభుత్వం నిర్ణయించినది. అందరూ మిల్లర్లు పై తేదీని దృష్టిలో ఉంచుకొని తమయొక్క మిగిలిన సిఎంఆర్ బియ్యం ఎఫ్.సి. ఐకి డెలివరీ చేయాలని సూచించారు.

ర్యాండమైజేషన్ ద్వారా పిఒ, ఎపిఓల ఎంపిక

పారదర్శకంగా ఎన్నికల విధులకు నియామకం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 03 (జనంసాక్షి): మున్సిపాలిటీలు, మున్సిపల్ సంస్థల సాధారణ ఎన్నికలు 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు పిఒలు, ఎపిఓలను ర్యాండమైజేషన్ విధానంలో పారదర్శకంగా ఎంపిక చేశారు.మంగళవారం కలెక్టరేట్ విసి హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు కొర్ర లక్ష్మి, జిల్లా కలెక్టర్ మను చౌదరి సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీల పరిధిలోని 68 వార్డులకు సంబంధించిన 136 పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించేందుకు మొత్తం 818 మంది ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, డిఈఓ విజయ కుమారి, సివిల్ సప్లై డిఎం సుగుణ బాయి, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎఓ సుజాత పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే.. బీటలు వారిన వార్డులో

అభివృద్ధికి బాటలు వేస్తా

వార్డు సమస్యలపై ప్రత్యేక దృష్టి

బిఆర్ఎస్ పార్టీ 23 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పరిమళ రవీందర్

తాండూరు ఫిబ్రవరి 3(జనంసాక్షి) : బిఆర్ఎస్ పార్టీ 23 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పరిమళ రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ని వాల్మీకి నగర్ 23వ వార్డులో స్థానిక మహిళలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ 23 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పరిమళ రవీందర్ మాట్లాడుతూ గత కౌన్సిలర్ నిర్లక్ష్యం ద్వారానే వార్డు అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. బిఆర్ఎస్ పాలనలోనే 23వార్డును అంచెలంచెలుగా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు మరోసారి అవకాశం ఇస్తే బిటలు వారిన వార్డులో అభివృద్ధి పరుగులు తీస్తామన్నారు. వార్డులో నెల కోన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. వార్డు అభివృద్ధి చెందాలంటే తనను ఆశీర్వదించి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డల రవీందర్ పరిమళ,మాజీ సర్పంచ్ కేశవరావు ధర్మీది రవి, వార్డు నాయకులు మహిళలు తదితరులు ఉన్నారు.

కేబుల్ బ్రిడ్జిపై పల్సర్ దగ్ధం

- తృటిలో ప్రాణాపాయం తప్పించుకున్న వైనం

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం కేబుల్ బ్రిడ్జిపై అకస్మాత్తుగా ఓ పల్సర్ వాహనం తగలబడిపోయింది. వాహనదారుడి అప్రమత్తతతో తృటిలో ప్రమాదం తప్పింది. మాదాపూర్ పోలీస్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం జూబ్లీహిల్స్ నుండి మాదాపూర్ వైపు జతిన్ అనే వ్యక్తి తన పల్సర్ బైక్ పై వస్తుండగా కేబుల్ బ్రిడ్జి వద్దకు రాగానే బైక్‌లో అకస్మాత్తుగా మంటలు చెల్లరేగాయి. దీంతో అతడు చాకచక్యంగా తన పల్సర్ బైకును కేబుల్ బ్రిడ్జి పై రోడ్డు పక్కన ఆపి వెంటనే వాహన పైనుండి దిగిపోవడంతో అతనికి పెను ప్రమాదం తప్పింది. చూస్తుండగానే క్షణాల్లో బైకు పూర్తిగా దగ్ధమైపోవడం తో అవాక్కవడం జతిన్ వంతు అయ్యింది. కాగా రోడ్డుపైనే పల్సర్ బైక్ తగలబడిపోవడంతో భయభ్రాంతులకు గురైన వాహనదారులు కొద్దిసేపు దాని పక్కనుండి పోవడానికి ఇబ్బందిపడి ఆగిపోవడంతో అక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పల్సర్ బైక్ మంటలను ఆర్పివేయడంతో పాటు వివరాలను అడిగి కేసు నమోదు చేయడం జరిగింది.

27వ వార్డు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకేల్లడమే మా లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి స్వరూప మల్లేశం

తాండూరు ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : వార్డు సమగ్ర అభివృద్ధే మా లక్ష్యమని 27వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్వరూప మల్లేశం పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం లో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 27వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్వరూప మల్లేశం మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో ఇప్పటికే వార్డు పరిధిలో 35 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. ఎమ్మెల్యే సహకారంతో వార్డుల్లో గల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు. ముఖ్యంగా సిసి రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలు, మురుగు కాలువలను నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తామని ఆశీర్వదించి గెలిపించాలని 27వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో ఉద్యమం కాంగ్రెస్ పార్టీ మాజీ మహిళా అధ్యక్షురాలు శోభారాణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.బసవరాజ్, నాయకులు దావులయ్య, మైనార్టీ నాయకులు మెహరాజ్, నయీమ్, యువ నాయకులు పునీత్, జగదీష్, రవితేజ,ముఖేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోకాపేట సర్వే నెంబర్ 147లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని గండిపేట్ మండల తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఆయన ఆదేశాల మేరకు కోకాపేట సర్వే నంబర్ 147లోని 320 గజాల ప్రభుత్వ భూమిపై అక్రమంగా కబ్జా చేసిన 80 గజాల నాలుగు ప్లాట్లతో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులుజెసిబి సహాయంతో కూల్చివేసి నేలమట్టం చేశారు. భవిష్యత్తులో కూడా అక్రమ కబ్జాలపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

మున్సిపల్ పోరులో 113 మంది అభ్యర్థులు

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- ప్రధాన పార్టీలకు తప్పని రెబల్స్ బెడద
- మైనార్టీలకు చోటువ్వని పార్టీలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల విత్ డ్రా మంగళవారం ముగిసింది. వేములవాడ మున్సిపల్ పరిధిలో 28 వార్డులకు ప్రధాన పార్టీల అభ్యర్థులతో కలిపి మొత్తం113 మంది బరిలో ఉన్నారు. చివరి నిమిషం వరకు నామినేషన్ రెబల్స్ లేకుండా ఉండేందుకు ఆయా పార్టీల నాయకులు ప్రయత్నాలు చేసినప్పటికీ పలువురు ససేమీరా అనడంతో పలు వార్డుల్లో రెబల్ బెడద తప్పడం లేదు.దీంతో ఆయా పార్టీల ఓట్లు చీలే అవకాశం ఉండటంతో గెలుపుపై ప్రభావం చూపనుందన్న ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది.

ఊపందుకోనున్న ప్రచారం..

నామినేషన్ విత్ డ్రా ముగియడంతో ప్రచారం ఊపందుకోనుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అభ్యర్థులు గెలుపును తన భుజాలపై వేసుకున్నారు.బీజేపీ ఇప్పటికే మాజీ మంత్రి ఇనుగాల పెద్ది రెడ్డిని ఇంచార్జి గా నియమించింది.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆధ్యాత్మిక పట్టణం వేములవాడ మున్సిపల్ పీఠం కైవసం చేసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించారు.నేడు పట్టణంలో పర్యటించనున్నారు. బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ లక్ష్మీనరసింహరావు పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి ప్రచారం సాగిస్తున్నారు.పదేళ్ల లో జరిగిన అభివృద్ధి వివరిస్తున్నారు.

మూడు పార్టీల్లో మైనార్టీలకు దక్కని చోటు..

మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలలొ మైనార్టీలకు టికెట్ ఇవ్వలేదు. మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యర్థులను నిలపలేదు. మైనార్టీల ఓటు బ్యాంకు ఉన్న చోట కూడా వారికి టికెట్ కేటాయించక పోవడం ఆ వర్గంతో పాటు పట్టణంలో చర్చ నియాంశంగా మారింది. మైనార్టీల ఎవరి వైపు మొగ్గు చూపుతారోనన్న ఆసక్తి నెలకొంది.

వేములవాడ మున్సిపల్ బరిలో 3 ప్రధాన పార్టీల అభ్యర్థుల జాబితా..

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు..	బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు	బిజెపి అభ్యర్థులు..
1 వార్డ్ సంఘ హన్మవ్వ,	1 వార్డ్ రేగుల లత,	1 వార్డ్ మేకల రేనా,
2 వార్డ్ జ్యోతి లింగంపల్లి,	2 వార్డ్ ఏనుగు జ్యోతిరెడ్డి,	2 వార్డ్ గుడిసె లక్ష్మి,
3 వార్డ్ గుడిసే సంతోష,	3 వార్డ్ ఉల్లెందుల లక్ష్మి,	3 వార్డ్ చిట్యాల లక్ష్మి,
4 వార్డ్ తోట రాజు,	4 వార్డ్ మారం కుమార్,	4 వార్డ్ రేగుల రాజ్ కుమార్,
5 వార్డ్ బొజ్జ భారతి,	5 వార్డ్ వాసాల లావణ్య,	5 వార్డ్ లాల శ్రీలత,
6 వార్డ్ కాశ శ్రీనివాస్,	6 వార్డ్ నీలం శేఖర్,	6 వార్డ్ పల్లపు లక్ష్మణ్,
7 వార్డ్ అక్కనపల్లి నరేష్,	7 వార్డ్ సుంకపాక రాజు,	7 వార్డ్ శ్యామల శ్రీవాణి,
8 వార్డ్ సాగరం వెంకటస్వామి,	8 వార్డ్ కందుల క్రాంతి కుమార్,	8 వార్డ్ మైలారం శ్రీనివాస్,
9 వార్డ్ నీలం మమత,	9 వార్డ్ రామతీర్థపు మాధవి,	9 వార్డ్ శాతాని అనూష,
10 వార్డ్ సిరిగిరి సంగీత,	10 వార్డ్ మొట్టల అనూష,	10 వార్డ్ స్వప్న,
11 వార్డ్ సరిపెల్లి అర్చన,	11 వార్డ్ వెంగల అనిత.	11 వార్డ్ ద్వారక శ్రీదేవి,
12 వార్డ్ రామతీర్థపు కృష్ణవేని,	12 వార్డ్ నిమ్మశెట్టి విజయ్,	12 వార్డ్ సార్ల చారి,
13 వార్డ్ మూడపల్లి నీలమ్మ,	13 వార్డ్ లింగంపల్లి మమత,	13 వార్డ్ పారేటి శ్రీలత,
14 వార్డ్ తూము మధు,	14 వార్డ్ నిమ్మశెట్టి రాజు,	14 వార్డ్ లక్కాకుల శ్రీనివాస్,
15 వార్డ్ పుల్కామ్ రాజు,	15 వార్డ్ గోస్కుల నరసయ్య,	15 వార్డ్ ముదాం శంకర్,
16 వార్డ్ కూరగాయల శ్రీశైలం,	16 వార్డ్ కొండ కనకయ్య,	16 వార్డ్ వంగల శ్రీనివాస్
17 వార్డ్ అక్కి గణేష్,	17 వార్డ్ పబ్బ మహేష్,	17 వార్డ్ కొండ్లపు చిన్న ముత్యం,
18 వార్డ్ కొండా రాజశేఖర్,	18 వార్డ్ కొండ నరసయ్య,	18 వార్డ్ కాసారపు అభిషేక్,
19 వార్డ్ సూగురి లక్ష్మి,	19 వార్డ్ జంగిటి శ్రీనిధి,	19 వార్డ్ రేగుల రాధిక,
20 వార్డ్ పెంటా స్వరుణ్,	20 వార్డ్ సందుల మహేశ్వరి,	20 వార్డ్ కుమ్మరి శంకర్,
21 వార్డ్ కోయల్కార్ మస్తాన్,	21 వార్డ్ నరాల శేఖర్,	21 వార్డ్ మహంకాళి శ్రీనివాస్,
22 వార్డ్ ఇప్పపుల మమత,	22 వార్డ్ లైసెట్టి లావణ్య,	22 వార్డ్ బచ్చు శిరీష,
23 వార్డ్ నామల ఉమా,	23 వార్డ్ మోతుకు జమున,	23 వార్డ్ బోనాల సాగరిక,
24 వార్డ్ అన్నారం శ్రీనివాస్,	24 వార్డ్ నామాల కమలాకర్,	24 వార్డ్ రాపెల్లి శ్రీధర్,
25 వార్డ్ కొక్కుల బాలకృష్ణ,	25 వార్డ్ గూడూరి మధు,	25 వార్డ్ బిల్ల కృష్ణ,
26 వార్డ్ సిర్రం శిరీష,	26 వార్డ్ మామిండ్ల జమున,	26 వార్డ్ మామిండ్ల అనుష,
27వార్డ్ బుట్టి లావణ్య,	27 వార్డ్ పెద్ది లలిత,	27 వార్డ్ రేగుల రేణుక,
28వార్డ్ గోపన్నగారి మాధవి..	28 వార్డ్ పైడి స్వప్న బరిలో వున్నారు.	28 వార్డ్ ప్రతాప హిమబిందు బరిలో వున్నారు.

సూర్య చిన్నపిల్లల ఆస్పత్రి ల్యాబ్ సీజ్

- తప్పుడు రిపోర్టులు, నకిలీ వైద్యంపై అధికారుల కొరడా!
- కదిలిన జిల్లా అధికారులు
- సంచలనం సృష్టిస్తున్న జనంసాక్షి కథనాలు

కొండుర్గ్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా చౌదర్ గూడ మండలం లాల్ పహాడ్ గ్రామంలోని 'సూర్య చిన్నపిల్లల ఆస్పత్రి'లో జరుగుతున్న అక్రమాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. జనంసాక్షి పత్రికలో వచ్చిన సంచలన కథనాలకు స్పందించిన అధికారులు, సోమవారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి ల్యాబ్‌ను సీజ్ చేశారు. లాల్ పహాడ్ సూర్య ఆస్పత్రిలో రోగులకు తప్పుడు ల్యాబ్ రిపోర్టులు ఇస్తున్నారని, అర్హత లేని వ్యక్తులు వైద్యం అందిస్తున్నారని జనంసాక్షి వరుస కథనాలను ప్రచురించింది. ఈ వార్తలతో అప్రమత్తమైన జిల్లా వైద్య అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి నేతృత్వంలోని బృందం ఏర్పాటు చేసి ఆస్పత్రిని సందర్శించారు. అధికారులు తనిఖీ చేసే సమయానికి ఆస్పత్రిలో అసలు డాక్టరే లేకపోవడం గమనార్హం.

పేరు ఒకరిది.. వైద్యం మరొకరిది:

ఈ ఆస్పత్రి డా. రామకృష్ణ ఎంబిబిఎస్ పేరుతో అనుమతులు పొందింది. అయితే, క్షేత్రస్థాయిలో మాత్రం మల్లేష్ అనే బిఏఎంఎస్ వైద్యుడు అన్నీ తానై వైద్యం అందిస్తున్నట్లు సమాచారం.ల్యాబ్ నిర్వాహకులు రోగులకు శాస్త్రీయత లేని, తప్పుడు రిపోర్టులు ఇస్తున్నట్లు గుర్తించిన అధికారులు తక్షణమే ల్యాబ్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఆస్పత్రికి సంబంధించిన అన్ని ఒరిజినల్ పత్రాలను, సర్టిఫికెట్లను వెంటనే కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. ఆస్పత్రి నిర్వహణపై పూర్తిస్థాయి ఎంక్వైరీ కమిటీని వేసి, నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. అనుమతులు ఒకరి పేరు మీద తీసుకుని, మరొకరు వైద్యం చేయడం చట్టరీత్యా నేరమని ఆమె హెచ్చరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులు, నిబంధనలు పాటించని ఆస్పత్రులపై జనంసాక్షి సాహసోపేతమైన కథనాలు ప్రచురించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల స్పందనతోనైనా ఈ ప్రాంతంలో అక్రమ వైద్యానికి అడ్డుకట్ట పడుతుందని అంటున్నారు..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04 ఫిబ్రవరి 2026

వరంగల్ జూలో తెల్లపులి మృతి

- వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు

వరంగల్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : నగరంలోని హంటర్ రోడ్డు కాకతీయ జూలజికల్ పార్క్ లో వైట్ టైగర్ (శరణ్) మంగళవారం తెల్లవారుజామున ఎక్లోజర్ లో చనిపోయింది. వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ తో చనిపోయిందని జూ అధికారులు అంటున్నారు. మంగళవారం పులి అంత్యక్రియలు చేసినట్లు జూపార్క్ పర్యవేక్షణ అధికారి మయూరి తెలిపారు. అయితే అధికారుల మెంటనెన్స్ సరిగా లేకనే రెండు రోజులుగా అనారోగ్యానికి గురై చనిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జూ పార్క్ నుంచి తెల్ల పులిని జూలై మాసంలో వరంగల్ తీసుకొచ్చారు. పులి సంరక్షణ సరిగా లేకనే అనారోగ్యానికి గురై మృత్యు వాత పడినట్లు సమాచారం. అధికారులు మాత్రం పులి అనారోగ్యం, గుండె పోటుతో చనిపోయిందని చెబుతున్నారు. జిల్లా అధికారులు పులి మృతి విషయం గోప్యన్గా ఉంచి, అంత్యక్రియల తరువాతనే అనారోగ్యంతో మృతి చెందినదని జూ అధికారి చెప్పడం గమనార్హం.

గర్భిణికి ఎన్‌టి స్కాన్‌లో తప్పుడు రిపోర్టు

- విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు భారీ జరిమానా



హైదరాబాద్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : తప్పుడు రిపోర్టులు ఇచ్చిన విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వినియోగదారుల హక్కుల కమిషన్ భారీ జరిమాన విధించింది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన భార్గవి అనే గర్భిణి, తన గైనకాలజిస్ట్ సూచన మేరకు ఎన్‌టీ స్కాన్ కోసం స్థానిక విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ఆశ్రయించింది. అయితే పరీక్ష అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి అంతా సాధారణంగానే ఉందని సదరు సెంటర్ సిబ్బంది రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టుపై అనుమానం వచ్చిన భార్గవి మరో డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తిరిగి పరీక్ష చేయించుకోగా షాకింగ్ నిజం వెలుగులోకి వచ్చింది. కడుపులోని శిశువు మెడపై సుమారు 11 ఎంఎం మేర సిస్ట్ (గడ్డ) ఉన్నట్లు రెండో రిపోర్టులో తేలింది. దీంతో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఇచ్చిన తప్పుడు రిపోర్టును నమ్మి ఉంటే తల్లీబిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు, వైద్యుల సలహా మేరకు తన గర్భాన్ని తొలగించుకోవాల్సి వచ్చిందని తెలిపింది. అలాగే తనకు తప్పుడు రిపోర్టులు ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కమిషన్, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ వైఖరిలో స్పష్టమైన నిర్లక్ష్యం ఉందని నిర్ధారించింది. దీంతో బాధితురాలికి కలిగిన మానసిక వేదనకు గానూ రూ. 2 లక్షల పరిహారం, కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 20 వేలు, పరీక్ష ఫీజు రూ. 1,700 తక్షణమే చెల్లించాలని సదరు యాజమాన్యాన్ని ఆదేశిస్తూ కీలక తీర్పునిచ్చింది.

సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

- ఉచితాలను ప్రకటించడానికి కాదు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

జీవన్ రెడ్డి వర్గీయులకు మొండిచేయి

- జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ అనుచరులకు పెద్దపీట
- కాంగ్రెస్ తీరుతో మరోమారు తీవ్ర అసంతృప్తిలో జీవన్ రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : జగిత్యాల జిల్లాలో మున్సిపల్ టిక్కెట్ల కేటాయింపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కనున్నల్లోనే కేటాయించారు. ఆయన సూచించిన వారికే టిక్కెట్లు దక్కాయి. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మోమారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీట్ల పంపకంలో.. తన గొంతు కోశారని, కాంగ్రెస్ అధిష్ఠానం తన వర్గానికి న్యాయం చేయలేదని అనుచరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే ఎం.సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించి నట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు ఏడాదిన్నర కాలంగా సంజయ్ కుమార్, జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనే ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపులో జీవన్ రెడ్డి రియాక్షన్‌పై జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతా ఏర్పాట్లు పెంచారు పోలీసులు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి భవిష్యత్తు క్లైమాక్స్‌కు చేరుకుందనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి.

శ్రీ చైతన్య విద్యార్థి ఆత్మహత్యకేసులో ప్రిన్సిపాల్, లెక్చరర్ల అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి3 (జనంసాక్షి) : కృష్ణాజిల్లా పోరంకిలోని శ్రీ చైతన్య కాలేజీలో విద్యార్థి ఆత్మహత్యలో కీలక పరిణామం చోటుచేసుకుంది. జనవరి 30న హాస్టల్ రూమ్ లో ఫ్యాన్ ఉరివేసుకుని పవన్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత డిసెంబర్ నెలలో పవన్ కుమార్ తోటి విద్యార్థి హేమంత్ కి హాస్టల్లో చెలరేగిన వివాదంతో జనవరి 5న పవన్ ను హేమంత్ కొట్టాడు. కొట్టిన దృశ్యాలు ఇంస్టాగ్రామ్ లో హేమంత్ పోస్ట్ చేశాడు. జనవరి 30న మరోసారి పవన్ కుమార్ పై హేమంత్ దాడి చేశాడు.దీంతో మనస్థాపానికి గురై హాస్టల్ లో ఫ్యాన్ కి ఉరి వేసుకుని పవన్ ఆత్మహత్యకి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారకులైన వారి పేర్లు తన చేతిపై పవన్ రాసుకున్నాడు. ఆత్మహత్య గల కారణాలను గోప్యంగా చైతన్య యాజమాన్యం ఉంచింది. ఈ విషయంలో సాక్షాలను శ్రీ చైతన్య యాజమాన్యం తారుమారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి చేతిపై ఉన్న పేర్లు శ్రీ చైతన్య సిబ్బంది తుడిచేసినట్టు పోలీసులు గుర్తించారు. దీనితో కాలేజీ ప్రిన్సిపల్ పిచ్చయ్య, ఇంచార్జ్ రవీంద్ర, జూనియర్ లెక్చరర్ లు రాజేష్, ఆనంద్, కృష్ణ మెస్ బాయ్ హేమంత్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.

బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

- వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు
- అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మేడారం జాతర స్ఫూర్తితో గోదావరి పుష్కరాలు

- ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి
- మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంత మైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాలను కూడా రేవంత్ ప్రభుత్వం విజయవంతం చేస్తుందని అన్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మేడారం మహాజాతర అత్యంత వైభవంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగియడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గత జాతరల కంటే మెరుగైన ఏర్పాట్లు చేశామని, అమ్మవార్ల ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఆమె కొనియాడారు. ఈ ఏడాది జాతర అంచనాలకు మించి జరిగిందని మంత్రి తెలిపారు. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో 'తిరుగు జాతర' నిర్వహణతో ఈ వేడుకలు పూర్తిస్థాయిలో ముగుస్తాయని వెల్లడించారు. జాతర ఏర్పాట్లపై కొంతమంది కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపిస్తూ, జాతర ఏర్పాట్లు విఫలమయ్యాయనే రీతిలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులను గమనించిన ప్రతిపక్ష నాయకులు సైతం ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించడం సంతోషకరమని ఆమె అన్నారు. జాతరలో మంత్రి సీతక్క చేసిన నృత్యంపై వచ్చిన వ్యాఖ్యలకు ఆమె దీటుగా సమాధానమిచ్చారు. మా ఆదివాసీ సంస్కృతిలో నృత్యం అనేది ఒక భాగం. విదేశాల నుంచి వచ్చేవారు కూడా మా నృత్యాలను ఇష్టపడి చేస్తున్నారు. అలాంటప్పుడు మా సొంత గడ్డపై, మా సంస్కృతిలో భాగంగా నేను నృత్యం చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు.ఇది తన మూలాలకు, ప్రజలకు ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. వచ్చే జాతర నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం చుట్టుపక్కల ఉన్న రోడ్లను వెడల్పు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, త్వరలో రాబోయే గోదావరి పుష్కరాల గురించి ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

వీఎస్ఆర్ కంపెనీకి విమానయానశాఖ షాక్

- అజిత్ పవార్ విమాన ప్రమాదంపై డిజిసిఎ దర్యాప్తు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) దర్యాప్తును ముమ్మరం చేసింది. వీఎస్ఆర్ వెంచర్స్‌పై స్పెషల్ ఆడిట్‌కు ఆదేశించింది. ఫిబ్రవరి 15వ తేదీలోగా ఆడిట్ పూర్తి చేసే అవకాశం కనిపిస్తోంది. వీఎస్ఆర్ కంపెనీకి చెందిన బ్యాలెన్స్ షీట్స్, లాగ్ బుక్స్‌ను అధికారులు చెక్ చేయనున్నారు. ఈ చెకింగ్స్ ద్వారా ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన మెయిన్‌టెన్స్ వివరాలు తెలుసుకోనున్నారు. ప్రోటోకాల్ ప్రకారం లాగ్ బుక్ ఫిల్ చేస్తున్నారా? లేదా గుర్తించనున్నారు. మరో వైపు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) కూడా ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తోంది. అజిత్ పవార్ లియర్‌జెట్ 45ఎన్ఎఫ్ విమానంలో ప్రయాణిస్తూ ప్రమాదా నికి గురయ్యారు. ఈ లియర్‌జెట్ 45చీఫీ విమానం వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినది. విమానాలను అద్దెకు ఇచ్చే అతి పెద్ద సంస్థలలో వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఒకటి. ప్రమాదం జరిగిన తర్వాత సంస్థ యజమాని వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. 'నా దగ్గర ఉన్న విమానాలు అన్నీ చాలా మంచి కండీషన్‌లో ఉన్నాయి. వాటిని ఎందుకు నిలిపివేస్తాను. లియర్ జెట్ విమానాలకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది. అలాంటి వాటిని నేను కచ్చితంగా నిలిపివేయను' అని స్పష్టం చేశారు. అజిత్ అనంతరావు పవార్ జనవరి 28వ తేదీన బారామతిలో జరిగే ఓ కార్యక్రమానికి వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లియర్‌జెట్ 45ఎన్ఎఫ్ విమానంలో బయలుదేరారు.

రేకుర్తిలో మళ్లీ భూకబ్జా యత్నాలు

- ప్రైవేటు ల్యాండ్‌లో పాగా వేసేందుకు అక్రమార్కుల కుట్ర
- మురికి కాలువల నిర్మాణం పేరిట అక్రమంగా చొరబాటు
- ఇదేంటని అడిగినవారిపై దాడి.. చంపుతామని బెదిరింపులు
- కొత్తపల్లి పోలీసులకు బాధితుల ఫిర్యాదులు



కరీంనగర్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : కరీంనగర్ శివారులోని రేకుర్తిలో మళ్లీ భూకబ్జాకు తెరలేపారు కొందరు కబ్జాదారులు. గతంలోనే ఎన్నో కేసులైనా మరోసారి అక్రమంగా చొరబాటుకు యత్నించారు. ప్రైవేటు జాగాల్లో పాగా వేసేందుకు సరికొత్త ఎత్తుగడలు పన్నారు. మురికి కాలువల నిర్మాణం పేరిట ఏకంగా జేసీబీలను తీసుకొచ్చి తవ్వకాలు చేపట్టారు. ఇదేంటని అడగబోయిన భూ యజమానులపైనే ఎదురుదాడికి దిగి, చంపేస్తామని బెదిరింపులకు గురిచేశారు. గత మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనలో పలువురు ప్రముఖుల హస్తమున్నట్టు తెలుస్తుండగా.. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా రేకుర్తి రెవెన్యూ శివారు సర్వే నెంబర్ 74లో షేక్ హసన్ పేరిట 1.01 ఎకరాల భూమి ఉంది. అది షేక్ అబూబకర్ ఆధీనంలోనే కలదు. ఆ జాగాలో పిచ్చి చెట్లు పెరగడంలో షేక్ ఖమర్ (అబూబకర్ వద్ద పనిచేసే వ్యక్తి) భూమిని చదును చేయించాడు. ఈ క్రమంలో ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీతో కందకం తీసేందుకు ప్రయత్నించగా.. కిన్నెర రాజేశం తనకు ఫోన్ చేసినట్టు షేక్ ఖమర్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అతను అక్కడికి చేరేలోపే రాజేశంపై పదిమంది గుర్తు తెలియని వ్యక్తులు దాడికి యత్నించారు. ఇదేంటని అడిగితే 'ఇది మా భూమి. ఇక్కడ మీకు భూమి లేదు' అంటూ నానా దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించారని షేక్ ఖమర్ వాపోయాడు. సర్వే నెంబర్ 74లో అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు కందకాలు తవ్వి లక్ష రూపాయలకు పైగా నష్టం కలిగించారని బాధితుడు షేక్ ఖమర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్రమంగా జేసీబీతో చొరబడినవారిపై, బెదిరించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ విషయమై అదేరోజు కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు నమోదైంది. అయితే కబ్జా కేసులో నిందితునిగా ఉన్న రత్నాకర్, అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే ఘటనా స్థలానికి రావడం గమనార్హం. ఈ ఘటనపై కరీంనగర్ కమిషనర్‌కు భూయజమాని కూడా ఫిర్యాదు చేశాడు. ఇది ప్రభుత్వ భూమి కాదని, ప్రైవేటు భూమి అని తెలిపారు. కొందరు మురికికాలువల సాకుతో అక్కడికి చొరబడి అక్కడున్న మొత్తం భూములను కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

సచివాలయంలో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహణ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : డా. బి.ఆర్. అంబెడ్కర్ తెలంగాణా సచివాలయంలో ఉదయం ఫైర్ మాక్ డ్రిల్ ను నిర్వహించారు. ప్రమాద వశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అగ్ని మాపక పరికరాలను ఏవిధంగా ఉపయోగించాలి తదితర అంశాలపై నేడు ఉదయం చేసిన మోక్ డ్రిల్ లో వివరించారు. సచివాలయం సీఎస్ఓ దేవీ దాస్, అసిస్టెంట్ కమాండెంట్స్ అప్పాజీ, పవన్ కుమార్, ఏ.డి.ఎఫ్.ఓ జీ.వి. ప్రసాద్, ఎస్.ఎఫ్.ఓ జాన్యా లతోపాటు సచివాలయానికి చెందిన దాదాపు 100 టీ,జి.ఎస్.పి.ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయండి: బండి

కరీంనగర్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ శ్రేణులు కష్టపడి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.'నేను కేసీఆర్‌ని గజగజ వణికించా. నా తలకాయను కేసీఆర్.. ఆరు ముక్కలు చేస్తానని గతంలో అన్నారు. ఆయన సంగతి తేల్చేందుకు ఫామ్‌హౌస్‌కు వస్తానని చెప్పా. ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్‌ను బజార్‌కు లాక్కొచ్చా. కేసీఆర్ మెడలు వంచింది నేనే. నేను ఎవరికీ భయపడను. గడీల నుంచి కేసీఆర్‌ను నేనే బయటకు తీసుకువచ్చా' అని బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్ చేశారు.

మరోమారు ఝులక్ ఇచ్చిన పసిడి ధరలు

- తగ్గినట్లే తగ్గి పెరిగిన బంగారం, వెండి రేట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (జనంసాక్షి) : తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర 1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370